సంపుటి: 22
సంచిక: 3

ఫోన్ నెం. 36959

అపరాధ పరిశోధన

డిటెక్టివ్ కథల మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 39 రూపాయలు
జీవిత చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 250 రూపాయలు

అక్టోబర్, 1976

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
మిస్. మంజుల

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
కంచర్ల రమణ
ఏ. పి. మోహన్రావ్

తొలిమాట

నమస్కారము. ఈ నెలతో రమణశ్రీగారి 'పరలోక ప్రాప్తి' సీరియల్ పూర్తవుతుంది. వచ్చే సంచికలో మీ అభిమాన రచయిత శ్యాంబాబుగారి మరో సరికొత్త సీరియల్ 'కైలాస నగరం' ప్రారంభిస్తున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

'అజ్ఞాత దీవులు' సీరియల్ లాంటి కథ ఈ సంచికలో ప్రారంభమైంది. దీనిలో మొత్తం 16 దీవుల కథలు వుంటాయి. ఒక్కొక్క నెల ఒక్కొక్క దీవికథ పూర్తవుతుంది కాబట్టి, ఏ నెల కానెల కథగానే చదువుకోవచ్చు. 'ఖైదీ'లాగే ఈ సీరియల్ కూడా మీకు వినూత్న అనుభవాలను కలిగించగలదని ఆశిస్తాము.

"సప్లిమెంట్"లో 'ఖైదీ' తర్వాత మరో సీరియల్ ఏమిటి? అని చాలా మంది పాఠకులు ఉత్తరాల మీద వుత్తరాలు వ్రాస్తున్నారు. మేము ఆ ప్రయత్నంలోనే వున్నాము. రమ్యమైన మరో పెద్ద సీరియల్‌ను అతి త్వరలోనే ప్రారంభించగలము.

గతనెల "సప్లిమెంట్"లో నిర్వహించిన బ్యాలెట్‌లో శ్రీ సుజనశ్రీగారి నవల 'దేవతామూర్తి' ఉత్తమ నవలగా అత్యధిక మెజారిటీతో ఎన్నుకోబడినది. రచయితకు బహుమతి రు. 116/—లు వెంటనే అందజేశాము. సెలవా మరి—

మీ

శ్యామ దామోదర్ రెడ్డి

ఈ నెలలో....

కథలు (మాసపత్రిక)

4. కాటేసిన పగ — సుజనశ్రీ.
16. ప్రమాదకరమైన పాచి — సంపత్.
39. బొంబాయి రహస్యం — హుసేన్ బాషా.
54. అజ్ఞాత దీవులు — వెంకట్రామ్.
68. కొండ ఎలుక-మిల్క్ వ్యాను — విజయభాస్కర్.
79. ముత్యాల దొంగలు — పెందుర్తి మాస్టర్జీ.
89. వేట — ఏ. వి. మోహన్రావ్.
105. నకిలీ ఖాతా — శ్రీరాజ్.
121. ద్రోహికి శిక్ష — ఎల్. రామ్‌గోపాల్.
138. పరలోక ప్రాప్తి — రమణశ్రీ.
149. వలలో చిక్కిన వనిత — సంపత్.

నవలలు (సప్లిమెంట్)

3. దొంగలు దోచిన సొమ్ము — వి. నాగేశ్వరరావు.
48. చెక్క బొమ్మ — కంచర్ల రమణ.
99. చావు జోస్యం — వసుంధర.
160. అంతరిక్ష దొంగలు — అజీజ్.

ఇవికాక — క్రైమ్స్‌లో తమాషాలు, అపరాధ పరిశోధన పోటీ, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, సప్లిమెంట్ పోటీ, జోక్స్. మరెన్నో ఆకర్షణలు!!!

కాటేసిన పగ!

సుజనశ్రీ

వరదయ్య అసహనంగా వాచీవంక చూసుకున్నాడు. షాపు లోని సేల్స్ బాయిస్, సేల్స్ గరల్స్ వరదయ్య ఎప్పుడు లేస్తాడా అని కనిపెట్టుకుని కూర్చున్నారు.

ఆ వీధిలో పెద్దపెద్ద దుకాణాలు అప్పటికే మూసేశారు. అయినా వరదయ్యకు అప్పుడే లేవబుద్ధి కావటంలేదు.

గత నెలరోజులుగా తన గుడ్డల షాపులో సేల్స్ అంత తృప్తికరంగా లేవు. అందుకే రోజురోజుకు మరో పావు గంట ఎక్కువసేపు తీసుకుంటున్నాడు షాపు మూసేందుకు. ఆ కాస్సేపటిలో ఇంకెవరన్నా కష్టమర్స్ రావచ్చని అతడి ఆశ!

షాపులోని ఉద్యోగులు వరదయ్యవంకే చూస్తున్నారు. వరదయ్య చూపులు రోడ్డుమీద వచ్చే పోయే జనంమీదే ఉన్నాయ్.

అతి భారంగా మరికొద్ది క్షణాలు గడిచినయ్. వరదయ్య ఆశ నిరాశే అయింది. ఇక లాభం లేదనుకుని, షాపు మూసేయించి, తాళాలువేసి, కారులో కూర్చుని స్టార్ట్ చేశాడు వరదయ్య.

చీకటి రోడ్డుమీద కారు పరుగెత్తుతోంది.

అతడి మనసులో జలజ మెదిలింది. సరిగా అయిదు సంవత్సరాల క్రితం ఇదే రోడ్డుమీద వరదయ్య, జలజను చూడటం తటస్థించింది. అప్పటికి చాలాకాలం క్రితమే వరదయ్య భార్య గతించింది. ఉన్న ఇద్దరు కొడుకులూ దూరదేశాల్లో ఉన్నత పదవుల్లో ఉన్నారు.

ఆ రోజు వరదయ్య కారులో పోతున్నాడు. త్రోవలో బ్రిడ్జిమీద నిలబడి ఒక యువతి కాలువలోకి దూకటానికి సన్నద్ధురాలవుతోంది. కారుని ఆమె ఉన్న చోటికి వేగంగా పోనిచ్చి సడన్ బ్రేకుతో ఆపాడు వరదయ్య.

రెప్పపాటులో కారు డోర్ తెరచి, ఆ యువతి చేయి పట్టుకుని వెనక్కు లాగేశాడు.

"ఆగండి! ఆత్మహత్య చేసుకోవటం ఎంత పాపమో తెలియదూ?" అనడిగాడు వరదయ్య.

"నన్ను అడ్డుకోకండి! నేను జీవించే అర్హతను కోల్పోయాను. నన్ను చావనివ్వండి. మీకు పుణ్యం ఉంటుంది!" అని ఆ యువతి గిజగిజలాడింది.

ఆమెను ఓదార్చి, ఆమె విషాదగాధను అడిగి తెలుసుకున్నాడు వరదయ్య.

ఆ యువతి తల్లీ తండ్రీ లేని అనాధ. బంధువుల ఇంట్లో పెరుగుతోంది. ఒక యువకుడు ఆమెను ప్రేమించి, పెళ్లాడతానని వాగ్దానం చేసి, ఆమెను అనుభవించాడు. అతడి

మోజు తీరగానే, ఆమెను గాలికి వదిలేసి, ఆ ప్రేమికుడు పలాయనం చిత్తగించాడు.

అసలే ఆడది. ముందూ వెనుకాలేని జీవితం. పైన ఇదో కళంకం. అందుకే ఆమె తన నూరేళ్ళ జీవితాన్నీ ముగించుకోవాలనే నిర్ణయానికి వచ్చేసింది.

లైట్ల వెలుగులో వరదయ్య ఆమెను ఆపాదమస్తకం చూశాడు పరీక్షగా. బంగారపు బొమ్మలాగుంది ఆమె. ఆ యువతి మంచి అందగత్తె. ప్రాయంలో ఉన్నది.

వరదయ్యలో కోరికలు చిగురించినయ్. అంతకన్నా ముఖ్యం, తన ఒంటరి జీవితానికి ఒక ఆడతోడు అవసరం. అందుకే ఆమె గతాన్ని క్షమించి, ఆమెను ఆ వయసులో పెళ్ళాడాడు వరదయ్య. అతడు చేసిన పనికి అతడి ఇద్దరు కుమారులు తండ్రిని గర్హించారు.

అలా వరదయ్య పెళ్ళాడిన యువతే జలజ. ఆమెను చేసుకున్న రోజునుంచీ అతడు స్వర్గాన్నే చవి చూశాడు. కంటి పాపలా తనను చూసుకునేది జలజ. ఆమె సంసార జీవితంలో ఏనాడూ మరోసారి తప్పుదారి త్రొక్కలేదు.

కుటుంబ జీవితంలో సుఖసంతోషాలు వెలకొన్నాయో లేదో, అటు వ్యాపారం మందగించసాగింది. వరదయ్య మానసికంగా కృంగిపోసాగాడు. ఇంటికి ఆలస్యంగా రావటం ప్రారంభించాడు. ఎప్పుడో మానేసిన త్రాగుడు తిరిగీ మొదలెట్టాడు.

జలజ అందుకు అభ్యంతరం చెప్పి, ఏడ్చి నానా గోల చేయలేదు.

భర్తను పీడించే మానసికాందోళన దేన్నిగురించి అయి ఉంటుందా అని తీవ్రంగా యోచించింది.

2

"మీ మనస్సుకు విశ్రాంతి కావాలి! షాపు ఎవరికైనా నమ్మకస్తుడికి అప్పజెప్పి, కొన్నాళ్ళపాటు ఏ ఊటీయో లేక కొడైకెనాలో పోదాం పదండి! డాక్టరుగారు కూడా ఆ మాటే చెబుతున్నారు వచ్చినప్పుడల్లా!" అన్నది భార్య జలజ.

చివరకు భార్య బలవంతంమీద వరదయ్య షాపు నెల రోజులపాటు మూసేసి విలాస యాత్రకు బయలుదేరాడు.

మహాబలిపురంలో భారత ప్రభుత్వ టూరిస్టుహోటల్‌లో రూమ్ తీసుకున్నారు.

వారిద్దరి మధ్యా వయసులో ఎంతో తేడా ఉన్నప్పటికీ నూతన దంపతుల్లాగ చలాకీగా తిరిగారు. చూడవలసిన ప్రదేశాలన్నీ దర్శించి వచ్చారు.

రెండు రోజులు రెండు నిముషాల్లాగ గడిచిపోయాయి. డాక్టర్ సలహా ఇచ్చినట్టే, వరదయ్య ముఖంలో విచార రేఖలు మాయమయినయ్. జలజ ఆనందానికి అంతులేదు.

"చూశారా! మనం ఇలా రావటం ఎంత మేలయిందో!" అంది భర్త వంక ఓరగా చూస్తూ జలజ.

ఉండటానికి అందమైన బంగళా, ఆదరంతో చూసే భర్తా, కోరిన నగలూ, చీరలూ, తిరగటానికి కారు, వీటితో జలజ సంసార జీవితం మూడు పువ్వులూ, ఆరు కాయలుగా ఉంది. అందుకే ఆమె తన భర్తను ప్రత్యక్షదైవంలా పూజిస్తోంది.

వివాహమయాక జలజ శరీరం ఇంకా రంగుదేలటం, ముఖంలో కళ రావటం గ్రహించాడు వరదయ్య. తన కొడుకులూ, బంధువులూ నిరసించినా, తను చేసిన పని

మంచిదయిందని తృప్తిచెందాడు మనసులోనే.

జలజ భర్తతోబాటుగా హోటలు ప్రక్కనే వున్న స్విమ్మింగ్ పూల్ గట్టుమీద కూర్చునుంది. ఈతలు కొొట్టే ఆడా మగా జనాన్ని చూసి, నవ్వుకుంటూ భార్యాభర్తలిద్దరూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

అప్పుడే హోటలు రెండో అంతస్థు కిటికీలోంచి రివ్వున పక్షిలా ఎగిరి నేరుగా స్విమ్మింగ్‌పూల్‌లోకి దూకాడు ఒకతను. అతని సాహసానికి అబ్బురపడ్డారు భార్యాభర్తలిద్దరూ.

"హలో జలజా!" స్విమ్మింగ్‌పూల్‌లోంచి అతడు పిలిచాడు.

జలజ ఉలిక్కిపడింది. ఆ పిలుపు తన అంతరాత్మను తాకింది. కంగారుగా అతడివైపు చూసి మరింత కంగారుపడింది. అతడే ఒకనాటి తన ప్రియుడు. తనను ప్రేమించి ద్రోహం చేసిన కాముకుడు.

నీళ్ళల్లోంచి గట్టుమీదకు దూకాడు ఆ యువకుడు. అతడు ఎర్రగా, అందంగా ఉన్నాడు.

మరో కుర్చీ లాక్కొని జలజ ప్రక్కనే కూర్చున్నాడు చనువుగా నవ్వుతూ.

"హలో జలజా! ఇక్కడి కెలా వచ్చావ్?" ఆప్యాయంగా అడిగాడు ఆ యువకుడు.

అతడి వాలకం చూస్తుంటే పరదయ్యకు కోపం, ఈర్ష్య కలుగుతున్నాయ్.

జలజ తన భర్త ముఖంలోకి చూసింది కలవరపాటుతో. ఎన్నడూ లేనంతగా ఏదో భయం ఆమెలో కలిగినట్టు గ్రహించాడు పరదయ్య.

"క్షమించండి! మీ రెవరో నాకు తెలియదు!" కుండ బ్రద్దలు కొట్టినట్టుగా, అతడి ముఖానే చెప్పేసింది జలజ.

జలజ ముఖం తెల్లగా పాలిపోయింది. అది గమనించిన వరదయ్య ఆతృతగా చూశాడు. "అలా ఉన్నావేం జలజా? వంట్లో బాగో లేదా?"

జలజ తన్ను తాను సంబాళించుకుంది. "అబ్బే! అదేం లేదండి! ఇక్కడ ఎండలో ఎందుకు? వెళ్దామా?" అంది.

"ఏమంత తొందర? ఇంకా కొంచెంసేపు కూర్చుందాం!" అన్నాడు వరదయ్య, ఆ వచ్చిన నూతన వ్యక్తి కథా కమామీషు తేల్చుకుందామని!

"ఆడవాళ్ళు దేన్నైనా ఇట్టే మరువగలరు! నిన్ను చూడంగానే నేను గుర్తుపట్టగలిగాను చూశావా?" అంటూ ఆ యువకుడు మళ్ళీ అన్నాడు జలజ వంక చూస్తూ.

కాకి ముక్కుకు దొండపండులా, ఈ ముసలి మొగుడెక్కడ దొరికాడు, అన్నట్టుగా వరదయ్య వంక ఈసడింపుగా చూశాడు అతడు.

"వీరు నా భర్త వరదయ్యగారు! కానీ మీ రెవరో నాకింతవరకూ గుర్తురాలేదు" జలజ మాట తప్పించింది.

"నా పేరు రమేష్! మా ఇంటి ప్రక్కనే గదా నీవు మీ మేనమామ ఇంట్లో ఉండేవి. అవున్లే! మనం విడిపోయి గూడా చాలా కాలమయింది కదూ?"

వరదయ్య తనకు తనే కలుగజేసుకున్నాడు, జలజ బాధ చూడలేక.

"అవునూ! మీరేం చేస్తూంటారు?"

"నేను బెంగుళూరులో ఏరోనాటిక్స్‌లో మెకానికల్ ఇంజినీర్‌ని. ఈతలోనూ, డ్రైవింగ్‌లోనూ నాకు నైపుణ్యం

ఉంది. అంతర్జాతీయ ఈత పోటీల్లో ప్రథముడిగా వచ్చాను. వెండి కప్పుతో బాటు, అయిదువేల బహుమతిని గూడ గెల్చుకున్నాను. ఆ విజయాన్ని సెలబ్రేట్ చేసుకుందామనే మిత్రులతో ఇక్కడకు వచ్చాను. అదృష్టవశాత్తూ జలజ గూడ కలిసింది. అవును సుమా! ఇదివరకటికన్న వన్నె దేలావు. బాగా ఒళ్ళు చేశావ్!" అంటూ జలజ అందాన్ని మెచ్చుకోసాగాడు రమేష్.

వరదయ్యకు ఒళ్ళు మండిపోయింది. అయినా నిగ్రహించుకున్నాడు.

"నేను పై అంతస్థులో మూపై ఆరో నెంబర్ రూమ్‌లో ఉంటున్నాను. ఉదయాన, సాయంకాలం స్విమ్మింగ్ డ్రెస్‌లో నా రూమ్ కిటికీలోంచి రివ్వున నేరుగా స్విమ్మింగ్‌పూల్‌లోకి దూకటం నాకు భలేసరదా. ఇన్ని రోజులనుంచి ఏనాడు నేను స్విమ్మింగ్‌పూల్ చేరేందుకు మెట్లుదిగి రాలేదంటే నమ్ము! అవునూ! మీ దంపతులు ఇంకా ఇక్కడ ఎన్నాళ్ళుండబోతున్నారు?"

"బహుశా మరో వారం ఉండచ్చు!" వరదయ్య తక్కున జవాబిచ్చాడు.

"ఈ రాత్రికి నేనో విందు ఏర్పాటు చేశాను. నామిత్రులూ, ఇక్కడున్న టూరిస్టులూ ముఖ్య అతిథులు. మీ దంపతులు గూడా రావాలి; పార్టీ డ్రెస్సే వేసుకురానక్కర్లేదు. మీ ఇష్టమైంది, బెల్‌బాటమ్స్ శారీ బ్లౌజ్, లేదా స్విమ్మింగ్ డ్రెస్‌లోనయినా సరే నిరభ్యంతరంగా రావచ్చు. నేను మాత్రం విందులో గూడా స్విమ్మింగ్ సూట్‌లోనే ఉంటాను. నా డైవింగ్ ప్రావీణ్యంతో అతిథుల్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తద్దూ! అందుకని!" రమేష్ ఉల్లాసంగా చెప్పుకుపోతున్నాడు.

"ఏమోనబ్బా! నేను మాత్రం రాలేననుకుంటాను. నా కింకా ప్రయాణపు బడలిక తీరలేదు. రాత్రి బాగా ప్రొద్దు పోయేదాకా మేలుకోలేం!" జలజ అభ్యంతరం చెప్పింది.

"అదేం కుదరదు. నీవు మాత్రం తప్పకుండా రావల సిందే! మన పాత పరిచయాల్ని తిరిగి మననం చేసుకోవ టానికి ఇంతకన్న ఆనందమయిన సమయం ఎప్పుడుంటుంది మీరు గూడా రండి సార్; కాసేపు అందరం కులాసాగా, సరదాగా గడపచ్చు" రమేష్ వరదయ్యను గూడ ఆహ్వా నించాడు,

"రాత్రి పదిగంటలకు పార్టీ మొదలవుతుంది. సుష్టుగా భోంచేసి, పెందలాడే పడుకుని నిద్రలోకి జారుకోకండి!" రమేష్ వాళ్ళను మరోసారి హెచ్చరించి, అక్కణ్ణుంచి వెళ్ళి పోయాడు.

వెళ్ళిపోతున్న రమేష్ వంకే చూస్తుండి పోయాడు వరదయ్య.

"ఆ విందుకు రావటాని కిష్టంలేదు నాకు! మీ రెందుకు అతడికి మాట యిచ్చారు?" జలజ భర్తను అడిగింది.

వరదయ్య సమాధానం చెప్పలేదు.

"వాడ్ని చూస్తూంటేనే నాకు ఏదో భయమేస్తున్నది. నన్ను పిశాచంలా, నీడలా వెంటాడక మానడు," అన్నది జలజ తిరిగి.

"ఈ వరదయ్య తడాఖా వాడికి తెలిసివచ్చేలా చేస్తాను తెలుసా?" వీరుడిలా ఫోజుపెట్టాడు, భార్యకు అభయమిస్తూ.

*

ఆరుగంటలకే భోజనాలు ముగించుకుని వరదయ్య, జలజ ఇద్దరూ గదికి చేరుకున్నారు. ఎండవేడి జాస్తిగా

ఉండటంవలన వరదయ్య అలసటగా బెడ్ మీద వాలి పోయాడు. క్షణాల్లోనే బిగ్గరగా గురకపెట్టసాగాడు.

వరదయ్య కళ్ళు తెరిచేసరికి గది చీకటిగా ఉంది. ప్రక్క బెడ్ మీద జలజ లేదు. అతడి హృదయం ఉద్వేగంతో వేగంగా కొట్టుకుంది. ఆమెమీద కలిగిన అనుమానాగ్నిలో అతడి దేహం తగులబడుతున్నట్టుగా ఉంది.

అయినా కదలకుండా అలాగే పడుకున్నాడు. భారంగా కొద్దిక్షణాలు దొర్లినయ్. గది తలుపు తెరుచుకుంది. కళ్ళు మూసుకుని నిద్ర నటించాడు వరదయ్య. అరగన్నుతో ఆమెను గమనించసాగాడు.

పిల్లిలా అడుగులో అడుగువేసుకుంటూ, ఏమాత్రం చప్పుడు కాకుండా లోపలకు వచ్చింది జలజ. భర్త ఇంకా నిద్ర లేవలేదని రూఢిచేసుకుని డబల్ బెడ్ మీద అతడికి ప్రక్కగా వాలిపోయింది. ఆమె ఉద్రేకంలో రొప్పటం స్పష్టంగా వినిపిస్తోంది వరదయ్యకు. ఎవరో అతడి హృద యాన్ని బలంగా పిండేస్తున్నట్టుగా బాధపడ్డాడు.

తనకు తెలియకుండానే, మళ్ళీ నిద్రలోకి జారుకున్నాడు, వరదయ్య.

మరికొంతసేపటికి జలజ భర్తను తట్టి లేపింది.

వరదయ్య కళ్ళు తెరచి చూశాడు. డ్రెస్ మార్చుకుని, అప్పటికే ముస్తాబయి ఉంది జలజ. తెల్లని షిఫ్లిన్ చీరలో దేవకన్యలా మెరిసిపోతోంది ఆమె.

"లేవండి! లేచి రెడీ అవండి! పార్టీకి వెళ్ళితీరాలన్నారు గదా?"

భారమైన హృదయంతో జలజను వెంటబెట్టుకుని రమేష్ ఇచ్చే విందుకి హాజరయాడు.

కాన్ఫరెన్స్ హాల్లో విందు ఏర్పాటు చేయబడింది. అప్పటికే చాలామంది వచ్చేశారు. వరదయ్య జలజలకు వి. ఐ. పి. లకు చేసేటంతటి ఘనంగా స్వాగత మిచ్చాడు రమేష్.

విందుకి హాజరయిన వారిలో ఎక్కువమంది ఆడవారే! ఎవరికివారే రమేష్ స్నేహాన్ని సంపాదించాలని తాపత్రయ పడుతున్నారు.

కానీ అక్కడ ఉన్నవాళ్ళందరిలోనూ తన భార్యే, చుక్కల్లో చందమామలా వెలిగిపోతోందని గర్వపడ్డాడు వరదయ్య.

ఒక గంట గడిచింది. అతిథుల్లో చాలామంది మస్తుగా త్రాగేశారు. ఏవేవో మాట్లాడుతూ, తడబడుతూ తూలు తున్నారు.

జలజ వాచీవంక చూసుకుంది. "నేను మన గదికి వెళ్తు న్నాను. మీరూ వస్తారా? ఇంకా ఇక్కడే ఉంటారా?" అని అడిగింది భర్తను.

వరదయ్యకు ఇంకా త్రాగాలని ఉంది.

"నువ్వెళ్ళు! నేను తర్వాత వస్తాను." అన్నాడు పైకి.

వెనుకనించి ఎవరో తరుముకొస్తున్నంత వేగంగా వెళ్ళి పోయింది జలజ.

అంత హఠాత్తుగా తన భార్య ఎందుకు వెళ్ళిపోయిందా అని ఆశ్చర్యపడ్డాడు వరదయ్య.

గ్లాసులోకి విస్కీ వంచుకుని త్రాగాడు వరదయ్య.

రమేష్ చలాకీగా అందర్నీ పలకరిస్తూ, నవ్విస్తూ తిరుగు తున్నవాడల్లా హఠాత్తుగా ఆగిపోయాడు. సీరియస్‌గా చూస్తూ, "మిత్రులారా! సెలవ్!" అంటూ కిటికీలోంచి,

చీకట్లోనే, రివ్వున ఎగిరి స్విమ్మింగ్ పూల్‌లోకి దూకేశాడు.

అతడిలా దూకటం ఎరగని ఆడవాళ్ళు "అమ్మో!" అని అరిచారు భయాన్ని అభినయిస్తూ.

అతడి ప్రావీణ్యాన్ని ఎరిగినవాళ్ళు, అతడ్ని ప్రోత్సహిస్తూ కేరింతలు కొట్టారు.

అతిథులందరూ కిటికీ దగ్గరకు మూగారు స్విమ్మింగ్ పూల్‌లోకి చూస్తూ. ఎవరో యువతి భయంతో కెవ్వుమంది. అతిథులంతా కొయ్యబారిపోయారు,

స్విమ్మింగ్ పూల్‌లోంచి, భయంకరంగా, హృదయా లవిసిపోయేలా పెద్దకేక వినవచ్చింది. స్విమ్మింగ్‌పూల్ చుట్టూరా ఉన్న ఫ్లడ్‌లైట్స్ ఒక్కొక్కటే చకచకా వెలిగినయ్.

చీకటిగా ఉన్న ఇతర గదుల్లో లైట్లుగూడ వెలిగినయ్. అన్ని వైపులనుంచి మనుష్యులు స్విమ్మింగ్‌పూల్ వైపు పరుగెత్తారు. స్విమ్మింగ్‌పూల్‌లో ఒక్క చుక్క నీరు లేదు.

పూల్ అడుగున రక్తపు మడుగులో పడివున్న రమేష్‌ని పైకి లాగారు. అంబ్యులెన్స్‌కోసం ఫోన్ చేశారు.

రమేష్ ప్రాణంతోనే ఉన్నాడు. కానీ రెండు చేతులూ విరిగిపోయాయి. ఒక కాలుపోయింది. ముఖం పచ్చడి అయింది.

సిమ్మింగ్‌పూల్‌లో నీళ్ళను ఖాళీచేసే రెండు కొళాయిల్ని ఎవరో వదిలేశారు. అందువల్లనే ఒకగంటలోనే నీళ్ళన్నీ కారిపోయేయి. స్విమ్మింగ్‌పూల్ ఖాళీ అయింది.

చీకట్లో ఈ విషయాన్ని గమనించకుండా దూకేసిన రమేష్ అంగవైకల్యం పొందాడు.

వరదయ్య మత్తు వదిలిపోయింది, నింపాదిగా నడుచు

కుంటూ తన గది చేరుకున్నాడు. కాని తను నిద్రపోవటం చూసి, తన భార్యే స్విమ్మింగ్‌పూల్ కొళాయిలను వదిలేసి వచ్చిందని అతడికి తెలియదు.

తలుపు తెరిచి గదిలోకి ప్రవేశించాడు వరదయ్య. బెడ్ మీద జలజ కళ్ళు మూసుకుని పడుకుని వుంది. చప్పుడు కాకుండా ఆమె ప్రక్కకు చేరాడు.

దొండిపండులాగున్న ఆమె ఎర్రని పెదాలపై సుతారంగా స్పృశించాడు వరదయ్య. జలజ చేతులు జాపి హాయిగా భర్తను పెనవేసుకుంది. ***

కొందరు సస్య పరిశోధన ఆఫీసర్లు ఒక శెనగ తోటలో పరిశోధిస్తున్నారు. వాళ్ళు శెనగ తోట కావలి వాడితో కబుర్లాడుతూ శెనగ కాయలు లాగి తింటున్నారు.

ఒక ఆఫీసరు కావలివాడితో "ఏరా! శెనగ కాయలు లాగినట్లు మీ యజమానికి తెలిస్తే నీమీద కోప్పడతు," అన్నాడు ఆయన అనుమానంగా.

"కోప్పడడు బాబుగారూ కొన్ని గాడిదలు చేలో పడ్డాయ్, అవి శెనక్కాయలు లాగేసినై! అని చెప్తే మా అయ్యగారు ఏమీ అనరు," చెప్పాడు కావలివాడు.

—వి. సాయిసుకుమార్, కడప.

ప్రమాదకరమైన పాచి!

సంపత్

యునైటెడ్‌నేషన్స్ తరపున స్పేస్ రీసెర్చికై ప్రయోగింపబడిన సెటిలైట్ అది.

చూడటానికి వృత్తాకారపు గొట్టంలా ఉంటుంది. ఆ గొట్టంలోనే అయిదు అంతస్థులున్నాయి. గొట్టం మధ్యచ్ఛేదం వృత్తాకారంగా ఉంటుంది. ఆ వృత్తాకారపు గొట్టం సెంటర్‌లో కంట్రోలింగ్ రూం ఉంది. ఆ రూంనుండి ఎదురెదురుగా నాలుగు పైపులవంటివి వృత్తాకారపు గొట్టానికి అమర్చబడి, రాకపోకలకు వాడబడుతున్నాయి.

ఆ సెటిలైట్‌లో ఉన్న ముఖ్యవిషయం ఏమిటంటే, అది భూమిమీదున్న కంట్రోల్ సెక్షన్‌కు లోబడి ఉండదు. ఆ సెటిలైట్‌ని ఒక 'కారు' అనుకుంటే, దాని కంట్రోలు రూం డ్రైవింగ్‌సీట్. అక్కడినుంచి ఆ సెటిలైట్‌ని ఆపరేట్ చేయవచ్చు.

ఆ స్పేస్ రీసెర్చి సెటిలైటు స్థిరంగా ఉండదెప్పుడూ. అంతరిక్షంలో నెమ్మదిగా, నిండు చూలాలిలా తిరుగుతూ, భూమి చుట్టూ తిరుగుతుంటూంది.

ప్రపంచంలోని సభ్యదేశాలన్నీ ఉమ్మడిగా దానిని నిర్మించి ఖగోళంలోనికి వాతావరణ పరీక్షలకోసం పంపాయి.

ప్రతి నెల రోజులకు ఆ సెటిలైట్ కక్ష్య మార్చబడు తుంది. ఇదంతా స్వయంగా నిర్వర్తించవలసినదే, భూమితో ఎట్టి సంబంధం లేదు.

ఆ సెటిలైట్ కంట్రోలింగ్ స్టాఫ్ అధికారి కెప్టెన్ రాబర్ట్. అమెరికన్. అతనే ఆ సెటిలైట్‌కు జవాబుదారు.

రాబర్ట్‌కు నలభై సంవత్సరాలు వయసుంటుంది. ఆరున్నర అడుగుల పొడుగుతో, బలంగా ఉంటాడు. చురుకయిన మేధస్సు అతనిది. యిదివరలో నాలుగుసార్లు అపోలోలో చంద్రమండల యాత్రచేసి వచ్చాడు.

ఆసెటిలైట్ ప్రయోగింపబడి నాలుగు నెలలు దాటింది. క్రొత్త కక్ష్య భూమికి దూరం అవుతూ ఉంటుంది, ఆ కక్ష్యలో జరిగే మార్పులకోసం, ఎవరి పనులలో వారు మునిగిపోయి వున్నారు. ఆ సెటిలైట్‌లో సుమారు యాభై మంది దాకా పనిచేస్తున్నారు.

అటువంటి సమయంలోనే, కంట్రోలింగ్ రూంలో టెలిస్కోప్‌లో చూస్తూ గట్టిగా అరిచాడు జనార్ధన్.

కంప్యూటర్‌ముందు కూర్చుని ఏదోచేస్తున్న జపాన్ దేశీయుడు "మిహోషి" ఉలిక్కిపడ్డాడు. అంతేకాదు, ఆ రూంలోని వారుకూడా.

"వాట్? వాట్ హేపెండ్?" అని ప్రశ్నించాడు మిహోషి తెల్లబోతూ.

జనార్ధన్ టెలిస్కోప్‌ని అతనిముందుకు నెట్టాడు. వారి ముందు గాజుతో నిర్మించబడిన గోడ ఉంది. దాని ద్వారా నల్లటి ఆకాశంలో చుక్కలు ప్రకాశిస్తుండటం కన్పిస్తూంది. అప్పుడప్పుడు భగ్గున మండుతూ, రాలిపోతున్న ఉల్కలు, చిన్నచిన్న గ్రహ శకలాలు, కన్పిస్తున్నాయి గమ్మత్తుగా.

టెలిస్కోప్‌లో జనార్ధన్ చూపించిన వైపు చూశాడు మిహిర్. దానిని చూసి అదిరిపడ్డాడు అతను.

దూరంగా ప్రకాశవంతంగా మెరుస్తున్న ఎర్రటి గోళం కన్పిస్తూంది. దానిలో వింతేమి లేదుగాని, అది ఆకాశంలో నిశ్చలంగా నిలబడి వుంది. భూమికి అభిముఖంగా, చంద్రుడికి దగ్గరగా వుంది. మామూలుగా గ్రహాల కుండవలసిన చలనం దానిలో ఉన్నట్లు కనిపించటంలేదు. నిశ్చలంగా నిలబడి వుంది అంతరిక్షంలో.

ఇంటర్ కమ్యూనికేషన్ నొక్కి కెప్టెన్‌ను వెంటనే కంట్రోలింగ్ రూంకి రావల్సిందిగా కోరాడు జనార్ధన్.

"ఎన్నడు కన్పించనిది యిప్పుడెలా కన్పించింది? ఎక్కడుంది యిప్పటిదాక? చలనం లేకుండా ఎలా ఉండగలదు?" లాంటి సాంకేతిక పరమైన ప్రశ్నలు సవాలక్ష ఉద్భవించాయి వారిలో.

అయిదు నిమిషాల తర్వాత కెప్టెన్ రాబర్ట్ కంట్రోలింగ్ రూంలోకి ప్రవేశించాడు. అతనూ ఆ ఎర్రటి గోళం గురించి ఏమీ చెప్పలేకపోయాడు.

నిముషాలలో ఆ వింతను గురించి ఆ సెటిలైట్ అంతా వ్యాపించింది. ఎవరికివారే తమతమ కాబిన్‌లలో అమర్చబడియున్న టెలిస్కోప్‌ల ద్వారా ఆ వింత గోళాన్ని చూస్తూ కూర్చున్నారు. ఒకరకంగా, ఆ సెటిలైట్‌లోని మామూలు కార్యక్రమాలు స్తంభించి పోయాయి.

కెప్టెన్ రాబర్ట్ వెంటనే భూమిమీదున్న కంట్రోలింగ్ కేంద్రంతో సంప్రదించాడు. వారూ దానిని గురించి ఏమీ తెల్పలేకపోయారు. తామూ ఆ గ్రహాన్ని ఇప్పుడే చూశామని, అది అంతరిక్షంలో నిశ్చలంగా ఎలా నిలబడ గల్గిందో అర్థంకావటంలేదని జవాబు వచ్చింది.

తాను తీసుకోబోతున్న చర్యలు వివరించి, కనెక్షన్ కట్ చేశాడు కెప్టెన్ రాబర్ట్.

మరో పావుగంట తర్వాత స్పేస్‌డ్రెస్ ధరించిన ముగ్గురు వ్యక్తులు కంట్రోలింగ్ రూంకి అడుగున అంతస్థులో ఉన్న హాలులోనికి ప్రవేశించారు.

అంతకుముందే 'లాసర్ కిరణాల' ద్వార ఆ ఎర్రటి గోళానికి, తమ సెటిలైట్‌కు మధ్య దూరం లెక్కగట్టారు. పదివేలమైళ్ళ చిల్లర ఉంది.

ఆ ముగ్గురు భుజాలమీద వారి నేమ్ బాడ్జీలున్నాయి. ఒకతని పేరు రాజు. భారతీయుడు. రెండో వ్యక్తి మార్టిన్, మూడో వ్యక్తి జాక్సన్. వీరిద్దరు బ్రిటిష్‌వారు. వీపున ఆక్సిజన్ సిలిండర్స్. ముఖాలకు గ్లాస్‌హెల్మెట్స్ ధరించి హాలులో రాకెట్‌లా, పొడుగ్గా ఉన్న వాహనం లోనికి పోయి కూర్చున్నారు.

మరో అయిదు నిమిషాల తర్వాత హాలు అడుగున ఉన్న ఒక ద్వారం తెరుచుకుంది.

ఆ రాకెట్‌లాంటి స్పేస్‌కార్ రివ్వున అంతరిక్షంలోకి ప్రవేశించి, ఎర్రటి గోళంవైపు దూసుకుపోసాగింది.

2

స్పేస్‌కార్!

దానికి సరియైన పేరే అది! చూపులకు మామూలు

రాకెట్‌లా ఉంటుంది. ఆపరేట్ చేయటం మాత్రం కార్ స్టీరింగ్‌ని త్రిప్పి, మార్గం మార్చినట్లు, మార్చుకోవచ్చు. అయితే ఇందులో స్టీరింగ్ ఉండదు. రాకెట్‌చుట్టు ఉన్న రాకెట్లను ప్రేల్చి మార్గం మార్చుకోవడం జరుగుతుంది. అంతా బటన్ సిస్టమ్. చేయటానికి సులభంగా ఉన్నా చాలా జాగ్రత్తగా ఆపరేట్ చేయాలి.

కావల్సిన డైరక్షన్ జాగ్రత్తగా అంచనావేసి రాకెట్లను ప్రేల్చవలసి ఉంటుంది. భూమిమీద పరిసరాలవల్ల ఏ మార్గంలో వెళ్ళుతున్నామో తెలుస్తుంది. మార్గం తప్పినా, వెనుకకు రావచ్చు. కాని అంతరిక్షంలో అలా కాదు. ఎటు చూసినా నల్లటి ఆకారం. ఒకసారి దారితప్పావో, అంతే! ఎక్కడకు పోతామో, కనీసం ఊహించనయినా ఊహించ లేము.

ఆ స్పేస్‌కార్‌లో ఆధునిక సౌకర్యాలన్నీ ఉన్నాయి. ఒకే సారి పదిమంది కూర్చొని ప్రయాణించవచ్చు.

ఆ ఎర్రటి గోళాన్ని సమీపించగానే ఒక బటన్ నొక్కాడు జాక్సన్. రాకెట్ ముందునుంచి ఒక సన్నని ఏరియల్ ముందుకు పొడుచుకు వచ్చింది. అది టీవీ కెమెరాగా ఉపయోగిస్తుంది. దాని ద్వారా స్పేస్‌రీసెర్చ్ సెటిలైట్‌లో ఉన్న వ్యక్తులు, కంట్రోలు రూంలో ఉన్న టీవీ స్క్రీన్‌పై ఎర్రటి గోళాన్ని చూడవచ్చు దగ్గరగా.

మరో పావుగంట తర్వాత బాగా దగ్గరయింది ఎర్ర గోళం.

దూరానికి ఎర్రగా ఉన్నా, గోధుమ రంగులో ఉందా గోళం. జీవం ఏమీ ఉన్నట్లు కన్పించడంలేదు. కనుచూపు మేరవరకు, ఎడారులలోని ఇసుక గుట్టలవలె గుట్టలు

గోధుమరంగులో వ్యాపించి ఉన్నాయి.

చదునయిన ప్రదేశం ఒకటి చూసి, ఒక స్విచ్ నొక్కాడు రాజు. వెంటనే రాకెట్ ముందునుంచి సన్నని ఇనుప కడ్డీ వంటి ఒక వస్తువు రివ్వున పోయి ఎర్రగోళంమీద దిగబడింది.

ఆ గోళం తాము దిగటానికి అనువయినదేనని నిర్ణయించుకున్నారు. తరువాత రాకెట్‌ను నెమ్మదిగా దింపసాగారు. స్పేస్‌కారు ప్రక్కలనుండి మూడు గొట్టాలు బయటికి వచ్చాయి. అవి గోళంమీద దిగబడ్డాయి. వాటిమీద స్పేస్ కార్ ట్రైపాడ్ మీద నిలబడి ఉన్నట్లు నిలబడిపోయింది.

ముగ్గురు మూడు బాక్సులు తీసుకున్నారు. ట్రాన్సిస్టర్ రేడియో సైజ్‌లో ఉంది ఒక్కొక్కటి. వాటిమీద డయల్స్, మీటలు ఉన్నాయి.

డయలింగ్ సిస్టమ్ ప్రకారం తాము ఎవరితో మాట్లాడదల్చుకున్నారో వారితో మాట్లాడవచ్చు. వాటికి సంబంధించిన మైక్రోఫోన్‌లు, స్పీకర్‌లు వారి తలలకు తొడుక్కున్న హెల్మెట్‌లో ఉన్నాయి. అంతేగాదు, ఆ బాక్సులు కలర్ ఫోటోలను కూడా తీయగలవు.

ముగ్గురూ క్రిందకు దిగారు. ఇసుకలో నడుస్తున్నట్లుంది. కొంతదూరం పోయాక అన్నాడు మార్టిన్ డయల్ చేసి.

"జాక్సన్! రాజు! ఇలా మనం కలిసి వెళ్ళేకంటే, ముగ్గురం మూడు వైపులకు పోయి చూడటం మంచిది. ఏమంటారు?"

అతని ప్రతిపాదనకి అంగీకరిస్తున్నట్లు తలలూపారు.

"గుడ్! అయితే జాక్సన్ కుడివైపు గుట్టదాటి వెళతాడు. నేనిటు ఎడమవైపుగా పోతాను. రాజు తిన్నగా ఆ రెండు గుట్టల మధ్యగా వెళతాడు!"

ముగ్గురు ముందుకు నడిచారు.

రాజు తనముందు ఉన్న రెండు ఎత్తయిన గుట్టల మధ్యగా నడిచాడు. ఎప్పటికప్పుడు మిగిలినవారి కిద్దరికి తాను చూసిన వింతలు, విశేషాలు వల్లిస్తున్నాడు రాజు. మిగిలినవారు కూడా మిగిలినవారికి చెబుతున్నారు వింతలు.

అక్కడ ఉన్న ఇసుక, రాళ్ళు, మొదలయినవి సేకరించి, తనవెంట తెచ్చిన సంచిలో పోస్తున్నాడు రాజు.

ఇంతలో ఉన్నట్టుండి ఎవరిదో కేక విన్పించింది మైక్రోఫోన్‌లో. చెవులు దిమ్మెత్తిపోయాయి ఆ కేకతో.

"రాజు! ఏమయింది?" ఆ కంఠం జాక్సన్‌దిగా గుర్తించాడు రాజు. తనకేమీ కాలేదని, మార్టినే ఎందుకో అరిచాడని జవాబిచ్చాడు రాజు.

మార్టిన్‌ను కాంటాక్టు చేశారు. అటునుంచి జవాబులేదు. వెనక్కితిరిగి రావల్సిందిగా కోరాడు రాజు. అతను కూడా వచ్చిన మార్గాన్నే వెనుదిరిగి వచ్చాడు. అప్పటికే జాక్సన్ వచ్చాడక్కడికి.

"ఇంతవరకు మార్టిన్‌నుంచి ఎటువంటి జవాబురాలేదు!" జాక్సన్ గొంతులో ఆందోళన తొంగిచూసింది.

రాజు, జాక్సన్‌లు యిద్దరూ మార్టిన్ వెళ్ళిన వేపు వెళ్లారు. పదినిమిషా లనంతరం అక్కడి దృశ్యంచూసి ప్రమాన్పడిపోయారు.

వారిముందు కొద్దిదూరంలో బురదనేలలా ఉంది. పచ్చటి పాచివంటిది పేరుకొని జిగటగా ఉంది. అప్పుడప్పుడు ఆ బురదనుండి బుడగలు వస్తున్నాయి. ఆ బురదగుంట ప్రక్కనే మార్టిన్ చేతిలో ఉండాల్సిన డయలింగ్ బాక్సు పడివుంది దూరంగా. మార్టిన్ మాత్రం కన్పించలేదు.

"మైగాడ్! ఏమిటిది?" కీచుగా అరిచాడు జాక్సన్.

"ఇదేదో ఊబిలాగుంది!" తనకి వచ్చిన అనుమానం చెప్పాడు రాజు.

"అంటే!" అదిరిపోయాడు జాక్సన్. అతను తన చేతి లోని బాక్స్‌ని ప్రక్కనే ఉంచి, జేబులు తడుముకొని, సన్నటి వైర్ తీశాడు. దానిని బురదలో వుంచి అటూ ఇటూ కెలికాడు.

"నీ ఊహ రైటే. అంటే మార్టిన్ ఈ ఊబిలో....!" ఆ పైన మాటలు దొరకలేదు. రాజు గుడ్లప్పగించి ఊబి వంక చూస్తున్నాడు.

జాక్సన్ తన బాక్స్‌ని రాజుకి చూపాడు.

ఆ బాక్స్ చుట్టూ ఆ బురద గుంటలోని "పాచి" నెమ్మదిగా పేరుకొంటూంది. క్రిందనుంచి ఎగ్రాకి మరీ, పేరుకొంటూంది. తన చేతిలోనున్న వైర్‌తో దాని నంత టిని శుభ్రంచేసి, లాగి పారేశాడు. ఒక పట్టానరాలేదు అది. అంతా ఒక్కమారే పాతబడ్డ రంగు పొర వచ్చినట్లు ఊడి పోయింది.

"యిక్కడుండవద్దు. వెళ్దాం పద!" రాజు అన్నాడు నిర్లిప్తంగా. తమ బాక్స్‌లతో ఆ బురదని ఫొటో తీశారు. మార్టిన్ బాక్స్ కూడా శుభ్రంచేసి రాకెట్ వైపు నడిచారు.

మరో అయిదు నిమిషా లనంతరం రాకెట్ పైకిలేచింది.

3

వైర్‌లెస్‌లో రాజు చెప్పింది విని నిశ్చేష్టుడు అయి పోయాడు కెప్టెన్‌రాబర్ట్. అతనితోబాటు ఆ కంట్రోలింగ్ రూంలోనున్న యావత్తు సిబ్బంది చేష్టలుడిగి నిల్చుండి పోయారు.

కెప్టెన్ రాబర్ట్ ఆ వార్తని నమ్మలేక పోయాడు. అతని లోని కర్తవ్యం వెన్నుతట్టింది. అందరికన్న ముందు తేరుకున్నది అతనే.

వెంటనే భూమిని కాంటాక్ట్ చేసి, తనకు లభించిన సమాచారం అందజేశాడు. అక్కడ ఎంత గందర గోళం అవుతుందో అతనికి తెలుసు.

గుండె దిటవు పరుచుకున్నాడు. స్పేస్‌కార్ కోసం ఎదురుచూస్తూ కాలుగాలిన పిల్లిలా అటూ యిటూ తిరుగుతున్నాడు.

స్పేస్‌కార్, సెటిలైటుని సమీపించగానే, హాలు అడుగు భాగం తెరుచుకుంది. లోనికి ప్రవేశించి హెలికాప్టర్ మాదిరి లాండయింది. ఆ హాలులో అటువంటి స్పేస్‌కార్లు అరడజనుకు పైగా వున్నాయి.

కెప్టెన్‌రాబర్ట్ అక్కడికి చేరుకునేసరికి రాజూ జాక్సన్‌లు అక్కడే, ఆ అంతస్థులోనే వున్న "క్వారంటైన్" లోనికి వెళ్ళారు. అక్కడ, తమదుస్తులు, హెల్మెట్సు యింకా తమకు సంబంధించిన ప్రతివస్తువు అక్కడ వదిలి, రకరకాల పరీక్షలు, శుద్ధిపరచడాలు అయ్యాక బయటికి వచ్చారు.

వారికోసం కెప్టెన్ రాబర్ట్ ఎదురుచూస్తున్నాడన్న వార్త తెలియజేశాడు క్వారంటైన్ అధికారి నికల్సన్.

రాజు, జాక్సన్‌లు వెళ్ళిపోయారు.

నికల్సన్ క్వారింటైన్ రూంని సమీపించి, బయట గాజు అద్దంలోనుంచి లోనికి చూసి, ప్రక్కనే గోడకు ఉన్న ఒక స్విచ్ నొక్కాడు. మరుక్షణమే ఆ గది అంతా ఎర్రటి వెలుగుతో నిండిపోయింది. గది అంతా వేడిగా మారి

పోవడం మొదలు పెట్టింది. ఆ వేడివల్ల లోని వస్తువులకు ఎట్టి హానీ ఉండదు. కాని స్పేస్‌లో తెలియని సూక్ష్మజీవులు ఏమన్నావస్తే నశించిపోతాయి.

పావుగంట పాటు అలానే ఆన్‌చేసి, తరువాత ఆఫ్ చేశాడు. ఆ నడవా చివర ఉన్న తన గదిలోకిపోయి, ఫ్లాస్కులోనుంచి కాఫీ పోసుకున్నాడు గ్లాసులో.

అప్పుడే తలుపు తెరుచుకుని తెల్లటి స్వీపర్ దుస్తులు ధరించిన ఒక వ్యక్తి లోనికి వచ్చాడు. నికల్సన్ అనుమతి అవగానే క్వారంటైన్ వైపు కదిలాడు.

క్వారంటైన్‌లోకి నడిచి రాజు, జాక్సన్‌ల దుస్తులు తీసి మడిచి, తను తెచ్చిన బాక్సులో పెట్టసాగాడు.

అతని కళ్ళకు ఒక విచిత్రం కనిపించింది.

"ఎవరిదీ పాంటు?" అని పేరు చూశాడు. జాక్సన్ పేరు కన్పించింది.

"యితనింత అజాగ్రత్తగా ఎలా ఉన్నాడు?" అని గొణుక్కుంటూ, పచ్చటి పాచి ఎక్కడో ఓ మూల అంటుకొని ఉన్న ఆ పాంటుని, ఆ గదిలోనే ఉన్న వాషింగ్ బాక్సులోనికి తోసి స్విచ్ ఆన్ చేశాడు.

అయిదు నిమిషాలనంతరం బయటికి తీసిన పాంట్‌ని తీసి హడలిపోయాడు. యిందాకటి కంటే ఎక్కువగా పాచి అంటుకుని తళతళా మెరుస్తూంది.

మరోసారి వాషింగ్ మెషిన్‌లో వేసి తీశాడు. భయంతో కొయ్యబారి పోయాడు. పాచి యింకా ఎక్కువ అయింది. గుడ్లప్పగించి చూస్తున్న అతని వంటినిండా చెమటలు పట్టాయి. నోటమ్మట మాటకూడా రావటంలేదు.

పాంటుకి అయిన పాచి నెమ్మదిగా పెరుగుతోంది. సబ్బు

మరగలాగా వ్యాపిస్తూ పాంటుని ఆక్రమించుకుంటోంది.

వెనక్కి ఒక అడుగువేసి ఆగిపోయాడు. అతని వేళ్ళకి కొంచెం పాచి అయ్యింది కాబోలు. అది కూడా విస్తరిస్తోంది. 'కెవ్వు'మని అరిచాడతను భయంతో. దానిని రెండోచేత్తో లాగటానికి ప్రయత్నించాడు. ఆ చేతికి కూడా అంటుకుంది. గుండాగినంత పనయింది. పిచ్చివాడిలాగా ఒక మూలకి పరుగెత్తి పైప్‌ను తిప్పాడు. వేడినీరు ధార క్రింద రెండుచేతుల నుంచాడు. కాని లాభం లేకపోయింది. బురదవంటి ఆ పచ్చటి పాచి అంతకంతకు ఎక్కువవుతూ వ్రేళ్ళను చుట్టుకుంటూంది.

భయంతో బిర్రబిగుసుకు పోయాడు. చల్లగా తగులు తుందది. అరచెయ్యివరకు వ్యాపించింది. ప్రక్కనే పడి వున్న పాంటుమీద అతనిచూపు అప్రయత్నంగా పడింది. అదిరిపడి వెనక్కు ఒకడుగు వేశాడు. పాంటు అంతా అయి ఫ్లోర్‌మీద వ్యాపిస్తోంది. బయటకు పరుగెత్తాడు. తలుపులుమూసి, క్వారంటైన్ స్విచ్ ఆన్ చేశాడు.

బయట నున్నటి వరండామీద పరుగెత్తబోయాడు. కాని కాలుజారి క్రిందపడటంతో, తలకొట్టుకొని, స్పృహకోల్పోయాడు. ఇదేమి అక్కరలేనట్లు, పచ్చటి పాచి పెరుగుతూనే ఉంది.

4

కెప్టెన్ రాబర్ట్ శ్రద్ధగా వింటున్నాడు, రాజు, జాక్సన్‌లు చెబుతున్న విషయాలను. వారు తెచ్చిన ఫోటో నెగటివ్స్ లాబ్‌కి పంపబడ్డాయి. మరికొంత సేపటిలో రిజల్ట్సు రావచ్చు. అలాగే యితర వస్తువులు కూడా లాబ్‌కి పంపబడ్డాయి పరిశీలనార్థం.

"మీకు వర్ణిస్తున్న వింతలలో ఆ ఊబిని గురించి చెప్పాడా?" అడిగాడు రాబర్ట్.

చెప్పలేదని చెప్పారు రాజు, జాక్సన్‌లు.

"దాన్ని చూడకుండా ఎలా ఉన్నాడతను? ఒకవేళ చూసి కూడా గమనించలేదా? సొంతం ఊబిలోనికి కాలుపెట్టాక తెలిసి ఉంటుందా? లేక యింకేమయినా జరిగిందా?" సాలోచనగా అన్నాడు రాబర్ట్.

ఇంతలో ఒకవ్యక్తి వచ్చి కొన్ని ఫోటోలు అందించాడు. వాటిలో మార్టిన్ కెమెరాతో ఆటోమాటిక్‌లో తీసిన ఫోటోలు కూడా ఉన్నాయి. అదృష్టవశాత్తు కెమెరా లెన్స్, బురద గుంటవైపు తిరిగి ఉండటంవల్ల మార్టిన్ ఊబిలో దిగబడటం స్పష్టంగా కన్పిస్తూంది.

రాబర్ట్, వాటినిచూసి మౌనంగా అందించాడు రాజుకి.

ఇంతలో ప్రక్కనే ఉన్న ఇంటర్ కమ్యూనికేషన్ బజ్జర్ అయింది.

కెప్టెన్ రాబర్ట్ వెళ్ళి ఫోన్ అందుకున్నాడు. అతని ముఖంలో కన్పిస్తున్న నిర్లిప్తత ఎగిరిపోయింది. ఆశ్చర్యం, ఆందోళన చోటుచేసుకున్నాయి. ఫోన్‌పెట్టేసి రాజువైపు తిరిగి అన్నాడు.

"రాజూ! మరో ఉపద్రవం వచ్చిపడింది. మీ దక్కడ చూసిన బురదలాంటి పాచి యిక్కడకూడా ప్రత్యక్షమయిందిట. ఒక వ్యక్తి మరణించాడు." అని చెప్పి, తన సిబ్బందికి ఆదేశాలిచ్చి, ఫోన్‌లో ఎవరికో ఏవేవో ఆదేశాలివ్వసాగాడు.

రాజు, జాక్సన్‌లు నిర్ఘాంతపోయారు. అక్కడిది ఇక్కడికెలా వచ్చింది? తాము దానిని ముట్టుకోను కూడాలేదు.

అప్రయత్నంగానే తన చేతులవంక చూసుకున్నాడు జాక్సన్.

తాను ఆ బురదని కెలికాడు. డయలింగ్ బాక్స్‌లకయిన వాటిని తీసిపారేశాడు. తమకే అంటుకొని వచ్చి ఉండాలి. అయితే ఒకవ్యక్తి ఎలా మరణించగల్గాడు? ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు.

కంట్రోలింగ్ రూంలోని సిబ్బంది ఒకరు భూమితో కాంటాక్ట్ చేయటానికి ప్రయత్నిస్తున్నాడు. కాని రేడియో సంబంధాలు అందటం లేదు.

రాజు, జాక్సన్‌లు కెప్టెన్ వెంట వెళ్ళిపోయారు.

రాబర్ట్ ఆఖరి అంతస్తు చేరుకొని, నడవా బయటికి వచ్చి, అక్కడి దృశ్యం చూసి నిలుచుండిపోయాడు.

క్వారంటైన్ బయట, తలుపుకి ఇవతలకి కొద్దిదూరంలో ఒకవ్యక్తి క్రింద పడిపోయి ఉన్నాడు. పచ్చటి పాచి అతని శరీరంనిండా పేరుకొని ఉండి. రెండు చేతులు, తల, ముఖం, ఛాతీ మొత్తం పేరుకొనిపోయి ఉంది. కాళ్ళవైపు వ్యాపిస్తోంది మెల్లగా.

నిర్జీవంగా పడివున్న అతని శరీరం చూసి ముగ్గురి హృదయాలు బాధతో స్పందించాయి. ఇంతలో నికల్సన్ అక్కడికి వచ్చాడు.

"ఇతన్ని ఎప్పుడు చూశావు?" అడిగాడు రాబర్ట్.

"ఇతని పేరు ఫ్రిడ్జి. క్వారింటైన్‌ని రోజూ శుభ్రం చేస్తాడు. స్పేస్‌కార్ వచ్చిందని, యిద్దరు వ్యక్తులు క్వారంటైన్ లోనికి వెళ్ళి వచ్చారని చెప్పాను. శుభ్రంచేయటానికి వెళ్ళిన మనిషి ఎంతసేపటికి రాకపోయేసరికి నా గది తలుపులు తెరిచి లోపలకు రాబోయాను. కాని గుమ్మంలోనుంచే ఇతని

శవం కన్పించింది. మొదట ఏదో అనుకున్నాను, కాని స్వీపర్ దుస్తుల్లో ఉండటంవల్ల వెంటనే గ్రహించి, మీకు తెలిపాను."

టైం చూసుకున్నాడు కెప్టెన్ రాబర్ట్.

"సుమారు అరగంట అవుతుంది అతను వచ్చి."

కెప్టెన్ రాబర్ట్, బురదని తొక్కకుండా ప్రక్కగా నడిచి క్వారంటైన్ దగ్గరకు నడిచాడు. గాజు అద్దంలోనుంచి చూసి, అదిరిపడ్డాడు.

క్వారంటైన్ ఫ్లోర్ నిండా ఆ పచ్చటి పాచి ఆక్రమించుకుపోయింది. గోడలమీదకు ఎగబాకుతోంది. ఆ గదిలోని సమస్తం బురదకిందే ఉంది. నేల అసలు కన్పించడం లేదు. ఎక్కడ చూసినా పచ్చటి పాచి మెరుస్తోంది ఎర్రటి వెలుగులో, నల్లటి రక్తంలా.

"ఫాంటాస్టిక్!" అనుకున్నాడు కెప్టెన్ రాబర్ట్. అతని చూపు, ఆన్ చేసి ఉన్న స్విచ్ మీద పడింది. చటుక్కున ఆఫ్ చేశాడు దానిని. క్వారంటైన్‌లో ఎర్రటి వెలుగుపోయి, మామూలు కాంతి వచ్చింది.

ఇంతలో సెటిలైట్ లాబరేటరీ ఛీఫ్, డాక్టర్ లూయిస్ పాల్, వచ్చాడక్కడికి. నలభై అయిదేళ్లుంటాయి అతనికి. దృఢమయిన శరీరం. రెండు, మూడు మార్లు అపోలో యాత్రలు చేసివచ్చిన అమెరికన్ అతను.

లోపలికి వచ్చిన లూయస్‌పాల్ వైపు తిరిగారు నలుగురు.

"మైగాడ్! వాటీజ్ ఇట్?" నేలమీద పేరుకొని ఉన్న 'పచ్చటి పాచి'ని చూచి, తెల్లబోతూ ప్రశ్నించాడు లూయిస్ పాల్.

"డాక్టరు పాల్! ఇప్పుడు సందేహాలతో కాలయాపన

కాదు, ఆ ప్రమాదకరమైన పాచిని తీసుకోండి. అన్ని విషయాలు మాట్లాడుకుందాం!"

డాక్టర్ పాల్ పరిశీలన పిమ్మట, బురదని తీసుకున్నాడు టెస్ట్ ట్యూబ్ లోనికి.

"చాలా కొంచం తీసుకోండి డాక్టర్! మనం లాబ్ ను చేరే లోపల అది చాలాఅవుతుంది!" హెచ్చరించాడు కెప్టెన్ రాబర్ట్.

ఆశ్చర్యంగా ఒకమారు రాబర్ట్ వంక చూసి, జాగ్రత్తగా టంగ్స్ తో టెస్ట ట్యూబ్ లోనికి ఎత్తి, బిరడా బిగించాడు గట్టిగా.

తర్వాత పరిసరాలు పరిశీలించాడు. క్వారింటైన్ గాజు తలుపుగుండా చూశాడు. దాదాపు అంతా అలుముకొని పోయి వుంది.

డాక్టర్ లూయిస్‌పాల్ ఈ పరిశోధనలు చేస్తున్నప్పుడే, కెప్టెన్ రాబర్ట్ విషయం అంతా వివరించాడు.

"డాక్టర్! మీరు వెంటనే దీనికి ఎరుగుడు కనుగొనాలి, ఇదిలా వ్యాపిస్తూ పోతే కొంతసేపటికి ఈ సెటిలైట్ చాలదు. దీనినంతా కలెక్ట్ చేసి, డస్ట్‌బిన్ లో వేసినా, పెరుగుతూనే ఉంటుంది. వెంటనే విరుగుడు కనుగొని ప్రయోగించాలి."

"హా ఫెంటాస్టిక్!" ఆశ్చర్యపోయాడు డాక్టర్ పాల్.

"నికల్సన్, మీకు వార్త పంపగానే ఎంతసేపటికి వెళ్లారు మీరు?" కెప్టెన్ రాబర్ట్‌ని ప్రశ్నించాడు సైంటిస్ట్ లూయిస్‌పాల్.

"వెంటనే వెళ్లాను, డాక్టర్!"

"మిస్టర్ నికల్సన్! రాజు, జాక్సన్‌లు బయటికి వచ్చిన

తరువాత ఎంతసేపటికి ఫ్రిడ్జి లోనికి వెళ్లాడు?"

"రెండు నిమిషాలు తర్వాత. అప్పటికే అది ఆఫ్ చేయ బడింది."

"ఐ. సీ" తల పంకించాడు. "తరవాత ఎంతసేపు అతను అందులో ఉన్నాడు?"

"సుమారు పావుగంట, ఇరవై నిముషాలు."

"ఈ వివరాలు దేనికి డాక్టర్?" మధ్యలో కల్పించుకుని, అసహనంగా అడిగాడు రాబర్ట్.

అతనికి క్షణక్షణానికి పెరుగుతోన్న 'బురద'ని. చూస్తుంటే కంపరంగా వుంది.

"కెప్టెన్! మీరు నాకు ఫోన్ చేసిన పావుగంటకి ఇక్క డకు వచ్చాను. అంటే ఆ పాటికి ఈ వరండా అంతా ఆ 'పాచి'తో నిండిపోయి వుండాలి. కాని అలా జరగలేదు. కాని అంతకుముందు క్వారంటైన్‌లో మాత్రం, పదిహేను, ఇరవై నిముషాలలోనే అది నిండిపోయింది కారణం ఏమిటి?''

"యస్ డాక్టర్! మేము వచ్చిన తర్వాత క్వారంటైన్ ఆన్ చేయబడి ఉండటం, గమనించి, నేనే స్విచ్ ఆఫ్ చేశాను."

"అదేమిటి సార్! నేను అంతకుముందే స్విచాఫ్ చేశాను," ఆశ్చర్యంగా అన్నాడు నికల్సన్.

"అయితే ఫ్రిడ్జి వేసుండాలి" రాజు అన్నాడు.

డాక్టర్ లూయిస్‌పాల్ ఏదో ఆలోచించి, అన్నాడు తర్వాత.

"కెప్టెన్! ఇప్పుడు కారణం కొంతవరకు ఊహిస్తు న్నాను. అయినా ఏ విషయమైనా లాబ్‌లో టెస్ట్ చేస్తేగాని

చెప్పలేను. అయితే ఒక హెచ్చరిక ఆ బురదను ఏమీ చేయకండి, కెలకటం లాంటివి. ఎవరిని దాని దగ్గరకు పోకుండా చూడండి. ఈ నడవా, ఆ క్వారంటైన్ అంతా దృఢంగా బంధింపబడాలి. మిస్టర్ నికల్సన్: ప్రస్తుతానికి మీరు, మీ రూం కూడా ఖాళీ చేయండి." చెప్పాడు డాక్టర్ లూయిస్‌పాల్.

5

కంట్రోలింగ్ రూంలోకి నడిచి, మైక్రోఫోన్ చేతిలోకి తీసుకున్నాడు రాబర్ట్. భూమితో కాంటాక్ట్ కుదిరాక వివరంగా చెప్పాడు. ఆ విషయంలో తనకు సలహాలు కావాలని కోరాడు.

భూకేంద్రం లోనివారు ఈ వార్త విని ఆందోళన చెందారు. ఈ వార్త వారిలో మరింత సంచలనాన్ని కల్గించింది.

భూమిమీద అటువంటి 'పాచి'ని యింతవరకు ఎవరూ చూడలేదు. అదేమన్నా జంతువా? వృక్షమా? ఎలావ్యాపించ గలుగుతోంది? తర్వాత అభిప్రాయం తెల్పుతామన్నారు.

కెప్టెన్ రాబర్ట్, డాక్టర్ లూయిస్‌పాల్ దగ్గిరినుంచి ఫోన్ కాల్ కోసం ఎదురు చూస్తున్నాడు.

అయితే ఈ లోపుగానే అనర్థం ఒకటి జరిగిపోయింది.

క్వారంటైన్ రూంలోనూ, బయట వరండాలోనుపెరుగుతున్న పాచి క్రమంగా ఎక్కువవటంతో నడవా అంతా విస్తరించింది. అంతటితో ఆగలేదు. తలుపుకి వున్న అతి సన్నని రంధ్రాల గుండా బయటకు వచ్చింది. అక్కడ నుంచి పెరగటం మొదలు పెట్టింది.

ఈ దృశ్యాన్ని వేరే ఎవరో చూశారు. విషయం తెలి

యక తలుపు తెరిచాడు. అప్పుడక్కడ నికల్సన్ లేడు. మరుక్షణమే అతని గుండాగి పోయినంత పనయింది. అతని కాళ్ళకు చుట్టుకొంది. పరుగెత్త బోయాడతను. కాని సాధ్యం కాలేదు. అతను దానికి బలయిపోయాడు.

క్షణాల్లో ఈ వార్త సెటిలైట్ అంతా వ్యాపించింది. అందరిలోను భయభ్రాంతులు ఎక్కువయాయి.

లూయిస్‌పాల్ వద్దకు పరుగెత్తాడు కెప్టెన్ రాబర్ట్.

ఆ సమయంలో మైక్రోస్కోప్ క్రింద ఏదో స్లైడ్ నుంచి పరీక్షిస్తున్నాడు డాక్టర్ లూయిస్‌పాల్! అతని ప్రక్కనే ఒక పెద్ద వెడల్పాటి బీకరులో పాచి పేరుకొని పోయి వుంది.

లూయిస్‌తో జరిగిన సంగతి చెప్పాడు రాబర్ట్. సైంటిస్టలో ఆదుర్దా, ఆందోళన కన్పించాయి.

"కెప్టెన్! ఒకసారి మైక్రోస్కోప్‌లో చూడండి!"

రాబర్ట్ చూశాడు. స్లైడ్ మీద ఉన్న నాలుగయిదు జీవ కణాలు క్రమంగా పెరుగుతున్నాయి. ఒక్కొక్క క్షణం రెండుగా విడిపోతోంది. మరలా ఆ రెంటినుంచి మరో రెండు ఇలా క్షణక్షణానికి పెరిగి పోతున్నాయి.

"కెప్టెన్! ఇది చాలా వింత జీవి. ఇటువంటి ఫార్మే షన్ కొన్ని జీవుల్లో ముఖ్యంగా వృక్ష జాతిలో కన్పిస్తాయి. క్షణక్షణానికి ఇది విస్తరిస్తోంది. దీనిని ఎలా అరికట్టాలో తెలియటంలేదు. ఇప్పటికే అనేకరకాల పరీక్షలకు దీనిని గురిచేశాను. కాని ఫలితం ఏమాత్రం కనిపించటంలేదు. నా అసిస్టెంట్స్ కూడా యితర కార్యకలాపాలన్నీ మానేసి దీని మీదే పరిశోధనలు చేస్తున్నారు తీవ్రంగా" చెప్పాడుపాల్.

కెప్టెన్ రాబర్ట్ అంతావిని అవాక్కైపోయి నిల్చుండి పోయాడు.

6

కాలం గడుస్తూంది. దానితో పాటే పాచి కూడా క్రమంగా విస్తరిస్తోంది. సెటిలైట్‌లోని చాలామంది దానికి ఆహుతి అయిపోయారు.

దానిని గురించిన వివరాలు భూకేంద్రానికి ప్రసారం చేశాడు కెప్టెన్ రాబర్ట్.

"లేబ్" నుండి మెస్సేజ్ రావటంతో హడావుడిగా పరుగెత్తాడు కెప్టెన్‌రాబర్ట్.

పాల్ ఎదురువచ్చి. రాబర్ట్‌ని లోనకి తోడ్కొని పోయాడు. అతని ముఖం ఆనందంతో వెలిగిపోతోంది.

"కెప్టెన్! ఆఖరికి విజయం సాధించాము. ఈ ప్రమాద కరమైన పాచికి విరుగుడు కనుక్కున్నాను. నేను చేసిన పరిశోధన ఎటువంటి కెమికల్స్ ఆ పాచిమీద పనిచేయలేదు. అయితే సడెన్‌గా చిన్న ఐడియా వొచ్చింది.

వెంటనే ఎక్స్‌పెరిమెంట్స్ చేశాను. గుడ్ రిజల్ట్స్ వచ్చాయి. మరికొన్ని పరీక్షలు చేసి ధృఢపరుచుకున్నానే గాని మీకు తెలియచేయలేదు చూడండి!"

అంటూ 'పాచి'తో నిండివున్న ఒక టెస్ట్ ట్యూబ్‌ను చూపించాడు. దానిలో సగంవరకు 'పాచి' ఉండి వ్యాపిస్తోంది మెల్లిగా.

దానిని ఒక 'ఫ్రిజ్'లో ఉంచాడు. ఆశ్చర్యంగా తనవంక చూసిన రాబర్ట్‌వంక చూసి నవ్వాడు పాల్.

"ఇందులో ఏమీలేదు. కేవలం ఊహామాత్రమే. లాజికల్‌గా ఆలోచించాను. వేడి తగులు తున్నప్పుడు ఈ

'బురద' పెరుగుతోంది. పెరిగి చుట్టుప్రక్కల వ్యాపిస్తోంది. దీనికి విరుగుడేమై ఉంటుంది? చల్లదనం. ఆ చల్లదనంలో నుంచితే ఏమవుతుంది? ఇదీ నా కొచ్చిన అనుమానం. వెంటనే కొంత తీసుకొని ఫ్రిజ్‌లో ఉంచాను. ఇప్పుడు మీరే చూడండి."

నాలుగయిదు నిమిషాలనంతరం ఫ్రిజ్‌లోనుంచి టెస్ట్ ట్యూబ్‌ను బయటికి తీశాడు పాల్. దానిని చూసి ఆనం దంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు కెప్టెన్ రాబర్ట్.

ఇందాక ఫ్రిజ్‌లో ఉంచేముందు, టెస్ట్ ట్యూబ్‌లో ఎంత వుందో అంతే ఉంది యిప్పుడు. పైగా నల్లగా కలవి నట్లుంది. మరో రెండు నిమిషాలు చూసినా దానిలో చలనం కన్పించలేదు.

"అయితే, యిది నిజంగా చనిపోయినట్లేనా?" సందే హంగా ప్రశ్నించాడు కెప్టెన్ రాబర్ట్.

లూయిస్‌పాల్ నవ్వి, అతని కళ్ళముందే ఆ ట్యూబ్‌ని వేడి చేశాడు. ఆ ట్యూబ్‌లో మళ్ళీ కదలిక ప్రారంభం అయింది.

"అర్థం అయింది గదా! దానిని పూర్తిగా నాశనం చేయటం యింకా మనకు తెలియదు. అయితే తాత్కా లికంగా వొచ్చిన ఈ ప్రమాదం నుండి బయట పడాలి ముందు. అంటే ఈ స్పేస్ సెటిలైట్‌ని అంతా చల్లబర చాలి. మీరు వెంటనే వెళ్ళి సెటిలైట్‌లోని ప్రతి ఒక్కరిని హాలులో ప్రవేశపరచండి. ఆ హాలు తప్ప మిగిలిన సెటి లైట్ అంతా చల్లపరచుదాము. ఎవరూ ఆ హాలులో తప్ప ఇతరచోట్ల వుండకూడదు. అంత చల్లదనం భరించలేరు ఎవరూ:"

కెప్టెన్ రాబర్ట్ ఫోన్‌లో తన సిబ్బందికి చకచకా ఆర్డర్స్ జారీచేశాడు. ఫోన్ పెట్టి డాక్టర్ పాల్‌వైపు తిరిగాడు.

"డాక్టర్! ఒక చిన్న సందేహం!" అన్నాడు రాబర్ట్.

"యస్! చెప్పండి."

"ఈ సెటిలైట్‌ను అంతా చల్లబరచటం ఎలా?"

"ఓ అదా! వివరించటానికి టైమ్ లేదు. అంతా కొన్ని రకాల గాసెస్ ద్వారా జరుగుతాయి. కొన్ని రకాల వాయువుల్ని రకరకాల నిష్పత్తిలో కలిపినపుడు తనకు కావల్సినంత టెంపరేచరుకు చల్లబరచవచ్చు."

కెప్టెన్ రాబర్ట్‌కు ఆ సమాధానం కొండంత ఉపశమనాన్ని ఇచ్చింది.

7

కెప్టెన్ రాబర్ట్ ఆర్డర్స్‌పైన, అతని సిబ్బంది నందరినీ ఒక హాలులో ప్రవేశపెట్టారు. ఆ హాలు, కంట్రోలు రూం లాబరేటరీలో తప్ప మరోచోట ప్రాణికోటి లేదు.

లాబ్‌నుంచి చకచకా రకరకాల వైర్లను ప్రతిగది, నడవా మొదలయిన వాటికి బిగించారు.

కంట్రోల్‌రూం, హాలులోను, లాబ్‌లోనూ తప్ప మరెక్కడా లైట్స్ లేవు. మిగతా సిబ్బంది అంతా గుండె లరచేతుల్లో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు హాలులో.

డాక్టర్ లూయిస్‌పాల్, కెప్టెన్ రాబర్ట్ స్వయంగా దగ్గరుండి అంతా జాగ్రత్తగా జరుగుతున్నది లేనిది చూస్తున్నారు.

లాబ్ ప్రక్కనే మరో పెద్దహాలు ఉంది. అక్కడనుండి

రకరకాల వాయువుల్ని తయారుచేసి కనెక్ట్ చేయబడిన గొట్టాలద్వారా సెటిలైట్‌ని నింపసాగారు. క్షణాలలో ఆ సెటిలైట్ నిండా వాయు మిశ్రమాలు అలుముకో సాగాయి.

లాబ్‌లోనే మరో గదిలో లూయిస్ ఆజ్ఞపై పెద్దతొట్టిలో వున్న నీటిలో కొన్ని రకాల ద్రావకాలు కలుపుతున్నారు మరికొందరు. అదెందుకన్నట్లుగా చూశాడు రాబర్ట్.

"ఘనీభవించిన ఆ పాచిని ఈ నీటితో కడిగివేయాలి. మామూలు బురద పోయినట్లు పోతుంది. దానినంతా కలెక్ట్ చేసి తిరిగి ఆ ఎర్రగోళం మీదే వదిలేద్దాం!" అన్నాడు పాల్.

రెండు గంటలపాటు ఏకధాటిగా వాయువులు ప్రవహించాయి. మరో అరగంట తర్వాత డాక్టర్ లూయిస్‌పాల్, కెప్టెన్ రాబర్ట్‌లతోపాటు మరి యిద్దరు వెళ్ళి, ఒక గదిలో పాచిని చూసి వచ్చారు.

అక్కడ పాచి అంతా నల్లగా కమిలిపోయి ఉంది. పాల్ వెంటవచ్చిన అసిస్టెంట్ ఒకతను తన చేతిలోనున్న చిన్న పారవంటి దానితో 'బురదని' పైకి లేపాడు. గట్టిగా గడ్డకట్టి ఎండిపోయిన బురదలా పైకి వచ్చింది.

రెండుమూడు గదులు చెక్ చేసి, మరోగంట వాయువుల్ని పంపి, అంతా సరిగా ఉందని నిర్ణయించుకున్నారు.

కొంతమంది వెళ్ళి ఒక్కొక్క గదినే జాగ్రత్తగా చల్లని నీటితో పంప్‌చేసి కడుగుతూ వెళ్తుంటే, మరికొంతమంది నీటితొట్టెని నీటితో నింపి రసాయనాలు కలుపుతున్నారు.

ఇప్పుడు ఎవరిలోను ఆందోళన ఏమాత్రం లేదు.

కడిగిన గదినే నాలుగయిదు మారులు జాగ్రత్తగా కడుగుతూ, వాష్‌చేస్తున్నారు సిబ్బంది.

కెప్టెన్ రాబర్ట్ ఈ వివరాలన్నింటినీ భూమిమీదకు కూడా ఎప్పటికప్పుడు పంపుతున్నాడు.

కొంతకాలం తరువాత డాక్టర్ లూయిస్ అనుజ్ఞమీద పాచిని తీసివేసిన ఒక గదిని మామూలుగా చేసి వేడిచేశారు. అక్కడే ఉన్నవారికి ఎటువంటి బురదా కన్పించలేదు అరగంట వెయిట్ చేసినా.

కెప్టెన్ రాబర్ట్ సంతోషంతో డాక్టర్ లూయిస్‌పాల్‌ని కౌగలించుకున్నాడు. అతని ముఖంలో యిప్పుడు ఎంతో రిలీఫ్ కన్పిస్తోంది. ఎన్నో లక్షల డాలర్లు ఖర్చుపెట్టి, ఎంతో శ్రమతో తయారుచేసిన ఈ స్పేస్‌రీసెర్చ్ సెటిలైట్ నిరుపయోగం అవుతుందని భయపడ్డాడు. కాని అటువంటిదేమీ జరగదని తెలియగానే అతని హృదయం ఆనందంతో పరవళ్ళు తొక్కింది.

మరో రెండుగంటలనంతరం కలెక్ట్‌చేసిన బురదనంతా ఒక స్పేస్‌కారులో కుదించారు. కొంత పరిశోధనలకి తీసుకున్నాడు లూయిస్.

ఇప్పుడు స్పేస్‌రీసెర్చ్ సెటిలైట్‌లో ప్రతిగది యథావిధిగా ఉంది. అంతటా లైట్లు వెలుగుతున్నాయ్. మనుషులు తిరుగుతున్నారు.

స్పేస్‌రిసెర్చ్ సెటిలైట్‌లో కార్యక్రమాలు తిరిగి యథావిధిగా మొదలయ్యాయి.

ప్రమాదకరమైన ఆ 'పాచి'ని తీసుకుని వెళుతున్న స్పేస్ కార్ దూరంగా అంతరిక్షంలో, ఎర్రగోళంవైపు వెళ్తుండటం చాలామంది చూసి నిట్టూర్చారు. వారిలో కెప్టెన్ రాబర్ట్ కూడా ఉన్నాడని వేరే చెప్పక్కర్లేదు.

***

బొంబాయి రహస్యం?

హుస్సేన్ బాషా

డిటెక్టివ్ శ్రీ ప్రేమ్‌కుమార్ సతీమణి జయశ్రీ బయట హాలులో పడక కుర్చీలో కూర్చొని దినపత్రిక తిరగేయ సాగింది.

జయశ్రీగారూ! నమస్తే!" అంది మిస్ రాజేశ్వరి.

"జయశ్రీ తలెత్తిరాజేశ్వరిని చూసింది. "నువ్వు లక్షాధికారి మాధవయ్య కూతురు మిస్ రాజేశ్వరివి కదూ?" అని అడిగింది ఆమెను ఇదివరకెప్పుడో, చూసిన గుర్తు రాగా జయశ్రీ.

"అవును. నేను చిక్కుల్లో పడ్డాను. మీ సహాయం కోరి వచ్చాను."

"లోనికి వెళ్దాం రా!" అని జయశ్రీ రాజేశ్వరిని వెంట బెట్టుకొని ప్రైవేటు రూముకు పిలుచుకు వెళ్ళింది.

రాజేశ్వరికి ఒక ఖాళీ కుర్చీ చూపించి తను కుర్చీలో కూర్చుంది జయశ్రీ.

"ఇది ప్రైవేటు రూం. నా ఆజ్ఞ లేనిదే యెవరూ లోనికి రారు. నీ కేసేమిటో నిర్భయంగా చెప్పు!" అంది జయశ్రీ పేపర్ వెయిట్‌ను గ్లాస్‌మీద మెల్లగా త్రిప్పుతూ.

రాజేశ్వరికి దుఃఖం ముంచుకు వచ్చింది.

నునుపైన ఆమె చెక్కిళ్ళమీద అశ్రుబిందువులు జారుతున్నాయి.

"ఏం జరిగింది?"

రాజేశ్వరి కన్నీళ్ళు తుడుచుకుంది. జాకెట్‌లో దాచుకొని తెచ్చిన ఉత్తరాన్ని బయటికి తీసింది. "ఈ వుత్తరం చదవండి?" అని జయశ్రీకి అందించింది.

జయశ్రీ ఉత్తరం తీసుకొని ఇలా చదవసాగింది:

"డియర్ రాజీ! —

నీ పెళ్ళి నిశ్చయమైందని తెలిసింది. చాలా సంతోషం! ....అహ నేను సంతోషించేది యిప్పుడు కాదు; నేను కోరింది నువ్వు యిచ్చినప్పుడు—సంతోషిస్తాను. నీ జీవిత రంగంలో ఎలాటి పాత్ర ధరించకుండా నిష్క్రమిస్తాను.

రాజీ—! నే నెవర్నో తెలుపను. ఐయాం వెరీ సారీ ఫర్ దిస్ ట్రబుల్....అయితే ఒకటి మాత్రం చెప్పగలను; నిన్ను ప్రేమించిన ప్రేమికుల్లో నేనొక ప్రేమికుడ్ని! కాని, నీ తిరస్కారంతో నీపై ఆశలు వదుకొని, నీపై ప్రేమను చంపుకొని, ప్రతీకారం తీర్చుకోవడంకోసం; ఎన్నాళ్ళనుండో సమయంకోసం వేచియున్న పగబట్టిన మనిషిని! కనుక, నీ పెళ్ళి రంగథామ్‌తోనే కాదు—ఇంకెవరితోనూ జరుగకుండా చూడడమే నా ప్రధాన లక్ష్యం. తప్పకుండా సాధించగలననే నమ్మకం—ఆశ నాకుంది.

రాజీ! నిన్ను ప్రేమించిన వారిని తిరస్కరించావ్,

కామించినవారిని శిక్షితుల్ని చేశావ్. దాన్నిబట్టి నువ్వొక పవిత్రమూర్తివని యువలోకం నమ్మింది. రాజేశ్వరి నిప్పు లాంటి మనిషని భావించింది. కాని, నువ్వు చేసిన భయంకరమైన తప్పును యెవరూ గుర్తించలేని అంధులయ్యారు గనుక నువ్వొక అనాఘ్రాత పుష్పానివని అందరూ నమ్ముతున్నారు. ఆ నమ్మకంతోనే రంగధామ్ నిన్ను పెళ్ళి చేసుకోడానికి అంగీకరించాడు. నీ శీలసంపద కొల్లగొట్టుకుపోయిన రహస్యం నాకు తెలియదని అపోహపడకు.

నువ్వు రామారావ్‌ను ప్రేమించావ్. అతనిలో దాగియున్న ఏ మహత్తర శక్తో నిన్ను సునాయాసంగా లొంగదీసింది. ఫలితం: అతనివల్ల నీకు గర్భం వచ్చింది. రహస్యం బయట పడుతుందని భయపడి ఆత్మహత్యకు సిద్ధమయ్యావు.

ఆ విషయం యెలాగో నీ ఫాదర్‌కి తెలిసింది. నీ తండ్రి ఎంతో బాధపడ్డాడు. అవమానంతో కుమిలిపోయాడు. ఒక్కగా నొక్క కూతురివి గనుక అన్ని ప్రాణాలు నీపై నిలుపుకొని జీవిస్తున్న మీ నాన్న నువ్వు ఆత్మహత్య చేసుకోకుండా రక్షించుకున్నాడు. నువ్వు చేసిన తప్పును క్షమించి కర్తవ్య మేమిటా అని ఆలోచనల్లో పడ్డాడు. చివరికి నిన్ను రామారావ్ కిచ్చి పెళ్ళిచేసి పరువు నిలుపుకోవాలనుకున్నాడు. కాని, నిన్ను ప్రేమించి గర్భవతిని చేసిన రామారావ్ కారు ఆక్సిడెంట్‌లో మరణించాడని తెలిసి కృంగిపోయాడు. అతని ఆవేదనకు అంతులేకుండా పోయింది.

ఆఖరికి—ఒక నిర్ణయానికి వచ్చాడు—ఎవరికి తెలియకుండా రహస్యంగా గర్భవిచ్ఛిన్నం చేయాలని.

ఆ పని యిక్కడ జరిగితే నలుగురిలో తల వంచుకో వలసి వస్తుందని ఆలోచించి వెంటనే నిన్ను తీసుకొని బొంబాయికి వెళ్ళాడు. అక్కడ బాబూభాయ్ స్ట్రీట్‌లో యున్న నవ్‌రంగ్ హోటల్, రూం నెం — 119 లో బస చేశాడు. ప్రైవేట్ లేడీ డాక్టర్ మణిమేఖలకు రెండు వేల రూపాయలిచ్చి గర్భస్రావం చేయించాడు. నెల రోజుల తరువాత నిన్ను మామూలు మనిషిని చేసి మద్రాసుకు తీసుకువచ్చాడు.

దేవరహస్యంలాంటి ఈ నిగూఢ రహస్యం నాకు తప్ప యింకెవరికీ తెలియదు. ఈ విషయం అబద్ధమని చెప్పి ఆత్మవంచన చేసుకోలేవు.

మిస్ రాజీ! —

ఈ రహస్యం బయటపడితే హృదయమున్న ఏ మగాడు నిన్ను పెళ్ళి చేసుకోలేడు. ఈ రహస్యం రహస్యంగా సమాధి కట్టుకుపోవాలంటే ఒక లక్షరూపాయలు నా ముఖాన పడెయ్! నిరాటంకంగా రంగధామ్‌ను పెళ్ళి చేసుకో! —

రేపు రాత్రి 9 గంటలకు నువ్వు కాష్ తీసుకొని మెరీనా కాంటీన్‌కు కుడిప్రక్కగా వంద గజాల దూరంలో పేవ్ మెంట్ మీద నిలబడివుంటె — నేరుగా నీ దగ్గరికి ఒక కారు వచ్చి నిలబడుతుంది. నిన్ను చూసి బొంబాయి రహస్యం- అని చెబుతాను. వెంటనే డబ్బు యిచ్చెయ్! లేకుంటే ఎల్లుండి వుదయం 9 గంటలకంతా ఈ రహస్యం రంగ ధామ్‌కు తెలుపుతాను. అంతటితో నీ పెళ్ళిపెటాకులవుతుంది. అయినా, ఎప్పటికైనా నావల్ల నీకు ఆపదేనని మర్చి పోకు! —" అని వుంది. అందులో ఎవరి పేరుగాని, సంతకంగాని లేదు.

ఒక వేడి నిట్టూర్పు విడిచింది జయశ్రీ. ఉత్తరాన్ని టేబిల్‌పై వుంచి రాజేశ్వరి ముఖంకేసి చూసింది.

"రాజేశ్వరీ!—ఎందుకు చేశావమ్మ ఈ పాడు పని?"

ఆమె పలుకలేదు.

వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"ఇంతకూ ఈ ఉత్తరంలోని విషయాలు నిజమా? అబద్ధమా??"

"ని....జ....మే!—"

"యవ్వనంలో వున్న కన్య ఒకసారి కాలు జారితే జీవితం ఎంత దుర్భరమవుతుందో ఆలోచించారా? ఈ తప్పును సరిదిద్దడం ఒకరి చేతుల్లో పనిగాదు. నీ మీద పగ బట్టిన మనిషి చాలా ఘటికుడై వుండాలి. ఇన్ని వివరాలు సేకరించగలిగాడంటే అతను నిన్ను మొదటినుండీ నీడలా వెంటాడుతూ వుండొచ్చు; ఒకనాటితో అతను అడిగినంత డబ్బు యిచ్చి అతని నోరు మూయించలేము. అతనివల్ల ఏనాటికైనా నీకు ప్రమాదమే! క్షణం—క్షణం అతను నిన్ను భయపెడుతూ డబ్బు గుంజడానికి ప్రయత్నం చేస్తాడు" జయశ్రీ చెప్పడం ఆపి ఆలోచించ సాగింది.

"జయశ్రీగారూ!—నా కిప్పుడు మరణం కంటే వేరే గత్యంతరం లేదు."

"తొందరపడి ఆ పనికి తలపడకు."

"దయచేసి నన్ను ఈ బ్లాక్‌మెయిలర్ బారినుండి రక్షించండి!" దీనంగా వేడుకుంది రాజేశ్వరి.

"ఈరోజు యితను! రేపు మరో అతను! ఎల్లుండి యింకో మనిషి! ఈ విషయం అతని కొక్కడికే తప్ప మరెవ్వరికీ తెలియదని ఎలా నమ్మగలం రాజేశ్వరీ?—"

"ఇతను తప్ప మరెవ్వరూ ఉత్తరాలు వ్రాయలేదు."

"ఎవరితను?"

"తెలియదు. నా బ్రతుకు నవ్వులపాలు కావల్సిందేనా?...."

జయశ్రీ వెంటనే జవాబు యివ్వలేదు. కొద్ది క్షణాలు ఆలోచనల్లో పడింది....

ఆశగా జయశ్రీ మొహంలోకే చూస్తూంది రాజేశ్వరి.

"రాజేశ్వరీ!—" ఏదో స్ఫురణకు రాగా చటుక్కున పిలిచింది జయశ్రీ.

"ఈ బ్లాక్ మెయిలర్ దొరకడంటారా?"

"నాకు అనుమానం కలుగుతోంది రాజేశ్వరీ!—నా అనుమానం తీరేవరకు నేనేమీ చెప్పలేను. ముందు నేనడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పు?—"

అడుగమన్నట్లు తలూపింది రాజేశ్వరి.

"ఈ ఉత్తరం పోస్టులో వచ్చినట్లు లేదు. నీకు యెవరు తెచ్చి యిచ్చారు?"

"నాకెవరూ తెచ్చి యివ్వలేదండీ! నిన్న సాయంత్రం ఫస్ట్ షో సినిమాకు వెళ్ళి 9-30 కి యింటికి వచ్చాను. భోజనం చేసి నా పడగ్గదిలోకి వెళ్ళాను. మంచంమీదుంది ఈ ఉత్తరం."

"ఆ బ్లాక్ మెయిలర్ ఈ ఉత్తరాన్ని మీ యింటి పని మనుషులతో పంపించి వుండాలి. లేదా, తనే ఎవరికీ తెలియకుండా దొంగతనంగా యింట్లో ప్రవేశించి నీ పడగ్గదిలో పెట్టి వుండాలి."

"నౌఖరు రాజయ్యను, వంటమనిషి గోవిందమ్మను అడిగాను, వాళ్ళు తమకేమీ తెలియదని దేవునిమీద ప్రమా

ణాలు చేస్తున్నారు."

"మీ అమ్మా—నాన్న, పనిమనుషులు యింట్లో వుండగా అతను యెలా వచ్చి వుంటాడంటావ్?"

"ఏమో తెలియదు."

"నువ్వు సినిమాకు వెళ్ళినప్పుడు మీ ఇంటికి ఎవరెవరు వచ్చి వెళ్ళారో తెలుసుకున్నావా?"

"రాత్రి ఎనిమిది గంటల సమయంలో నా కోసం రంగ ధామ్ వచ్చి వెళ్ళాడని అమ్మ చెప్పింది."

"ఈ ఉత్తరం యెవరు వ్రాసి వుంటారో వూహించి చెప్పలేవా!"

"ఊఁహూ—"

"లోగడ నీకు వచ్చిన ప్రేమలేఖల్లో యిలాంటి దస్తూరీ గల ప్రేమలేఖలు యెవరు వ్రాసివుండేవారో జ్ఞాపకం చేసుకో!"

"జ్ఞాపకం రావడం లేదు. ఆ—లేఖల్ని ఆ నాడే చింపేశాను."

ఓ క్షణకాలం ఆలోచించింది జయశ్రీ.

"పోనీ ఈ విషయమైనా గుర్తుందేమో చెప్పు! ఉత్త రాల్లో నిన్ను 'రాజీ!—' అని సంబోధిస్తు వ్రాసిం దెవరో?...."

"నా కిప్పుడు జ్ఞాపకమొస్తోంది. కాలేజి స్టూడెంట్ జానకిరాం నన్ను 'రాజీ—!', అని సంబోధిస్తూ వ్రాసే వాడు—"

"జానకిరాం యిప్పు డెక్కడుంటున్నాడో తెలుసా?"

"ఆచారప్పన్ స్ట్రీట్ లో—"

"అతను నిన్ను ప్రేమించాడా?"

"రెండుసార్లు అతను నాకు ప్రేమలేఖలు వ్రాశాడు."

"అయితే జానకిరాం బ్లాక్ మెయిలర్ అయివుండొచ్చు. ఈః రోజు రాత్రి 9 గంటలకు లక్షరూపాయలు తీసుకొని నిన్ను మెరీనా కాంటిన్ దగ్గరికి రమ్మన్నాడు కదా? నువ్వు అక్కడికి వెళ్ళకు. జానకిరాం విషయం నేను చూసుకుంటాను. నువ్వు యింటికి వెళ్ళు!" అంది జయశ్రీ.

2

జయశ్రీ ఆలిండియా టెలిఫోన్ డైరెక్టరీ తీపింది.

అందులో బొంబాయి. బాబూభాయ్ స్ట్రీట్‌లో యున్న 'హోటల్ నవరంగ్'—టెలిఫోన్ నెంబర్ తెల్సుకుంది. వెంటనే ఆ నెంబర్‌కు ట్రంకాల్ పెట్టింది.

పది నిముషాల్లో తనకు బొంబాయినుండి కనెక్షన్ యిచ్చింది ఆపరేటర్.

తన్నుతాను పరిచయం చేసుకుంటూ 'నవ్‌రంగ్ హోటల్' ప్రొప్రైటర్‌తో మాట్లాడింది. హోటల్ ప్రొప్రైటర్ బొంబాయిలోనే వున్నాడు గనుక అతన్ని అనుమానించడానికి ఆస్కారంలేదు.

మేనేజర్ గురించి అడిగింది. మేనేజర్ సుందరం ఉద్యోగానికి రిజైన్ యిచ్చి వెళ్ళి వారం రోజులైందని చెప్పాడు ప్రొప్రైటర్.

టెలిఫోన్ పెట్టేసింది. ఆమె దృష్టిలో సుందరంకూడా అనుమానితుడు. రాజేశ్వరి విషయమంతా అతను తెల్సుకొని వుండాలి. అతను మద్రాసుకు వచ్చి రాజేశ్వరిని బెదిరించి బ్లాక్ మెయిల్ మూలంగా లక్షలు సంపాదించవచ్చని ఉద్యోగానికి రిజైన్ చేసుండొచ్చు.

పోతే, జానకిరాంకు ఈః విషయాలన్నీ తెలిశాయంటే అతను రాజేశ్వరిని అనుసరిస్తూ బొంబాయికి వెళ్లుండాలి. అతను బొంబాయికి వెళ్ళకుంటే రాజేశ్వరి రహస్యం అత

నికి యెలా తెలిసింది? అసలు, అతను వెళ్ళాడా లేదా—తెల్సుకోవడం ముఖ్యం.

జయశ్రీ కాలింగ్ బెల్ నొక్కింది. బోయ్ భావన గదిలోకి వచ్చాడు. అతనికి కొన్ని వివరాలు చెప్పి వెంటనే వెళ్ళి జానకిరాంమీద ఓ కన్నువేసి వుంచమని, అతను రాత్రి 9 గంటలవరకు యెక్కడికి వెళ్తాడో, ఏం చేస్తాడో, ఎవరెవర్ని కలుసుకుంటాడో తెలుసుకోమని పంపింది.

బోయ్ భావన ఆచారప్పన్ స్ట్రీట్‌లోయున్న జానకిరాం ఇంటి సమీపానికి వెళ్ళేసరికి-జానకిరాం హత్య కాబడ్డాడని తెల్సుకొని ఆశ్చర్యచకితుడయ్యాడు భావన, గాలిలా హత్యా ప్రదేశానికి దూసుకుపోయి యింటిముందు వెళ్ళేసరికి గుంపులా వున్న మనుష్యుల్ని త్రోసుకుంటూ లోపల్నుండి ఇన్‌స్పెక్టర్ మనోహర్ బయటికి వచ్చాడు.

భావనని చూసి చిరునవ్వుతో—"అప్పుడే జానకిరామ్ హత్యా విషయం మీదాకా వచ్చిందా?" అని అడిగాడు.

రాజేశ్వరి విషయం క్లుప్తంగా ఇన్‌స్పెక్టర్ మనోహర్‌తో చెప్పాడు.

మనోహర్ ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది.

"బ్లాక్‌మెయిలర్‌గా అనుమానింపబడ్డ జానకిరాం హత్య కాబడ్డాడంటే ఈ బ్లాక్‌మెయిలింగ్ కేసులో మరో వ్యక్తికి సంబంధం వుందన్నమాట. ఎవరతను?...." అని "భావనా! జీపెక్కు— జయశ్రీగారితో అర్జంటుగా మాట్లాడాలి." అంటూ జీప్ ఎక్కాడు ఇన్‌స్పెక్టర్ మనోహర్.

పోలీస్ జీప్ శాంతినిలయం ముందాగింది. మనోహర్‌ను చూసి ఆశ్చర్యపడిన జయశ్రీ, "భావనా! చెప్పిన పని ఏం చేశావ్. మనోహర్‌గారి వెంట వచ్చావు?" అని అడిగింది.

"జానకిరాం గంట క్రితం హత్యకాబడ్డాడు అమ్మ గారూ!''

"ఈజ్ యిట్?"

"భావన్ అబద్ధం చెబుతున్నాడనా అనుమానం. జయశ్రీ గారూ! హంతకుడు పట్టపగలే యింట్లో ఒంటరిగా యున్న జానకిరాంను రివాల్వర్ పేల్చి హత్య చేసి పారిపోయాడు. రివాల్వర్ శబ్దం విని ప్రక్కింటివాళ్ళు బయటికి వచ్చేసరికి హంతకుడు మోటర్‌బైక్ ఎక్కి విచిత్రంగామాయమయ్యాడట. మనిషినెవరూ గుర్తించలేకపోయారు. ఆ వీధిలో ఐస్‌క్రీమ్ అమ్మడానికి వస్తున్న కుర్రాడు ఎం. ఎస్. వై. 202 మోటార్‌బైక్ శరవేగంగా దూసుకుపోవడం చూశానంటున్నాడు. మనిషి ఆనవాలు చెప్పలేనంటున్నాడు."

''నెంబరును బట్టి అది ఎవరి మోటారుబైకో తెల్సుకోవచ్చుగా?''

''అది 'పద్మా ఫర్టిలైజర్స్' అండ్ కంపెనీ—మేనేజర్ రంగధామ్‌ది. అతను ఉదయం 10 గంటలకు ఉస్మాన్ రోడ్‌లో యున్న 'సుధాకేఫ్' లో కాఫీ త్రాగుతుండగా బయట వుంచి వచ్చిన తన మోటారుబైక్, బయటికి వచ్చి చూసే సరికి మాయమైందని పోలీస్ రిపోర్ట్ యిచ్చాడు. దాన్ని హంతకుడు ఉపయోగించుకున్నాడని తెలుస్తోంది." అని చెప్పాడు ఇన్‌స్పెక్టర్ మనోహర్.

''అలాగా?—" అని జయశ్రీ ఏదో ఆలోచిస్తూనే టెలిఫోన్ డైరెక్టరీ తిరగేసింది. అందులో పద్మా ఫర్టిలైజర్స్ అండ్ కం ఫోన్ నెంబర్ చూసి, రింగ్ చేసింది.

"ఎస్. మేనేజర్ రంగధామ్ స్పీకింగ్...."

"హల్లో! రంగధామ్‌గారూ! నేను రాజేశ్వరిని మాట్లాడుతూంట. గంట క్రితం నీకు ఫోన్‌చేశాను. నువ్వు ఆఫీసులో

లేవని చెప్పారు. ఎక్కడికి వెళ్లావ్?" రాజేశ్వరి కంఠాన్ని అనుకరిస్తూ అంది జయశ్రీ.

"చెక్ కాష్ చేయడానికి బాంకికి వెళ్లాను."

"నేను కూడా పనిమీద బాంక్‌కు వచ్చానే. కనిపించ లేదు నువ్వు?"

"నువ్వు స్టేట్ బాంక్‌కి వెళ్ళి వుంటావు. కాని, మా కంపెనీ అకౌంట్ ఆంధ్రా బాంక్‌లో ఉంది."

"అలాగా? రంగధామ్! ఈ రోజు నా మనసేమీ బాగ లేదు. 6 గంటలకు వచ్చెయ్. ఇద్దరం కలిసి 'షోలే' పిక్చర్‌కు వెళ్దాం. వస్తావ్ కదూ?"

"ఐయామ్ వెరీ సారీ మిస్ రాజేశ్వరీ! ఈరోజు రాలేను. ఆఫీసులో పని ఎక్కువగా వుంది. ఏమీ అనుకోకు. రేపు వెళ్దాం."

"నువ్వు మోటారుబైకు తెస్తే ఇద్దరం దానిమీద అలా... హాయిగా తిరిగి సినిమాకు వెళ్దాం అనుకున్నాను. బాడ్ లక్!" నిరుత్సాహం కనిపించింది మాటల్లో జయశ్రీ.

"నామీద నీకెంత ప్రేముందో నాకు తెలుసు. నాకూ రావాలనే వుంది. కాని, రాలేకపోతున్నందుకు బాధగానూ వుంది. రేపు తప్పకుండా వెళ్దాం రాజేశ్వరీ! ప్రామిస్!"

"సరే. ఈరోజు సినిమాకు వెళ్ళడం మానుకుంటాను." అని రిసీవర్ పెట్టేసింది జయశ్రీ.

"ఇన్‌స్పెక్టర్! విన్నారు కదూ?"

"విన్నాను. కాని, ఏమీ అర్థంకాలేదు."

జయశ్రీ మందహాసం చేసింది. వెంటనే ఆంధ్రా బాంక్‌కు టెలిఫోన్ రింగ్ చేసింది. ఏజెంట్‌తో కొద్దిసేపు మాట్లాడి ఫోన్ పెట్టేసింది.

"మీరు రంగధాంను అనుమానిస్తున్నట్లున్నారు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"అనుమానమే కాదు. జానకిరాంను హత్యచేసిన హంతకుడు, రాజేశ్వరి బ్లాక్ మెయిలర్ అతనే!"

"రాజేశ్వరి అతన్ని పెళ్ళి చేసుకోబోతోంది."

"ఆ పెళ్ళి జరగదు."

"అంతా అయోమయంగా వుంది."

"నో. నో. ఇట్ ఈజ్ వెరీ సింపుల్ కేస్. 'పద్మా ఫర్టిలైజర్స్' కంపెనీ దగ్గరికి వెళ్దాం రండి. హంతకుడ్ని మీకు అప్పగిస్తాను" అని జయశ్రీ ఇంకేమీ మాట్లాడకుండా బయటికి వచ్చింది.

3

పోలీస్ జీపు పద్మా ఫర్టిలైజర్స్ ముందాగింది.

"ఇన్‌స్పెక్టర్! మీరు వెంటనే లోపలికి రాకండి. గేటు దగ్గర నిలుచున్నది వాచ్ మెన్ అనుకుంటాను. అతన్ని ఇలా పిలవండి!" అంది జయశ్రీ జీప్ దిగుతూ.

ఇన్‌స్పెక్టర్, వాచ్ మెన్‌కేసి చెయ్యి వూపాడు. వాచ్ మెన్ వెంటనే పరుగున జీప్ దగ్గరికి వచ్చాడు. "నమస్కారాలు బాబుగారూ!" అన్నాడు.

ఎస్. సి. మనోహర్ తల పంకించాడు.

జయశ్రీ అడిగింది. "నువ్వు ఈ కంపెనీ వాచ్‌మన్‌వా?"

"అవునమ్మగారూ!"

"పేరు?"

"రాజయ్య."

"రాజయ్యా! మేనేజర్ రంగధాం ఆఫీసులో ఉన్నాడా?"

"ఉన్నారమ్మగారూ?"

"రంగధామ్ తన మోటారు టైర్ పోయిందని ఉదయం

పోలీస్ రిపోర్ట్ యిచ్చాడు. నిజంగా అది చోరీ కాబడిందా?"

"ఆ విషయం ఎవరికీ ఆయనగారు చెప్పలేదు. అసలు మోటారు బైక్ చోరీకాందే? 12 గంటల ప్రాతంలో మోటారుబైక్‌లానే భోజనానికని వెళ్ళాడు. మూడు గంటల ప్రాంతంలో తిరిగి వచ్చారు."

"మోటారు బైక్ మీదా?"

"కాదు టాక్సీలో వచ్చారు."

"సరె, నువ్వెళ్ళు."

వాచ్‌మేన్ గేటు దగ్గరికి వెళ్ళిపోయాడు.

మనోహర్ ఆశ్చర్యంతో అన్నాడు. "అరే, ఉదయం 10 గంటలకు మోటార్‌బైక్ పోయిందని రంగధామ్ రిపోర్ట యిచ్చాడే! జానకిరామ్ హత్య 12-25 నిమిషాలకు జరిగింది. హంతకుడెవరో ఆ మోటరుబైకును దొంగలించుకుపోయి జానకిరాం హత్య చేసియుంటే-మరి 12 గంటల ప్రాంతంలో రంగధామ్‌కు ఆ మోటారుబైక్ ఎలా వచ్చింది?...."

"తన మోటారుబైక్‌ను ఎవరో ఉపయోగించుకున్నారని ఎలిబీకోసం రాంగ్‌గా రిపోర్ట్ యిచ్చాడు. ఆ మూర్ఖత్వం వల్లే దొరికి పోయాడు.

"ఆల్‌రైట్. ఇన్‌స్పెక్టర్! నేను లోపలికి వెళ్ళి ప్రొప్రైటర్‌తో రంగధామ్ అరెస్ట్‌కోసం పర్మిషన్ తీసుకుంటాను. అయిదు నిమిషాలయ్యాక మీరు లోపలికి రండి!" అని చెప్పి జయశ్రీ లోనికి బయలుదేరింది.

జయశ్రీ ప్రొప్రైటర్ గదికేసి వెళ్ళిన రెండు నిమిషాలకు రంగధామ్ గబగబా బయటికి వచ్చి ఎదురుగా ఇన్‌స్పెక్టర్ మనోహర్‌ని చూసి కంగారు పడ్డాడు. "నా మోటరుబైకు దొరికింది సార్!" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ నవ్వాడు. "మిస్టర్ రంగధామ్? నీ మోటారు

బైక్ ఎలా దొరికింది? అని తెల్సుకుందామని రాలేదు. జానకిరాంను హత్యచేసిన హంతకుడిగా అరెస్ట్ చేయడానికి వచ్చాను."

"సార్! వాట్ ఈజ్ దిస్?" ఆందోళనగా చూస్తూ అడిగాడు.

మనోహర్ నవ్వాడు.

అంతే, వెంటనే రివాల్వర్ తీశాడు రంగధామ్!

"మీ రింత సులభంగా నన్ను పట్టుకుంటారని తెలిసి యుంటే నేను ఆఫీసుకు వచ్చియుండేవాడ్ని కాదు. మర్యాదగా చెబుతున్నాను. ప్రక్కకు తప్పుకొని నాకు దారి ఇవ్వకుంటే నిర్దాక్షిణ్యంగా చంపేస్తాను. ఊం- జరగండి! చేతులెత్తి అటు తిరిగి నిలబడండి!" అంటూ కోపోద్రేకాలతో అరిచాడు రంగధామ్!

మనోహర్ చకితుడయ్యాడు.

"రంగధామ్! మర్యాదగా రివాల్వర్ క్రింద పడెయ్. లేకుంటే నా చేతిలోని రివాల్వర్ ప్రేలిపోతుంది" అంది జయశ్రీ వెనుకనుండి రంగధామ్ వీపుకు రివాల్వర్ ఆనిస్తూ.

రంగధామ్ చేసేదేమిలేక రివాల్వర్‌ను క్రిందపడేశాడు.

"మిస్టర్ రంగధామ్! ఉదయం రాజేశ్వరి ఉత్తరం తీసుకొని నా దగ్గరికి వచ్చి రక్షించమని కోరింది. రాత్రి ఫస్ట్ షోకు వెళ్ళింది రాజేశ్వరి. అప్పుడు ఆమెకోసం ఆమె యింటికి వచ్చింది నీవు ఒక్కడివే! నీకు తప్ప ఆ ఉత్తరాన్ని రాజేశ్వరి పడగ్గదిలో వుంచే అవకాశం మరెవరికీ లేదని అర్థం చేసుకున్నాను.

ఇదంతా డబ్బుకోసం నీవు ఆడుతున్న నాటకం అయ్యుంటుందని భావించాను. కాని. ఉత్తరంలో ఆమెను 'రాజీ!' అని సంబోధించే వ్యక్తి జానకిరాం అని తెలిశాక ఆ ఉత్తరం

జానకిరాం వ్రాసివుంటాడని అనుమానించవలసి వచ్చింది.

రాజేశ్వరి రహస్యం తెలియాలంటే మీ యిద్దరిలో ఏ ఒక్కరైనా బొంబాయి వెళ్ళివుండాలి. లేదా, బొంబాయిలో నవరంగ్ హోటల్లో ఎవరైనా ఆ రహస్యం కనిపెట్టి వుండాలి. వెంటనే బొంబాయికి ట్రంక్‌కాల్ పెట్టాను. మేనేజర్ సుందరం ఉద్యోగానికి రిజైన్‌చేసి వెళ్లాడని తెలిసింది. అతనే యిక్కడికి వచ్చి ఉంటాడనుకున్నాయి.

సుందరం! జానకిరాం!! రంగధామ్!!! మీరు ముగ్గురు కలిపి ఈ పనికి పూనుకున్నారేమోనని ఆలోచించవలసి వచ్చింది. కాని, జానకిరాం హత్య కాబడ్డాడు.... నీవు మోటారుబైకు పోయిందని ఉదయం 10 గంటలకు పోలీస్ రిపోర్ట్ ఇచ్చావు. ఆ తప్పుడు రిపోర్టే నిన్ను నేరస్తునిగా పట్టిచ్చింది."

"అవును. జానకిరాం మిత్రద్రోహి. నా రహస్యం రాజేశ్వరికి తెలియజేస్తానని వాగాడు. అందువల్లనే తొందపడి నేను అతనిని చంపవలసి వచ్చింది.

నాకు వూరునిండా అప్పులున్నాయి. పైగా రాజేశ్వరితో పెళ్ళి. చాలా డబ్బు కావాలి. ఎటూ పాలుపోలేదు. అటువంటి సమయంలో సుందరం ఉద్యోగానికి స్వస్తిచెప్పి ఇక్కడకు వచ్చాడు. అతను నా క్లోజ్ ఫ్రెండ్. బొంబాయి విశేషాలు చెప్పమంటే రాజేశ్వరి రహస్యం చెప్పాడు. దానితో రాజేశ్వరి దగ్గరనే డబ్బు సంపాదించాలని దుర్బుద్ధి పుట్టింది నాకు. నాకు ఈ శాస్తి కావల్సిందే. పదండి," అని రంగధామ్ జీపెక్కాడు.

ఆ విషయం తెలిసిన తర్వాత రాజేశ్వరికి కళ్ళముందు ప్రపంచం గిర్రున తిరిగినట్లయింది.

***

అజ్ఞాత దీవులు

వెంకట్రామ్

[మొదటి భాగం]

"ఈనెల పన్నెండవ తారీఖున మద్రాసు హార్బరునుండి ఒక ఓడ అండమాన్‌కి, నికోబార్‌లకు వెళుతుంది. అండమాన్, నికోబార్ దీవుల చుట్టూ చిన్న చిన్న దీవులు చాలా వున్నాయి. వాటిని గురించి ప్రపంచానికి ఇంతవరకూ ఏ సమాచారము తెలియదు.

ఇప్పుడు ఆ దీవుల్ని కనుక్కోవడమనే బాధ్యత భారత దేశము చేపట్టింది. ఈ బ్యాధత చాలా కష్టతరమయినది. అయినా మనపై మనకుగల విశ్వాసమే మనల్ని పనికి పురిగొల్పుతుంది. ఈ పనిలో ఎన్ని కష్టనష్టాలుంటాయో తెలుసు అయినా సాహసం చేయక తప్పదు."

చెప్పడం ఆపి మావైపు చూశాడు. ఎస్. బి. డైరెక్టరు దేశాయ్‌గారు.

అది స్పెషల్ బ్రాంచి హెడ్ ఆఫీసులోని ఒకగది. నా ప్రక్కన రాజు కూర్చుని యున్నాడు. టేబిల్ అవతల మా కెదురుగా డైరెక్టర్ దేశాయ్‌గారు కూర్చుని యున్నారు.

"చెప్పండి సార్!" కుతూహలంగా అడిగాను.

"ఆ ఓడలో కాప్టెన్. మేనేజరుతో ఐదుగురు అన్వేష కులు, పది మంది కళాసీలు, ఇతర సిబ్బంది ఉంటారు. అయితే ఈ ప్రయాణములో ఎటువంటి సాహసాల్ని ఎదు ర్కోవాలో మన ప్రభుత్వము ఆలోచించి, ఆ బాధ్యతను మన స్పెషల్ బ్రాంచిపై యుంచింది. ఈ టూర్ వెళ్ళ డానికి మిమ్మల్నిద్దర్ని నియమించాను. మీపై నాకున్న నమ్మ కమే నాచేత ఈ పని చేయించింది. పన్నెండవ తారీఖున వెళ్ళే నావతోపాటు మీరు కూడా వెళ్ళాలి. ఈ ట్రిప్పుకు ఏ ఆపదా రాకుండా చూసే బాధ్యత మీపైవుంది." అన్నారు దేశాయ్‌గారు.

దీవుల పేరు వినగానే నా మనస్సులో ఆనందము ఉరక లేస్తోంది. మళ్ళీ ఎన్నాళ్ళ తర్వాత నాకు తగిన పని దొరి కిందనిపించింది.

"సార్, ఈ టూర్ ఎన్ని రోజులు" అడిగాడు రాజు.

"ఈ టూర్ మొత్తము దాదాపు రెండు నెలలు జరుగు తుంది. మొత్తం మీరు చూడవలసిన దీవులు పదహారు. ప్రతి దీవిలో అక్కడి ప్రజల వేషభాషలు, జీవన విధా నాన్ని, ఆహారపు అలవాట్లు క్షుణ్ణంగా తెలుసుకోవలసి వుంటుంది." యస్. బి. డైరెక్టరు దేశాయ్‌గారి గొంతు గంభీరంగా వుంది.

"ఈ బృందంలో ఎవరైనా డాక్టరున్నారా సార్!" తన అనుమానాన్ని బయట పెట్టాడు రాజు.

"ఉన్నాడు! ఒక డాక్టరుతోపాటు ఒక ఇంజనీర్ కూడా వున్నాడు. ఈ జట్టులో అన్ని వర్గాలకు చెందినవారు వున్నారు. అంతేగాదు ఒక గైడును కూడా మీ వెంబడి పంపుతున్నాము. ఇక మీరు వెళ్ళి రెడీ అవ్వండి", అన్నారు గంభీరంగా దేశాయ్‌గారు.

* * *

మేము బయల్దేరి నాలుగు రోజులు కావొస్తోంది. ఈ నాలుగు రోజులు మా ప్రయాణానికి ఏ ఆటంకమూ రాలేదు. మేము మొట్టమొదట బయలుదేరి వెళ్ళాలనుకున్నది పోర్ట్ బ్లయర్‌కు సుమారు నలభై కిలో మీటర్ల దూరాన వున్న అండ్లా దీవికి.

అండ్లా దీవి ప్రజలు ఎలా వుంటారో ఇది వరకు చూసిన మానవుడు లేడు. ఇంతకు ముందు ఈ విషయాన్ని కను క్కోవడానికి వచ్చిన రెండు మూడు నావలు ఇక్కడే విఫల మయ్యాయి.

ఇక్కడుండే ప్రజలు మహా కర్కోటకులు అని విని కిడి. వీళ్ళంతా తమ విషపు బాణాలచే ఇక్కడికి వచ్చే వారిని ఆహుతి చేస్తారు. అందుకే చుట్టు పక్కల దీవుల వారు కూడా ఇక్కడికి రావాలంటే భయపడ్తారు.

అందుకే మేము అన్ని జాగ్రత్తలతో ఆ దీవికి బయలు దేరాం.

ఓడ అండ్లా దీవికి కొంత దూరములోకి వచ్చి ఆగి పోయింది.

"ముఖర్జీగారూ! నేను, రాజు ముందుగా ఓడ దిగి దీవిలోపలికి వెళ్తాము. ఎందుకంటే, ఈ దీవిలో ఏదైనా అపాయము సంభవిస్తే తప్పించుకోగలిగే నేర్పు అందరికి

లేదు. మాకే అపాయము రాకుంటే తర్వాత అందరం వెళ్ళి చూడొచ్చు." అన్నాను నా ప్లాను వివరిస్తూ.

"నాదొక సలహా," అన్నారు మేనేజర్ ముఖర్జీ.

"ఏమిటి?" రాజు, నేను ఒకే సారి అడిగాము.

"ఈ దీవి వారికి కొబ్బరికాయలంటే యిష్టము. మన మా దీవిపై కొబ్బరికాయలుంచితే వాళ్ళు ఆక్కడికి కొస్తారు. వచ్చినప్పుడే తెలుసుకోవచ్చు వారు ఎటువంటి మనుష్యులైంది. వారు వెళ్ళేప్పుడు వెంబడించి వెళితే మన పని సునాయాసంగా అవుతుంది. వారి నివాసాలను కష్టము లేకుండా కనుక్కోవచ్చు. ఏమంటారు?" మా అభిప్రాయము కొరకు ప్రశార్థకంగా చూశాడు మేనేజరు ముఖర్జీ.

ముఖర్జీ చెప్పింది సబబే అనిపించింది నాకు. అష్టకష్టాలు పడి వారి నివాసాలను, వారిని వెతికే కన్నా వచ్చిన వారిని వెంబడించి వెళితే చాలా భారము తగ్గిపోతుంది, లాభాదాయకము కూడా అవుతుంది.

ప్రశ్నార్థకంగా రాజువైపు చూశాను. రాజు తలవూపాడు సరే అన్నట్లు. నేను సరే అన్నాను.

ఇద్దరు ఓడ దిగి బోటులో వెళ్ళి అండ్లా దీవి ఒడ్డుపైన కొబ్బరి కాయలు పెట్టి వచ్చారు. మేము వారికోసము ఎదురు చూడసాగాము. వారెలా ఉంటారు? వారు ధరించే దుస్తులేవి అనే సందేహాలకు సమాధానాల కోసము ఎదురు చూస్తున్నాము.

గంట గడిచింది.

ఎవరూ రాలేదు.

రెండు గంటలు గడిచాయి. ఏ విధమయిన జన సందోహము కన్పించలేదు.

మూడు గంటలు గడిచాయి. మాలో ఉత్సాహము తగ్గి పోయింది.

నేను, రాజు ఇక ఓడ దిగి వెళ్ళడమే మంచిదనిపించింది. ఇంకొక గంట సేపు చూచి అదే పని చేద్దామనుతున్నాము.

ఇంతలో మావాళ్ళలో ఒకరిద్దరు అరిచారు. వారు ఎక్కడో చేతులు చూపిస్తూ ఆనందంగా గంతులు వేయసాగారు. వారు చూపించిన వైపుగా చూశాను.

దీవిలో చెట్ల మధ్యన ఎవరో మనుష్యుల కదలిక అస్పష్టంగా కన్పిస్తుంది. దాన్ని బట్టి వారు నృత్యము చేస్తూ వస్తున్నారనిపించింది నాకు.

మెల్లగా ఒక్కొక్కరే ఒడ్డువైపు వస్తున్నారు. వాళ్ళు నిర్విరామంగా నృత్యము చేస్తూనే వున్నారు. అందరూ ఒడ్డు దగ్గరికి వచ్చారు. మాకు అంత స్పష్టంగా కన్పించటము లేదు.

జేబులోనుండి బైనాక్యూలర్స్ తీసి మెడకు తగిలించుకొని చూడసాగాను. వాళ్ళందరు దాదాపు ఒకే తీరుగా వున్నారు.

అందరూ బలిష్ఠంగా వుండి అరడుగుల ఎత్తుకు ఏమాత్రం తక్కువలేరు. శరీరము నిండా చర్మము కట్టుకొని నల్లగా కన్పిస్తున్నారు. ముఖాలు అందరివి ప్రసన్నంగా వున్నాయి. వీరు మనుష్యులను చంపే కర్కోటకులంటే నమ్మలేకపోతున్నాను.

గుంపువైపు పరిశీలనగా చూశాను. అంతా కలిపి దాదాపు ఇరువదిమంది వున్నట్టున్నారు, అందరూ విల్లమ్ములు ధరించి వున్నారు. ఈ ఇరువదిమంది పురుషులేనని అర్థమయ్యింది నాకు.

అంతలో అదిరిపడ్డాను నేను. వారి దృష్టి మా పైన పడింది. కొబ్బరికాయలు ఆనందంతో ఏరుకుంటున్న వాళ్ళంతా ఒక్కుమ్మడిగా ఆగిపోయారు. అందరి చేతుల్లో కొబ్బరికాయలు క్రిందపడిపోయాయి.

మరుక్షణమే అందరి చేతుల్లో విల్లమ్ములు ప్రత్యక్ష మయ్యాయి.

వారు చేయబోయే పనేమిటో వెంటనే మాకు అర్థమయ్యింది. వారు ఒక్కొక్కరే బాణాలు వదలడము ప్రారంభించారు. రెండు నిమిషాల్లో ఆ గుంపులో నుండి బాణాల వర్షము కురువసాగింది.

కాని, వారి బాణాలన్ని మా ఓడను చేరలేకపోతున్నాయి. కొన్ని సముద్రము మధ్యలో పడిపోతున్నాయి. మరికొన్ని ఓడ క్రింది భాగాన వచ్చి తాకసాగాయి. ఏ ఒకటో, రెండో ఓడ పై భాగానికి రాగల్గినా మాకెవరికీ తగలలేదు.

వారిని రెచ్చగొట్టటము మాకేమాత్రము యిష్టములేదు. అందుకే అందరము తెల్లజెండాలు పట్టుకొని వూపసాగాము. అది ఏ ప్రాచీన మానవుడైనా అర్థము చేసుకోగలడు. కాని వీరు అర్థము చేసుకున్నట్టులేదు.

మేమెంత తెల్లజెండాలు ఊపినా బాణాలు విడవడము మానుకోలేదు. ఇక వూపలేక మానుకున్నాము. కాని, వారు నిర్విరామంగా బాణాలు వదులుతూనే వున్నారు. ఏమీ చేసేది లేక వారు విడిచే తీరును చూస్తూ మా దగ్గరికొచ్చిన బాణాలను తప్పించుకుంటూ వున్నాము.

కెమెరామెన్ మాత్రము తనపని ఆగకుండా చేసుకు పోతున్నాడు.

"కెవ్వు"మని కేక విన్పించినవైపు కంగారుగా చూశాను.

అందరమూ కేక వచ్చినవైపు పరుగెత్తాము. అందరి ముఖాలు కంగారుగా వున్నాయి.

మేనేజర్ ముఖర్జీ క్రిందపడి వున్నాడు. అందరమూ చుట్టుముట్టాము. అతని జబ్బలో ఒక బాణము దిగబడివుంది. అది విషపు బాణమని వెంటనే అర్ధమయిపోయింది నాకు. ఆలస్యము చేస్తే పరిస్థితి విషమిస్తుంది.

"డాక్టర్, తొందరగా లోపలికి తీసుకెళ్ళి చికిత్స చేయండి. నిముషమాలస్యమయితే పరిస్థితి విషమిస్తుంది." తొందరపెట్టాను.

నలుగురు కలిసి ముఖర్జీగారిని లోపలికి మోసుకుపోయారు. నాలో ఏదో తెలియని బాధ కలుక్కుమంది. నాపై వున్న బాధ్యతపట్ల ధృడత్వము పెనవేసుకుపోసాగింది.

ఒడ్డుమీద వున్న గుంపువైపు చూశాను. వాళ్ళంతా ఆనందంతో గంతులు వేస్తూనే బాణాలు విడుస్తున్నారు.

పదినిమిషాలు గడిచిపోయాయి.

ఆంగ్లా నివాసులనుండి బాణాలు రావడము తగ్గిపోయింది. వారు అలిసిపోయారు. దానికి తోడు వారి దగ్గరున్న బాణాలు అయిపోవచ్చాయి.

క్రమంగా నాలో ఉత్సాహము పెరగసాగింది. వాళ్ళు మెల్లగా తగ్గిపోసాగారు. కొంతసేపటికి వారు కొబ్బరి కాయలు తీసుకొని నృత్యము చేస్తూ వెళ్ళిపోయారు.

నేను గబాగబా లోపలికి పరుగెత్తాను.

ముఖర్జీగారికి స్పృహ వచ్చింది. రాజుకూడా అక్కడే వున్నాడు.

"మేనేజరుగారూ! మేము దీవిపైకి వెళ్తున్నాము. మేము నాలుగురోజుల్లో రాకపోతే మాకేదో అపాయము సంభ

వించిందని తెలుసుకోండి. రాజూ, కమాన్ హరియప్!"
అరిచి బయటికి పరుగెత్తాను.

రాజు నన్ను అనుసరించాడు.

*   *   *

నేను, రాజు ఒడ్డుపైకి వచ్చాము.

ఆ దీవి వాళ్ళు చేసిన నృత్యమువల్ల అక్కడ ఇసుకంతా చెదిరిపోయివుంది. ఇసుకలో పడ్డవాళ్ళ అడుగుజాడల వెంబడి పరుగెత్తాను. వాళ్లు తొందర్లోనే కన్పిస్తారని నాకు నమ్మకముండి.

ఎందుకంటే, వాళ్ళు నృత్యము చేస్తూ వెళుతున్నారు. అలా వెళితే ఎంతో వేగంగా వెళ్ళలేరు. వాళ్ళను మేము పదిహేను నిమిషాల్లో కలువగలము. ఉత్సాహంతో గబగబా నడుస్తున్నాము.

పదిహేను నిమిషాలు గడిచిపోయాయి. మేము నిముష నిముషానికి రెట్టింపు వేగంతో నడువసాగాము. కాని మాకా గుంపు ఇంకా కన్పించలేదు. ఏం జరిగిందో నా ఊహాకు అందటము లేదు. వాళ్ళంత వేగంగా నృత్యము చేస్తూ వెళుతున్నారంటే నమ్మలేకపోతున్నాను.

వాళ్ళు వెళ్ళిన వైపు కాకుండా మేము వేరొక వైపుకు వచ్చామా! అలా కావడానికి వీల్లేదు. వాళ్ళు ఇటునుంచి వెళ్ళినట్టు స్పష్టంగా ఆనవాళ్ళున్నాయి.

మాకేం చెయ్యాలో తోచలేదు. మరింత వేగము పెంచి నడువసాగాము.

అరగంట గడిచింది.

ఉన్నట్టుండి మాకు దూరములో కేకలు, గగ్గోలు వినిపించాయి. పరీక్షగా చూశాము. దూరంగా ఆ గుంపు

వాళ్ళు నృత్యముచేస్తూ వెళుతున్నారు.

మేమిద్దరము నడక వేగము ఇంకా పెంచాము. వాళ్ళు మాకు దగ్గర రాసాగారు.

ఆ గుంపును పరీక్షగా చూశాను. సముద్రము దగ్గరి కంటే ఇపుడు వారి నృత్యము వేగము పెరిగింది. అరుపులు కూడా తారాస్థాయిని అందుకున్నాయి.

వాళ్ళు దారిలో పక్షులను, చిన్న చిన్న జంతువులను బాణాలతో కొడుతున్నారు. అవి బాధతో విలవిల్లాడి పోతున్న పుడు ఆనందంతో గెంతుతున్నారు.

వీరిని చూసి నేనొకటి తొందరగా గ్రహించగలిగాను. వీళ్ళు ఎదుటి ప్రాణుల్ని హింసించి-అవి బాధపడ్తే వీరు ఆనందపడ్తారు.

చటుక్కున ఉలిక్కిపడ్డాను.

ఉన్నట్టుండి వాళ్ళు ఆ చెట్ల గుంపులో ఎక్కడో మాయ మయ్యారు.

"రాజూ వాళ్ళెక్కడ వెళ్లారో చూశావా" అడిగాను.

"ఆ చెట్లలోకి వెళ్ళారు. తర్వాత ఎక్కడ కెళ్ళారో కన్పించలేదు."

ముందుకు పరుగెత్తాము. మూడు నిమిషాల్లో ఆ చెట్ల వద్దకు వచ్చాము. కాని, అక్కడెక్కడా మాకు వారున్న అలికిడి కూడా కన్పించలేదు.

చుట్టూ చూశాను. నేలమీద అడుగుజాడలు లేవు. వాళ్ళిక్కడ వచ్చిన ఆనవాలు ఒక్కటి కూడా కన్పించలేదు.

"రాజూ నువ్వు పొరబడి వుంటావు" చేతికొచ్చిన అవకాశము పోయిందన్న బాధతో అన్నాను.

"లేదు విజయ్ నేను స్పష్టంగా చూశాను" ఖచ్చితంగా అన్నాడు రాజు.

నాకేమీ తోచలేదు. ఆలోచిస్తూ వుండిపోయాను. రాజు చుట్టుప్రక్కలను పరీక్షించసాగాడు.

ఒక్కసారిగా హాహాకారాలు మిన్ను ముట్టినట్టుగా విన్పించాయి. ఇద్దరము కంగారుపడ్డాము. క్షణంలో మా చుట్టూ అండ్లా దీవి వాసులు వున్నారు.

వాళ్లు మమ్ము పట్టుకోడానికి వేసిన ప్లాను అర్థమయ్యింది. అందరూ మా దగ్గరకు వచ్చారు. మా దగ్గర వున్న బ్యాగుని లాక్కున్నారు.

అందరు కలిసి నారతాళ్ళతో మమ్మల్ని కదలకుండా కట్టివేశారు. నాకు ప్రాణాలపైన ఆశపోయింది. వాళ్ళ హింసాత్మక చర్యల్ని తలుచుకుంటే నా మతి పోసాగింది.

కాళ్ళు కట్టేసిన మమ్మల్ని ఎక్కడకు తీసుకుపోతారో, ఎలా తీసుకుపోతారో అర్థముకాలేదు. బహుశా ఈడ్చుకు పోతారేమో!

నా ఊహకు నేనే అదిరిపడ్డాను. వీళ్ళకంటే చైనా గూఢచారులు నయమేమో అనిపించింది.

ఆశ్చర్యపోయాను.

నేననుకున్నట్లు మమ్మల్ని ఈడ్చుకుపోవడములేదు. మమ్మల్నిద్దరిని చెరొకరు ఎత్తుకొని, తిరిగి నృత్యంచేస్తూ అవలీలగా మోసుకుపోతున్నారు.

* * *

తెలతెలవారుతూంది.

నిన్న ఉదయమునుంచి మమ్మల్ని పాకలో బంధించారు. అయితే మా చేతులకు, కాళ్ళకు ఉన్న కట్లను విప్పదీశారు.

మమ్మల్ని బంధించి వేరేమి చెయ్యాలనుకున్నారో నాకు తెలియలేదు.

రాజు వైపు చూశాను. మౌనంగా వున్నాడు. ముఖము పీక్కుపోయింది. కళ్ళు ఎర్రబడివున్నాయి.

రాజును చూస్తేగాని నా పరిస్థితి ఎలావుందో నా కర్థము కాలేదు. నిన్న ఉదయమునుండి ఏమీ తిననందుకు చాలా ఆకలి వేస్తోంది.

ఏదో సాధిద్దామని ఇంతదూరము వచ్చి వీళ్ళ చేతుల్లో ఇరుక్కుపోయామనే బాధ నాలో రగుల్కొంది.

ఎలా తప్పించుకోవాలో ఆలోచించసాగాను. చుట్టు చూశాను. ఏ ఆయుధము లేదు పాకలో. వున్నా లాభము లేదు.

పాక చాలా బలంగా వుంది. పాకకున్న తలుపులు కూడా చాలా మందమయిన చెక్కతో చేయబడినవి. తలుపు బయటి నుండి తీస్తే తప్పరాదు. కేవలము ఎవరినైనా మా లాంటి వాళ్ళను బంధించడానికే తయారు చేశారేమో ఈ పాక అనిపించింది నాకు.

మెల్లగా తలుపు తెరుచుకుంది.

బలిష్టకాయు డొకడు లోపలికి ప్రవేశించాడు. అతని చేతులో ఒక ఆకు వున్నది. ఆకులోవున్న పళ్ళను చూడగానే ఎగిరి గంతేశాను.

తలుపు ముందు ఇద్దరు బలిష్టకాయులు విషపు ఈటెలతో నిలబడి వున్నారు. తప్పించుకొనే మార్గములేదు. బలిష్ఠ కాయుడు ఆహారము మా ముందుంచాడు. నేను, రాజు సంతోషముగా అతనివైపు చూశాము.

అతను వెనక్కి వెళ్ళి తలుపు మూసి గడియవేసి వెళ్ళి పోయాడు. ఇద్దరమూ తినడానికి ఉపక్రమించాము.

పళ్ళు తిన్నాక శరీరమంతా తేలికైనట్లుగా అనుభూతి

పొందసాగాము. ఈ దీవివాసులు ఆగకుండా ఎంతసేపైనా నృత్యము చేయడానికి కారణము బోధపడింది మాకు. పళ్లు తిన్నందుకు మా శరీరములోనికి అదనపుశక్తి వచ్చింది. తప్పించుకోడానికి ఆలోచించసాగాము.

నా బుర్ర వేడెక్కిందే తప్ప తప్పించుకోడానికి మార్గము తట్టలేదు. అటు ఇటూ పచార్లు చేయసాగాను.

తలుపులు తెరుచుకున్నాయి. ఇద్దరు ఆటవికులు లోపలికి వచ్చారు.

మళ్ళీ మమ్మల్ని బంధించి, అంతా గగ్గోలుగా వున్న ప్రదేశానికి తెచ్చారు. అందరూ ఆనందంగా నృత్యము చేస్తున్నారు.

అక్కడొక రాతి రథము లాంటిది వుంది. దానిపైన ఒక పొడుగాటి స్తంభము పడుకోబెట్టి వుంది. దానికి మమ్మల్నిద్దరిని నగ్నంగా కట్టారు. చేతులకున్న కట్లు మాత్రము విప్పేశారు.

స్తంభము చిన్నగా గాల్లోకి లేవసాగింది.

స్తంభము చివర మేము కట్టివేయబడి వున్నాము.

ఇద్దరమూ గాలిలో తేలుతూ బాధతో గిలగిల్లాడి పోసాగాము.

స్తంభము నిటారుగా లేచి నిలబడింది. స్తంభము చాలా మంది నారతాళ్ళతో కట్టి పట్టుకొని వున్నారు. అయినప్పటికి స్తంభము అటూ, యిటూ వూగిపోసాగింది. ఒక్కొక్క వూపుకు మా ఒక్కొక్క ప్రాణము లేచిపోసాగింది.

కళ్ళు గిర్రున తిరుగుతున్నాయి. కళ్ళు మూసుకున్నాను. బండి కదిలినట్టుంది. కొంత దూరము మెల్లగాపోయింది.

తర్వాత వేగాన్ని అందుకుంది. కుదుపులకి వీపు రాతి స్తంభానికి రాసుకొని వెన్నెముక విరిగినంత బాధగా వుంది. ఓర్చుకోలేకపోయాను. వీపంతా నజ్జు నజ్జు అయింది.

బండి ఒకచోట ఆగిపోయింది. ఆటవికులు గోలగా అరుస్తున్నారు.

"విజయ్" బాధగా పిలిచాడు రాజు.

"ఆఁ" కళ్ళు తెరిచాను.

"అటు చూడు," చూపించాడు రాజు.

రాజు చూపించిన వైపు చూశాను. అక్కడొక పెద్ద చెరువుంది. నా కర్థమయింది. అందులో కుప్పలు తిప్పలుగా వున్న మొసళ్ళను చూసి నిలువునా గజగజ వణికిపోయాను.

మమ్మల్ని ఆ చెరువులో వేస్తారు. మొసళ్ళు మమ్మల్ని పీక్కుతింటుంటే చూస్తూ వీళ్ళు ఆనందిస్తారు?

"తొందరపడాలి విజయ్!" మూల్గుతూ అరిచాడు రాజు.

నాకు చటుక్కున ఓ ఆలోచన వచ్చింది.

ఆఖరి ప్రయత్నంగా గబాలున నా ఎడమచేతికున్న వాచిని లాగాను. దాని డొప్పను విడదీసి లోపల గురువింద సైజులో వున్న నాలుగు మినీబాంబులను చేతిలోకి తీసుకున్నాను.

అప్పటికే ఆటవికులు మమ్మల్ని కట్టివున్న స్థంభాన్ని ఆ మొసళ్ళువున్న చెరువులోకి నెట్టే ప్రయత్నంలో వున్నారు.

మనసులో ఒకసారి భగవంతుడిని ధ్యానించుకొని నాలుగు బాంబులను నాలుగు వైపులా నేలకు విసిరికొట్టాను.

"ఢాం! ఢాం! ఢాం! ఢాం!!!"

పెద్ద ధ్వనితో నాలుగు బాంబులు ప్రేలిపోయాయి. దట్టంగా పొగ పేరుకోసాగింది.

అకస్మాత్తుగా జరిగిన యీ సంఘటనకు ఆటవికులంతా

బెంబేలుపడిపోయారు. గుంపు చెదిరిపోయింది. భయ విహ్వాలురై అంతా వెనుదిరిగి పారిపోసాగారు. మరుక్షణము రాతి స్తంభము మొసళ్ళ చెరువులోకి ధభీమని కూలి పోయింది.

అయితే అప్పటికే వాచి డొప్పతో నేను మమ్మల్ని కట్టి వేసిన తాడును కోసేయటంవల్ల ఇద్దరమూ నేలమీద పడి బ్రతికిపోయాము.

ఆటవికులు ఇదేమీ గమనించకుండా వెనుదిరిగి పారి పోతూనే వున్నారు.

మేము మూల్గుతూ లేచి, సముద్రమువైపు పరుగు దీశాము.

***

పిల్లను చూట్టానికి పిల్లవాని తండ్రి, పిల్లవాడు, మరి ఇద్దరూ వెళ్ళారు. పెళ్ళిచూపులు జరిగాయి; పెళ్ళికొడుకు తండ్రి "పిల్ల దివ్యంగా ఉంది. ముహూర్తాలు పెట్టుకోవటమే తరువాయి..." అన్నాడు.

పెళ్ళికూతురు తండ్రి "అబ్బాయిని గూడా వోమాట అడిగి ..." అబ్బాయివంక చూశాడు. అబ్బాయి "నాదేం లేదు, మానాన్న ఇష్టం..." అన్నాడు.

"నే చెప్పలా...వాడు నా కొడుకండీ, భీష్ము డంతటివాడు. అయినా పెళ్ళి చేసుకు నేది నేను కానివాడు కాదు కదా...త్వరగా ముహుర్తాలు పెట్టించండి..." అన్నాడు ఆముసలి పెళ్ళికొడుకు.

—కె. రవీంద్రప్రసాద్, పాల్వంచ.

కొండ ఎలుక-మిల్క్ వ్యాను

విజయభాస్కర్

జపాన్ నుండి వచ్చిన తర్వాత ఏ కేసు లేకపోయింది.

కాబట్టి అలా జాలీ ట్రిప్ ఎక్కడికి వేద్దామా అని ఆలోచిస్తూ ఉండిపోయాను.

కేంద్ర పాలిత ప్రాంతమైన గోవా నా మదిలో మెదిలింది. ఇండియాలో వున్న అతి సుందర ప్రదేశాలలో గోవా ఒకటి.

ఇండియన్ ఎయిర్‌లైన్స్ వారి బోయింగ్ 707 లో నాలుగు గంటల ప్రయాణాంతరం గోవాలోని డబోలిమ్ ఎయిర్‌పోర్ట్‌లో దిగాను.

కస్టమ్స్ చర్యలు ముగించుకొని బయటకు వచ్చి టాక్సీలో హోటల్ దిల్‌కుష్ చేరాను.

హోటల్ రిసెప్షన్‌లోని వ్యక్తి నన్ను చూస్తూనే ఇంటర్ కమ్యూనికేషన్‌లో ఏదో త్వర త్వరగా మాట్లాడాడు.

అదేమీ గమనించనట్లుగా నేను రిసెప్షన్ కౌంటర్ చేరుతూ మ్యానేజర్ అని వ్రాసి ఉన్న గదిలోనుండి తెల్లని సూటు ధరించిన వ్యక్తి సంతోషంగా ఆదర బాదర పరు గెత్తుకు రావడం ఓరకంట గమనించాను.

"నమస్తే విజయ్‌గారూ! మీరు మా హోటలుకు రావడం నిజంగా మా అదృష్టం" అంటూ నా చేతులు పట్టుకున్నాడు. నన్ను ఎట్లా గుర్తుపట్టాడా అని నేను కొద్దిగా ఆశ్చర్య పోయాను.

"అదేంటిసార్ అలా చూస్తారు! మొన్న మీరు జపాన్‌లో చేసిన క్రైం ఆపరేషన్ గురించి పేపర్లో చదివాను" అన్నా డతను.

"అవును కాని పేపర్లలో నా ఫోటోలాంటి వేవీ ప్రచురించలేదే" అడిగాను నేను.

"మీరు చేసిన సహాయానికి జపాన్ ప్రభుత్వం మిమ్మల్ని అభినందించి నప్పటి ఫోటోతో సహా ఒక జపాన్ క్రైం జర్నల్ ప్రచురించింది. దాంతో మిమ్మల్ని తేలికగా గుర్తు పట్టగలిగాడు మా రిసెప్షనిస్ట్" అని రిసెప్షనిస్టు వైపు మెచ్చు కోలుగా చూసాడు.

"ఆఁ ఇంతకూ మీరు గోవా వచ్చింది ఏం పనిమీద సార్" వినయంగా అడిగాడు మేనేజర్.

"ముందు నాకు ఒక రూం బుక్ చేయండి తర్వాత తీరికగా మాట్లాడుకుందాం" నవ్వుతూ అన్నాను నేను.

"అవునుసార్! క్షమించాలి. ప్రయాణబడలికతో ఉన్న మిమ్మల్ని నా వెర్రి ఆనందంలో నిలబెట్టే మాట్లాడేస్తు న్నాను" అని నొచ్చుకుంటూ ఒక సర్వీస్‌బోయ్‌ను కేకేసి. సూట్ కేస్‌తో సహ లిఫ్ట్ వైపు నడిచాడు.

బోయ్, మేనేజర్లతో పాటు రెండవ ఫ్లోర్‌లో దిగాను నేను.

లిఫ్ట్ దిగగానే ప్రక్కగా ఉన్న మూవింగ్ చైర్‌లో సూటు కేసును పెట్టి వెళ్ళిపోయాడు బోయ్.

మూవింగ్‌చైర్‌లోని డయల్‌లో 2,3, అంకెలను ప్రెస్ చేసాడు మేనేజర్.

వెంటనే మూవింగ్ చైర్ స్పీడ్‌గా 23 వ గది ముందుకు చేరి ఆగిపోయింది. రెండు గంటల విశ్రాంతి తర్వాత నా గదిలోకి వచ్చి వినయంగా ఈవెనింగ్ విష్‌చేసిన మేనేజర్‌కు, నేను ప్లెజర్‌టూర్‌కు గాను గోవాకు వచ్చినట్లు, చెప్పాను.

"గుడ్ సర్. మీరు మంచి సమయానికే వచ్చారు. ఈ కాలంలోనే కోల్వాబీచ్ సమీపంలో గల పర్వతాలలో క్రొత్త క్రొత్త జలపాతాలు ప్రకృతి సిద్ధంగా పుట్టి ప్రవహిస్తూ, ఆ ప్రదేశాలలో ఎంతో చెప్పనలవిగాని అందాన్ని విరజిమ్ముతుంటాయి." అని చెప్పాడు.

ఆ రోజు హోటల్ క్లబ్‌లోనే గడిపి నిద్రపోయాను. మర్నాడు కాలకృత్యాలన్నీ ముగించుకొని, క్రిందికి వచ్చి మేనేజర్‌తో 'కిరాయికు ఒక మోటారుబైక్ తెప్పించమని' కోరాను.

"మీరు ఒంటరిగా వెళ్తారా" అడిగాడు మేనేజర్.

"దానికేం ఫరవాలేదు. ఇంతకు ముందు రెండు మూడు సార్లు నేను గోవా మొత్తం చుట్టబెట్టాను." చెప్పాను నేను.

"అయితే మీ కభ్యంతరం లేకపోతే నా రాజ్‌దూత్ ఉంది తీసుకెళ్ళండి" అన్నాడతను.

హుషారుగా రాజ్‌దూత్‌పై బయలుదేరి డబోలిమ్ నుండి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న గోవా రాజధాని

అయిన పానాజీకి చేరాను. అక్కడి ఆల్‌టిన్హో పర్వతాన్నధిరోహించి పానాజీ పట్టణాన్ని పూర్తిగా క్లియర్‌గా చూడగలిగాను.

తర్వాత పానాజీ నుండి 15 కి. మీ. ల దూరంలో గల కాలంగూట్ బీచ్‌కు వెళ్ళాను.

కాలంగూట్ బీచ్ గోవాలోని అన్ని బీచ్‌లలోకి మకుటాయమానమైనది. ఇక్కడ అనేక ఆధునిక సౌకర్యాలతో సెలవుల విడిదిగా ప్రసిద్ధిగాంచినది. మనస్సును ఆహ్లాదపరిచే విధంగా అక్కడి ఏర్పాట్లు ఎంతో అద్భుతంగా ఉన్నాయి.

కాలంగూట్ బీచ్‌నుండి దాదాపు 20 కి.మీ.ల దూరంలో గల మపుసా అనే ప్రసిద్ధ వ్యాపార కూడలికి పోదామను కొని టైం చాలక ఆ రోజుకు తిరుగు ప్రయాణం చేశాను.

2

మర్నాడు హోటల్ మేనేజర్ చెప్పినట్లుగా ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించడానికి డబోలిమ్ నుండి 20 కి. మీ.ల దూరాన గల కోల్వా బీచ్‌కు రాజ్‌దూత్ పైన బయలుదేరాను.

కోల్వా బీచ్‌కు 5 కి. మీ.ల దూరంలో గల ఒకే ఒక గొల్లపల్లెకు వేయబడ్డ మట్టిరోడ్డు అది. అనగా ఆ పల్లెతోనే ఆ రోడ్డు అంతమవుతుంది.

ఆ రోడ్డులో ఒక మిల్క్ కలెక్టింగ్ వ్యాను స్పీడ్‌గా వస్తూ ఉంది. అంతకుముందు రోజునపడ్డ వర్షానికి ఆ దారిలో ఒకచోట పెద్ద గండిపడింది.

ఆ గండిని సమీపించిన వ్యాను స్లోగా గండిలోకి దిగి లేచినా వెనక మిల్క్ పంపుకు బిగించిన బోల్ట్ ఎగిరి పోయింది.

బోల్టు ఎగిరి ప్రక్కనే ఉన్న రాయిమీద పడ్డ శబ్దానికి వ్యాన్ డ్రైవరు వ్యాను నాపి క్రిందికి దిగిరావడం, వాడు వచ్చేలోపలే మిల్క్ పంపునుండి పాలు కొన్ని ధారగా కారిపోవడము జరిగిపోయింది.

దానివల్ల ఆ ప్రదేశమంతా పాలతో నిండిపోయింది.

చేసేదేమీలేక డ్రైవరు తిరిగి బోల్టు బిగించి వైరు చుట్టి బయలుదేరాడు.

నేను కోల్వా బీచ్‌వైపు సాగిపోయాను.

కోల్వా బీచ్ కాలంగూట్ బీచ్‌తో పోటీ చేస్తున్నదా అన్నట్లుగా ఉన్నది.

కాలంగూట్ బీచ్‌లో అంతా కృత్రిమమయం. కాని కోల్వాబీచ్ అంతా ప్రకృతి సిద్ధమైనది.

కోల్వాబీచ్‌లో భూమి, సముద్రము, ఆకాశము కలిసి పోయినట్లుగా ఉండి కనులకు విందుచేస్తూ చెప్పనలవికాని ప్రకృతి సౌందర్యముతో హృదయము స్పందించేలా ఉంది.

తర్వాత ప్రకృతి సిద్ధంగా జనించే జలపాతాలు చూడటానికి కోల్వాబీచ్‌కు రెండు, మూడు కి. మీ. ల దూరంలో గల పర్వతాల వైపు రాజ్‌దూత్ పైన బయలుదేరాను.

దాదాపు గంట ప్రయాస తర్వాత పర్వతాల లోభాగంలో ఒకచోట స్వచ్ఛమైన తేటనీటితో గల గల క్రిందికి పారుతున్న జలపాతాన్ని కనుక్కోగలిగాను.

జలపాతం చుట్టూవున్న ప్రకృతికి, ఆ వాతావరణానికి నన్ను నేనే మైమరచిపోయాను.

అంతలో, నా వెనకగా అయిన చిన్న శబ్దానికి వెను తిరిగేంతలో పిడుగులాంటి దెబ్బ నా నడినెత్తిలో పడింది.

స్పృహపోతూ ఉండగా నా మీద దెబ్బతీసిన నల్లని వ్యక్తిని అస్పష్టంగా చూడ గలిగాను.

నాకు మళ్ళీ స్పృహ వచ్చేప్పటికి నా వంటిమీద డ్రాయరు తప్ప వేరే గుడ్డముక్క కూడాలేదు. చేతులు, కాళ్ళు వెనక్కు విరిచి త్రాళ్ళతో బలంగా కట్టి, ఒక కొండ గుహలో బంధించబడి వున్నాను.

"హలో మైడియర్ యంగ్ డిటెక్టివ్! నీకు కీర్తి దాహం ఎక్కువ ఉన్నట్లుంది. లేకపోతే, మొన్ననే జపాన్ అడ్వంచర్ చేసి అపుడే స్మగ్లర్స్‌ను వేటాడటానికి రావు" గులకరాళ్ళు దొర్లినట్లుగా మాట్లాడాడు నల్లగా ఎత్తుగాఉన్న మొద్దు వ్యక్తి ఒకడు.

"నో! మీరు పొరబడుతున్నారు. నేను డిటెక్టివ్‌ను కాను" అరిచాను నేను.

"హః హః హః విజయ్‌గారూ, మీరు చేసిన అడ్వంచర్‌ను జపాన్ క్రైం జర్నల్ ఫోటోతోసహా ప్రచురించింది. ఆ విజయ్ నువ్వేనని నాకు తెలుసు" మీసం దువ్వుకుంటూ చెప్పాడు వాడు.

"అయినా ఎమర్జన్సీ తాకిడికి తట్టుకోలేక బొంబేనుండి పారిపోయి వచ్చిన మేము ఇక్కడ ఉంటున్నట్లు మీ కెలా తెలిసింది" నోట్లోని చూయింగమ్‌ను కసాపిసా నములుతూ ప్రశ్నించాడు వాడు.

పరిస్థితిని అర్థం చేసుకున్న నేను, నిశ్చలంగా కండ్లు మూసుకున్నాను.

"ఆల్‌రైట్! అయినా ఫరవాలేదు. నిన్ను ఇలాగే బంధించి మా దారిన మేము వెళ్ళిపోతున్నాము ఇన్ని రోజులుగా మాకు ఆశ్రయమిచ్చిన ఈ కొండ గుహను,

రాత్రికి వేసే చలి తుఫాన్లకు, ఆకలికి తట్టుకోలేక ఒక్క రోజులో నీవు తప్పకుండా బలి అయిపోతావు.

"ఒరేయ్ మన వ్యాను సిద్ధం చేయండి మకాం ఎత్తేద్దాం అలాగే ఈ డిటెక్టివ్‌గాడు వచ్చిన వాహనం ఏదో ఈ చుట్టు ప్రక్కల ఉండవచ్చు. దాన్ని వెతికి సముద్రంలో పారేయండి" ఇంకో చూయింగమ్ చిక్‌లెట్ నోట్లో వేసుకుంటూ ఆజ్ఞాపించాడు వాడు.

పది నిముషాలలో అన్ని పనులూ అయిపోయాయి అన్నట్లుగా. నలుగురు వ్యక్తులు వచ్చి వాడిముందు తలలు వంచి నిలబడ్డారు.

"విష్ యూ నియర్ డెత్" నవ్వుతూ చెప్పి, నా నోట్లో ఒక చూయింగమ్‌ను వేసి చరచరా బయటకు వెళ్ళిపోయారు.

పూర్తిగా సమసి పోయిందనుకున్న స్మగ్లింగ్ ఇంకా కొంచెం కొంచెం ఈ విధంగా జరుగుతున్నదన్నమాట. నేచర్ చూడ్డానికి వచ్చిన నాకు ఈ విధంగా కేసు తగలడం ఆనందంగానే ఉంది. కానీ....

అంత నిరాశలోనూ వాడు నోట్లోవేసిన చూయింగమ్‌ను నమలకుండా ఉండలేకపోయాను. ఎలాగైనా ఫారెన్ మేక్ గదా.

4

నెమ్మదిగా చూయింగమ్ నములుతూ ఆలోచిస్తూ ఉండిపోయాను.

కొంచెం కొంచెం చలి పెరగడం ప్రారంభించింది. అది కొండ గుహ అయినా ఎక్కడ నుండో విపరీతంగా చలి రావడం ప్రారంభించింది. బట్టలులేని నేను వణకడం

ప్రారంభించాను. ఎంత అరిచి గీ పెట్టినా అటుగా ఎవరు రారు. అది పట్టణాలు లేని కొండ ప్రదేశం దాదాపుగా నరసంచారం ఉండదు.

ఆ కొండ గుహలో నాలుగైదు కొండ ఎలుకలు అటు ఇటు తిరుగాడ సాగాయి.

తళుక్కున ఒక ఆలోచన మెరిసింది నా బుర్రలో. వెంటనే నోట్లని చూయింగ్‌గమ్‌ను, వెనక్కి విరిచి కట్టిన చేతులకు కొంచెంగా ప్రక్కనుండి ముందుకు తెచ్చి బలంగా కట్టివేసిన తాళ్ళు పైన పడేలాగ ఉమ్మి వేసాను.

ఆ గుహను స్మగ్లర్స్ కొంత కాలంగా నివాసానికి వాడుతున్నారు. వారి ఆహారాన్ని తినడానికి అలవాటుపడ్డ ఆ ఎలుకలు తప్పకుండా చూయింగ్ గమ్‌కోసం వస్తాయని నా ఆశ.

నేను ఊహించినట్లే కొంత సేపటికి రెండు మూడు ఎలుకలు నా చుట్టుప్రక్కల తిరుగుతూ ఆహారం కోసం వెతుకుతున్నాయి.

నిశ్శబ్దంగా ఊపిరి కూడా బరువుగా పీలుస్తూ, ఆ ఎలుకలు ఎక్కడ పారిపోతాయో అన్న భయంతో ఉండి పోయాను.

ఇంతలో ఒక ఎలుక అటూ ఇటూ తిరుగుతూ కట్టి వేయబడి ఉన్న నా చేతులపైకి ఎక్కింది. చూయింగమ్ వాసన పసిగట్టిన ఆ ఎలుక నాలో చలనం లేక పోవడంతో మెల్ల మెల్లగా చూయింగమ్ తిని దాంతోపాటే నా చేతులకు కట్టిన త్రాళ్ళను కూడా కొంత వరకు కొరికి వేసింది.

బలంగా నా చేతులను బంధాలనుండి తప్పించి తుర్రున పారిపోయిన ఆ మూషికానికి మనసులోనే నమస్కరించ కుండా ఉండలేకపోయాను.

5

బంధాలను తెంచుకొని బయటపడ్డ నేను నా డ్రాయర్ సీక్రెట్ పాకెట్‌లోని డబ్బును, ఎలాస్టిక్‌పీస్‌ను చూసి అవి ఉన్నందుకు సంతోషించాను.

ఆ ఎలాస్టిక్ పీసును లాగి తాడుగా ఉపయోగించ వచ్చును. అలాగే వెడల్పుచేసి లుంగీ పరిమాణానికి తే వచ్చును. నాలుగు అంగుళాలున్న ఆ పీసువల్ల ఏర్పడ్డ లుంగీని భుజాలనుండి మోకాళ్ళ వరకు కప్పుకొని చలికి కాపాడుకొంటూ దారెంబడి నడుస్తున్నాను.

దారి వెంబడి నడుస్తున్న నేను పాలతో నిండిఉన్న గండిని చూడగానే ఆగిపోయాను. వెంటనే ఆలోచన తట్టి కాలుతో ఆగండి లోతును చూసాను. దాదాపు జానెడు పైగానే పాలు అందులో నిలబడి ఉన్నాయి.

గండి పై భాగాన స్మగ్లర్ల వ్యాను గుర్తులున్నాయి. వ్యాను టైర్లు దాదాపుగా రిమ్‌ల వరకు ఆ పాలలో తడిసి ఉండ వచ్చుననుకుంటూ తిరిగి నడక సాగించాను.

నడచి కోల్వా బీచ్ చేరిన నేను అక్కడినుండి ఆటో రిక్షాలో దిల్‌కుష్‌చేరి బట్టలు వేసుకొని, గోవా క్రైం బ్రాంచి హెడ్ క్వార్టర్స్‌కుచేరి నన్ను పరిచయం చేసుకుని నా ఐడెంటిఫికేషన్ చూపెట్టి, జరిగిందంతా వివరించాను.

తర్వాత క్రైం బ్రాంచి ఇన్స్‌పెక్టర్‌కు చేయవలసింది వివరించి, అతను ఇచ్చిన వైర్‌లెస్ సెట్‌ను తీసుకొని, ఆ స్మగ్లర్ల వ్యాన్‌ను వెతకడానికి ఊర్లోకి బయలుదేరాను.

నా ఊహ ప్రకారంగానే కోల్వా బీచ్ దగ్గరఉన్న మార్గోవ్ పట్టణంలో, ఒక సందులో ఆ వ్యాన్ నా కంట బడింది.

వ్యాన్ పైన ట్రావలింగ్ ఏజన్సీ అని వ్రాసిఉంది. కాని పాపం నేను అంత తొందరగా బయట పడతాననిగాని, బ్రతుకుతాననిగాని ఊహించని వాళ్ళు నిర్భయంగా వ్యాన్‌ను వదలడమే కాక పాలలో మునిగిన పెర్లను కూడా కడగ లేదు. పెర్ల పై భాగం చిక్కని పాలతో ఎండి కొంచెం తెల్లగా ఉంది.

ఆ వ్యాన్‌ను పరిశీలిస్తూ ఉన్న నా పైకి అకస్మాత్తుగా ఎదురింట్లోనుండి ఆ ఐదుగురు స్మగ్లర్లు విరుచుకు పడ్డారు. వైర్‌లెస్ ద్వారా క్రైం బ్రాంచి ఇన్‌స్పెక్టర్‌కు సందేశం పంపడానికి కూడా వ్యవధిలేక పోయింది.

ఆ ఐదుగురూ ఒకేసారి నన్ను చుట్టుముట్టి, ఒకేసారి నలిపేయాలి అన్నట్లు చూస్తున్నారు.

వాళ్ళలో ఒకడు పరుగున నా వైపు వచ్చి నా కడుపులో బలంగా గుద్దాడు. ఊహించని ఆ దెబ్బకు నా కడుపులోని పేగులన్నీ మెలి తిరిగినట్లు అయ్యాయి.

ఆ కోపంలో నేను రెండు చేతులూ కలిపి వాడి గవద క్రింద ఇచ్చిన రాకెట్‌లాంటి దెబ్బకు వాడు అరుస్తూ బంతిలా పైకి లేచాడు. అదే సమయంలో పైకి లేచిన వాడి వీపుక్రింది భాగంలో నే నిచ్చిన ఒక లాంగ్‌షాట్‌కు వాడు గాలిలో వెళ్ళి రెండు మూడు గజాల దూరంలో పడ్డాడు.

ఇక మిగిలిన నలుగురిని వచ్చిన వాళ్ళను వచ్చినట్లే కరాటే పద్ధతిలో దెబ్బతీసి పడుకో బెట్టాను.

మూడు గజాల దూరంలో పడ్డవాడు లేచి జేబులోనుండి ఐదంగుళాల చాకును బయటకు తీసి-నా చాతి, వైపు విసి రాడు.

వాడు కత్తి తీయడం చూడగానే ప్రక్కకు జరిగే అవకాశం కూడా లేకపోయింది. దాంతో వెంటనే నా ప్రమేయం లేకుండానే ఆటోమ్యాటిక్‌గా నేను క్రొత్తగా నేర్చుకున్న మజిల్—ఫిక్సేషన్ పద్ధతిలో నా ఎదురొమ్ములోని కండరాలు బిగుసుకున్నాయి. దాంతో అంతస్పీడులో వచ్చిన కత్తి నా ఛాతికి తగిలి క్రింద పడిపోయింది.

ఆ సంఘటన చూసిన వాడు ఒక్క క్షణం స్తంభించిపోయాడు. తర్వాత పారిపోచూసిన వాడిని ఆపడానికై క్రిందపడ్డ కత్తిని పారిపోయేవాడి కుడికాలు పిక్కలో దిగేట్లుగా విసిరాను. దాంతో, అంతకుముందు కూడా దెబ్బలు తిని ఉండటంవల్ల వాడు స్పృహతప్పి పడిపోయాడు.

జేబులోని వైర్‌లెస్ ట్రాన్స్‌మీటరు ద్వారా నేను ఎక్కడ ఉన్నదీ, జరిగింది క్లుప్తంగా క్రైం బ్రాంచి ఇన్స్‌పెక్టర్‌కు చెప్పాను.

పావుగంటలో ఇన్స్‌పెక్టర్ తన సిబ్బందితో ప్రత్యక్షమైనాడు.

"అరె. మీ ఛాతిమీద గాయమైందే!" గాబరాగా అన్నాడు నా షర్టుపైన ఏర్పడ్డ రక్తాన్ని చూస్తూ.

"నో. చాలా చిన్నగాయం, చర్మం లేచింది. అంతే!" అని చెప్పాను నేను నవ్వుతూ.

ఆ ఐదుగురు స్మగ్లర్లను, ఎదురింటిలో లభించిన స్మగ్లింగ్ వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

స్మగ్లర్ల విషయంలో పోయిన హోటల్ దిల్‌కుష్ మేనేజర్ మోటార్ బైక్ విలువ చెక్కురూపంలో గవర్నమెంట్‌ద్వారా అతనికి అందించబడింది. * * *

ముత్యాల దొంగలు

పెందుర్తి వాస్టరీ

సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చి స్టేషన్ ముందు కారాపి దిగారు ప్రఖ్యాత డిటెక్టివ్ పి.జె., వెనక ధర్మ. ఇద్దరు ఐడింటిఫికేషన్ కార్డ్సు చూపి డైరెక్టర్ రూంలోనికి నడిచారు.

డైరెక్టర్ రూంలో కూర్చున్న కమీషనర్ ఆఫ్ పోలీస్, స్టేషన్ డైరెక్టర్ రాందయాల్‌ని, మెరైన్ బయలాజిస్ట్ ఫీటర్‌ని పరస్పరం పరిచయం చేశాడు.

కమీషనర్ ఆఫ్ పోలీస్ టాపిక్ ప్రారంభించబోయి ఆగాడు. "జెస్ట్ ఎ మినిట్ ఓషనాలజిస్టు ప్రఖ్యాత ప్రొఫెసర్ యుగంధర్, సబ్‌మెరైన్ జీనియస్ ఆక్వనాట్ వాలి వస్తారు." అనటంతో యుగంధర్, వాలి డోర్ తెరిచి లోపలకు నడిచారు.

"గుడ్‌మార్నింగ్ ఆల్ ఆఫ్ యు."

"గుడ్ మార్నింగ్" అన్నాడు రాందయాల్.

అందరు కూర్చున్నారు. స్టేషన్ డైరెక్టర్ సిగర్ వెలిగించి ప్రారంభించాడు.

"డియర్ ఫ్రెండ్స్! ప్రస్తుతం మన దేశం కొన్ని మిలియన్స్ ఖరీదుచేసే ముత్యాలు ఎగుమతిచేస్తోంది. అంటే 1973లో దాదాపు 10 మిలియన్లు, 1974-75లలో మరికొంత ఎక్కువగా ఎగుమతి చేసింది. అయితే యీ సంవత్సరం తొమ్మిది నెలలు గడిచినా ఒక మిలియన్ విలువచేసే ముత్యాలు పంపలేకపోయింది. దానివల్ల యితర దేశాలు కొన్ని అసంతృప్తి చెంది జపాను, యు.ఎస్.తో ఇలాంటి సంబంధాలు పెట్టుకుంటున్నాయి.

యు.ఎస్. ఏడాదికి యాభై మిలియన్ల ముత్యాలు అమ్మకం చేస్తోంది. ఇంకో రకంగా చెప్పాలంటే యీ ముత్యాల అమ్మకంలో ఆస్ట్రేలియా, జపాన్ ప్రముఖ స్థానాలు. ఈ ఏడాది మన ఎక్స్‌పోర్ట్ దెబ్బతింది. అంటే చాలా కష్టం. అయితే యిలా ఒక మిలియన్ కూడా పూరించలేకపోయాం అంటే దానికి ఏ ఒక్కరి అసమర్థత కాదు. ఆయిస్టర్స్, ముత్యాల్ని తయారుచేయలేక కాదు. ఎవరో అక్రమంగా యీ ముత్యాలు తస్కరిస్తున్నారు.

ఆయిస్టర్స్ అంటే ఒక రకమయిన తామర రేకులవంటి గవ్వలు. నీటి పై భాగానికి వచ్చి వర్షం నీరు తీసుకొని ముత్యం చేస్తుంది.

ఈ ఆయిస్టర్స్‌ని తీసుకోవాలంటే కనీసం సీబెడ్ అంటే సముద్రపు అడుగున ఆరువందల అడుగుల లోతుకు వెళ్ళాలి. స్క్యూబ్స్ ధరించినా వాటికి వుండే ఆక్సిజన్ సరిపోదు. సబ్‌మెరైన్‌తో వెతకాలంటే యితర దేశాలనుండి

సబ్‌మెరైన్ వచ్చినట్లుగాని, మన సబ్‌మెరైన్‌లు పోయి నట్లుగాని సూచనలు లేవు. కాని ఒక్కటి యధార్థం. ఎవరో దుండగులు అండర్‌వాటర్‌లోనుండి యీ ముత్యాలు దోచు కుంటున్నారు. వాళ్ళెవరో మీరు పట్టుకోవాలి." స్టేషన్ డైరెక్టర్ ముగించాడు.

వాలి సిగర్ వెలిగించాడు. "అబ్బాయ్, దుండగులు అంటున్నావు. మరేదయినా జంతువు అంటే ఆర్కిటిక్ సముద్రంలో బిల్లాబిలాంటిది ఆయిస్టర్స్‌ను తినవచ్చు కదా! అంటే దారి తప్పి వచ్చి."

"మీరు చెప్పింది నిజమే. కాని ఆ జంతువు వస్తే ఆ ప్రాంతంలో చేపలు సంచరించవు. కాని యిక్కడ చేపలు మామూలుగానే వున్నాయి."

యుగంధర్ ఆలోచించి, "ఏమయినా మనం ఒకసారి లేబరేటరీకి వెళితే మంచిది" అన్నాడు.

2

సబ్‌మెరైన్ ముందు నిలబడి చుట్టూ చూశాడు పి.జె.

బైలాజికల్ యివెంట్స్‌కొరకు రూపొందిన సబ్‌మెరైన్ అది. పన్నెండు అడుగుల పొడవు, ఎనిమిదడుగుల వెడల్పుతో తాబేలు ఆకారంలో ఏడు అడుగుల ఎత్తు వుంది. బీమ్ డిస్ప్లేస్‌మెంట్ పదిహేనువందల అడుగులు. 'డీప్ లైట్' దాని పేరు.

అందరూ మెరైన్‌లో కూర్చున్నారు.

పి.జె., వాలి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నారు. యుగంధర్ ప్లానింగ్ చార్ట్ తీసుకొని కెమెరా టచ్‌చేసి చూశాడు. ధర్మ ఆక్సిజన్ సిలిండర్స్ చెక్ చేశాడు. జోషిలా కంట్రోలింగ్ బోర్డు దగ్గర కూర్చుని యియర్ ఫోన్స్ తగిలించు

కుంది.

సబ్‌మెరైన్‌లో వైట్‌లైట్ వెలిగించారు.

మాతృనౌక 'లాలు'నుండి సబ్‌మెరైన్‌ను క్రేన్‌తో నీళ్ళపై నిలిపారు.

వాలి సిగర్ వెలిగించాడు. "అబ్బాయ్ టచ్ డౌన్" అన్నాడు. పి.జె. స్టెపిన్స్ బలంగా ముందుకు తోశాడు. నీళ్ళు బుడబుడమంటూ సబ్‌మెరైన్ క్రమంగా నీళ్ళలో మునగసాగింది.

ఐదు నిమిషాలు గడిచింది. "డీప్" వాలి అడిగాడు.

"ఫైవ్ హండ్రడ్" అంది జోషిలా. సబ్‌మెరైన్ దిగుతున్నకొద్దీ డీప్ లెవెల్ తెలుస్తుంది.

కొన్ని నిమిషాలలో సీబెడ్ చేరింది. నీరు నిర్మలంగా వుంది. "మూవ్" అన్నాడు వాలి. 'డీప్ లైట్' లైట్స్ వెలిగాయి. క్రమంగా ముందుకు కదిలింది.

కొంతదూరంలో నీటి పై భాగంలో బెలూన్ ఆకారంలో కనిపించింది. నాలుగువైపుల నాలుగు పిల్లర్స్ వున్నాయి.

"దటీజ్ మిడిటరానియన్. సైంటిస్టులు నివసించే క్వార్టర్స్."

"మిస్టర్ పి.జె! మనం దాని లోపలకు వెళదాం" యుగంధర్ అన్నాడు.

తలూపాడు పి.జె.

ఇద్దరు స్క్యూబ్స్ ధరించి నీళ్ళలో దిగారు. క్రమంగా యీదుతూ 'మిడిటరానియన్' దగ్గరకు వెళ్ళారు.

యుగంధర్ వీల్ తిప్పి డోర్ తెరిచాడు.

కాని అంతా నీటిమయంగా వుంది. లోపలకు నీళ్ళు ఎలా వచ్చాయో తెలియలేదు. సైంటిస్టులు ఒక్కరూ లేరు.

ఇద్దరికీ మతులు పోయాయి. గదంతా వెదికినా నీటి

మయంగా వుంది. ఎవరో సైంటిస్టుల్ని తీసుకుపోయి గదంతా నీటితో నింపారు అనుకున్నాడు.

పి.జె. లేబరేటరీ అంతా వెదికాడు. లేబరేటరీ మధ్య చిన్నగా రూపాయి బిళ్ళ అంత చిన్న మిషన్ కనిపించింది. అందుకొని జేబులో పెట్టుకున్నాడు.

3

"పెరల్స్ మాయమయితే ఆశ్చర్యం కలిగింది. కాని సైంటిస్టులు మాయమయ్యారు. 'మిడిటరానియన్' నీళ్ళతో నిండిపోయింది." వాలి సిగర్ వెలిగించాడు.

పి.జె. రూపాయి బిళ్ళ పరిమాణంగల మిషన్‌ను పరిశీలించాడు.

"చూడండి వర్మ, ఇది లేబరేటరీలో ఏదైనా భాగం ఐవుండొచ్చు."

టెక్నాలజిస్ట్ వర్మ చూసి నిట్టూర్చి, "నాకు తెలిసి ఏ భాగం కాదు. అయినా టెస్ట్‌చేసి చెపుతాను." అంటూ యింకో గదిలోనికి నడిచాడు.

"దీనినిబట్టి ఆలోచిస్తే యిది పెద్ద పథకంలా వుంది."

"ఎస్ మిస్టర్ వాలి. ఒక్క మాట చెప్పగలను. ఏ సబ్‌మెరైన్ యీ ప్రాంతాలకు మాత్రం రాలేదు. వచ్చినట్లయితే మాగ్నటిక్ రిలే విజిల్ చేసేది."

"స్కూబ్ వేసుకొని వస్తే" ధర్మ ప్రశ్న.

"నో....నో. స్కూబ్‌కు చిన్న ఆక్సిజన్ సిలిండర్ వుంటుంది. అలాంటిది ఎంటర్ అయినట్లు సూచన లేదు."

టెక్నాలజిస్ట్ వర్మ వచ్చాడు. "మిస్టర్ పి. జె. ఇది లాబరేటరీలో ఏ భాగంకాదు. పైగా దీనికి బ్లడ్‌స్టాట్స్ వున్నాయి. అది ఆర్టిఫిషియల్ జిల్స్ వున్నాయి. ఇది

ఎందుకు వినియోగించబడిందో తెలియటం లేదు."

"ఓ. కె. ఉయ్ విల్ ట్రయ్ ఎగైన్," వాలి అన్నాడు.

4

తిరిగి సబ్‌మెరైన్ నీటి అడుగున దూసుకుపోతుంది.

రకరకాల చెట్లు, రకరకాల చేపలు కనిపిస్తున్నాయి. అందంగా విలాసంగా తోకలు వూపుతూ వెళ్ళిపోతున్నాయి. సబ్‌మెరైన్ వాలి డ్రైవ్ చేస్తున్నాడు. నిశితంగా చూస్తున్నాడు.

అప్పటివరకు కనిపించిన నేల ముగిసింది. లోయలా కనిపిస్తుంది.

"మిస్టర్ వాలి. ఇక్కడనుండి ప్లాన్ ప్రకారం ఐదు వందల అడుగులు లోయలా వుంటుంది" యుగంధర్ అన్నాడు.

"ఓ. కె" వాలి స్టీపిన్స్ ముందుకు తోశాడు.

సబ్‌మెరైన్ లోయలోనికి డౌన్ అయింది.

ఎండిపోయినట్లు కనిపించే చెట్లు, చిన్నచిన్న మొక్కలు, అల్‌విట్స్ పువ్వులు గబాలున ముడుచుకుంటున్నాయి.

సబ్‌మెరైన్ నిదానంగా నడుస్తుంది. కొంతదూరం నడిచాక లోయ మరీ సన్నగా కనిపిస్తుంది. దాదాపు గుహలా వుంది.

"మిస్టర్ పి. జె. సబ్‌మెరైన్ వెళ్ళటం కష్టం. స్క్యూబ్‌లో మనమే వెళ్ళాలి" అన్నాడు వాలి.

చుట్టూ చూశాడు పి. జె. రాళ్ళ మధ్యగా మెరుస్తున్న చేతివాచి ఒకటి దూరంలో కనిపిస్తుంది.

పి.జె. వాలి, ధర్మ ముగ్గురు స్క్యూబ్స్ ధరించి నీళ్ళలో దిగారు. వెళ్ళి వాచితీశారు. వాచి ఆడుతూనే వుంది. అదే

దారివెంట సైంటిస్ట్లని తీసుకువెళ్ళారనుకున్నాడు. ముగ్గురు స్విమ్ చేస్తూ కొంతదూరం ఈదారు.

మతిపోయినట్లయింది. ఎదురుగా మూడు శవాలు. కాళ్ళకు ఇనుప గొలుసులు కట్టివున్నాయి. ఓ స్త్రీ శవం దిగంబరంగా వుంది.

దగ్గరగా వెళ్ళి నిశితంగా పరీక్షించారు. స్త్రీ శరీరంపై గాట్లు కాకుండా, ఏదో ఆవేశంలో వివస్త్రను చేసినట్లుంది.

మరికొంత ముందుకు సాగారు.

చిన్న కొండ అది. చుట్టూ దట్టంగా చెట్లు. చిన్న పెద్ద చేపలు చుట్టూ తిరుగుతున్నాయి. ఆ కొండవెంట ఈదారు పి. జె, వాలి, ధర్మ.

యుగంధర్, జోషిలా సబ్‌మెరైన్ స్లోగా జాగ్రత్తగా నడుపుతున్నారు.

ఒకచోట ఒక గుహలాంటిది కనిపించింది. లోపల వెలుతురుగా వుంది. ఒకరిముఖాలు ఒకరు చూశారు. లోపల ప్రాంతమంతా చేపలు వున్నట్టు అలికిడి లేదు.

యుగంధర్‌కి సిగ్నల్ ఇచ్చి, లోపలకు ప్రవేశించారు.

యాభై అడుగుల ఎత్తు గుహ, చుట్టూ వున్న రాళ్ళకు లైట్లు వెలుగుతున్నాయి. అన్ని బాటరీచార్జి చేయబడ్డ లైట్లు. ఒకప్రక్క గోళాకారంగా వున్న గాజు బీకరు, లోపల కుర్చీ వుంది. అంతా నిశబ్దంగా వుంది.

ఉన్నట్లుండి గాజు బీకరులో ఓ ఆకారం కనిపించింది. ఆ ఆకారం నవ్వుతూ ఓ బోర్డు చూపించి.

"వెల్‌కమ్ ఆల్ ఆఫ్ యు. మీరు పులిబోనులో పడ్డారు. యు విల్ డై" అని వుంది.

చుట్టూ కలయచూశారు భయంగా.

వేగంగా దూసుకువస్తున్న మనుషులు.

అందరూ బ్లూ ప్లాస్టిక్ డ్రాయర్స్ వేసుకున్నారు. నీళ్ళలో చాపల్లా యీదుతూ దూసుకువస్తున్నారు. ఒకరు ఇద్దరు కాదు, దాదాపు ఇరవై మంది. వాళ్ళలా వస్తుంటే స్కూబ్స్‌తో వాళ్ళను ఎదుర్కోనటం అసంభవంగా తోచింది. అందరు చుట్టుముట్టారు.

గాజు బెలూన్‌లో మనిషి నవ్వుతున్నాడు.

విదిలించుకొని పారిపోబోయారు. గాజు బెలూన్‌లో మనిషి స్విచ్ నొక్కాడు.

ప్రవేశించిన గుహకు అడ్డంగా ఇనుపచక్రం దిగి పోయింది.

5

యుగంధర్, జోషిలా స్కూబ్స్ ధరించి సబ్‌మెరైన్ దిగారు.

ఎంతసేపటికి వెళ్ళినవాళ్ళు రాకపోవటం, గుహలో నీళ్ళ కలకలం జరగటం అనుమానం కలిగించింది.

గుహ బయట నిలబడి చూశారు. లోపల పోరాటం జరుగుతుంది.

యుగంధర్ స్టెచ్‌గన్ వదిలాడు. అయినా ఇనుపచక్రం దాటి వేగంగా వెళ్ళటంలేదు.

ఏంచెయ్యాలో ఆలోచించి, జోషిలాను జిప్ తీయ మన్నాడు. జోషిలా కేవలం స్కూబ్స్‌తోనే వుంది. అది విప్పితే ఆక్సిజన్ మాత్రం వుండి దిగంబరంగా అవుతుంది.

అయినా యుగంధర్ అలా ఎందుకు చెప్పాడో అర్థం కావటంలేదు. ఆమె జిప్ విప్పింది. రబ్బర్ కోటు తొలగిం చింది. ఎత్తయిన రొమ్ములతో అందంగా మెరిసిపోతుంది జోషిలా.

గుహలోపల మనుషుల్లో ఒకడు చూశాడు. ఆ తరువాత ఒక్కొక్కరు అందరూ చూశారు. పి. జెవి, ధర్మని, వాలిని వదిలి ఆత్రుతగా ఈదుకుంటూ వస్తున్నారు. తన యుక్తి పనిచేసిందనుకున్నాడు యుగంధర్.

వాళ్ళు దూసుకువస్తూ ఇనుపచక్రాన్ని పట్టుకొని అరుస్తున్నారు. గాజు బెలూన్‌లో మనిషి చక్రం తొలిగించాడు.

యుగంధర్ చటుక్కున జోషిలాతో సబ్‌మెరైన్ లోపల ప్రవేశించాడు. వాళ్ళు సబ్‌మెరైన్ చుట్టి అరుస్తున్నారు.

పి. జె. జేబులోనుండి సీలుచేసిన సోప్‌లాంటి బిళ్ళతీసి, సీలు విప్పి, నీళ్ళలో వదిలాడు. నీళ్ళు నీలంరంగుకు వస్తున్నాయి. కొద్దిసేపట్లో అందరు తలలు వాల్చేసారు.

*　　*　　*

మెరైన్ ఫిషరీస్ రిసెర్చి స్టేషన్‌లో కమీషనర్ ఆఫ్ పోలీసు, స్టేషన్ డైరెక్టర్ రాందయాల్, పి. జె. ధర్మ, యుగంధర్, వాలి ఇంకా కొందరు ప్రముఖులు కూర్చున్నారు.

"ఇది ఒక రకమయిన ఎక్స్‌పెరిమెంట్ ప్రొఫెసర్ జాదాఖాన్ చేసింది. ఆయన మనిషిని చేపలా రూపొందించాడు. ఎలా? దవడలక్రింద ఆపరేట్ చేసి నోటిలో నీళ్ళు బయటకు వెళ్ళిపోయేలా అరేంజ్ చేశాడు. చేపలవలె నీళ్ళలో మనిషికూడా ఆక్సిజన్ తీసుకొనే ప్రయోగం.

బాటమ్ ఫిక్స్ లేబరేటరీలో దొరికిన రూపాయిబిళ్ళ అంత మిషన్ గొంతులో అరేంజ్ చేయటంవల్ల ఇది కొంత సాధ్యమయింది.

అయితే ఆపరేషన్ పూర్తిగా సక్సెస్ కాలేదు. వాళ్ళు

బయటకు వస్తే నీళ్ళలో చేప బయట ఎలా జీవించలేదో అలా చనిపోతారు. పైగా మెదడులో నరాలు దెబ్బతినటం వల్ల కర్తవ్యం తక్కువగా నెరవేరుస్తారు. ఒకరకమయిన మాడ్‌నెస్‌తోనే యీ పెరల్స్ ప్రోగుచేశారు.

పోతే వీళ్ళలో సెక్స్ ఇంప్లిమెంట్ ఎక్కువగా వుంది. అందుకే స్త్రీని చూస్తే ప్రాణానికయినా తెగిస్తారు. కాని నేను వదిలిన కెమికల్‌వల్ల నీరు నురుగుమయం కావటం నీళ్ళలో ఆక్సిజన్ లోపించటం జరిగి వాళ్ళు చనిపోయారు" పి. జె. అన్నాడు.

"ఏమయినా మరొక విజయం మీ బృందం సాధించారు" అన్నాడు రాందయాల్.

"అబ్బాయి, సాహసాలు చేగోడీల్లాంటివి. అలాంటివి తినటం మాకు అలవాటు," వాలి నవ్వుతూ సిగర్ వెలిగించాడు.

***

ఒక బ్రాహ్మణుని ఇంటి ఎదురుగా ఒక గాడిద చచ్చి పడివుంది. దానిని తీసెయ్యమని మున్సిపాలిటీ వారికి ఫోన్ చేశాడు. వీధులు శుభ్రం చేయించే అధికారికి ఆ బ్రాహ్మణుని ఏడ్పించాలనే బుద్ధి పుట్టి ఇలా అన్నాడు ఫోనులో.

"చనిపోయిన తరువాత క్రియా కర్మలన్నీ మీరే చేయిస్తారు కదండీ!"

"అది నిజమే కాని చనిపోయినవారి సంబంధీకులకు, బంధువర్గానికి తెలియపరచాలి కదా!" బ్రాహ్మణుని జవాబు.

—ఐ. వి. జి. కె. మూర్తి, ఢిల్లీ.

వేట!

ఏ. పీ. మోహన్రావ్

అనకాపల్లి స్టేషన్‌లో ఆగింది రైలు.

సూట్ కేస్ తీసుకొని క్రిందకు దిగాను. ఇంజను ప్రక్కనున్న కంపార్టుమెంటులో ఎక్కటంతో, నేను దిగిన ప్రదేశానికీ, స్టేషను బిల్డింగుకూ బాగా దూరం వుంది. స్టేషను వైపు నడవడం మొదలెట్టాను.

నా కళ్ళు రామంకోసం ఆతృతగా వెతకసాగాయి.

నేను వస్తున్నట్లు ఉత్తరం రాశాను ముందుగా. బయలుదేరబోయేముందు టెలిగ్రాం ఇచ్చాను. స్టేషనుకు ఖచ్చితంగా వచ్చివుంటాడనుకున్నాను. కానీ ఆ ప్రాంతాల వాడి జాడైనా, నాకు కనిపించలేదు.

ఊరు క్రొత్త. అందులోనూ రాత్రి సమయం. వీధులన్నీ వెతుక్కుంటూ పోయి, ఇంటి ఇంటికీ తిరగడం వీలయ్యే పని కాదని, మెల్లగా స్టేషను బైటకొచ్చి రిక్షా కోసం గాలించాను. అసలా నేనొచ్చిన రైల్లో ఎవ్వరూ

ప్రయాణీకులు దిగరన్న ధీమాతో ఒక్క రిక్షావాడూ వచ్చి నట్లు కనుపించలేదు.

సిగరెట్ వెలిగించుకొని నిలుచున్నాను.

దూరంగా కారు హెడ్‌లైట్లు కనుపించాయి. రెండు నిముషాల్లో కారు నా ముందుకొచ్చి ఆగింది.

తలుపు తెరుచుకొని ఒక వ్యక్తి దిగి నావైపు రావడం గమనించాను.

"మీరు డిటెక్టివ్ సుధాకర్‌గారా?" అడిగాడు అతను దగ్గరకంటా వచ్చి.

"అవును!" అన్నాను.

"మీకోసం కారు పంపారు మా అయ్యగారు."

"అంటే రామమా!"

"అవునండీ! వారే!" అన్నాడు డ్రైవరు.

సంతోషంగా కారెక్కాను.

కారు కదిలింది.

"మీ అయ్యగార్ని రమ్మని టెలిగ్రాం ఇచ్చాను. రాలేదేం?" అడిగాను డ్రైవర్ని.

"వారికి వారం రోజులనుండి మలేరియా! మంచంపట్టి వున్నారు."

"అరె! అలాగా!" అంటూ అంతదాకా స్టేషనుకు రానందుకు వాడ్ని తిట్టినందుకు నొచ్చుకున్నాను.

బంగళా ముందు కారు దిగి, తిన్నగా రామంగాడి రూంకు వెళ్ళాను. మంచంపైన రగ్గు కప్పుకొని పడుకుని వున్నాడు.

"రామం!" పిలిచాను మంచం ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంటూ.

"నువ్వా! ఈ పరిస్థితిలో వుండి రాలేకపోయానురా! కారు పంపాను. వచ్చిందా?"

"ఆఁ! వచ్చింది. ఎలా వుంది?"

"ఫరవాలేదు! కానీ లేచే స్థితిలో లేను. నీకు అన్ని ఏర్పాట్లు చేసి వుంచాను. వెళ్ళి రెస్ట్ తీసుకో! ప్రొద్దున్నే మాట్లాడుకొందాం!" అన్నాడు రామం.

అలాగేనని చెప్పి నాకు ఏర్పాటు చేసిన గదికి వెళ్ళాను. స్నానం, భోజనం ముగించి పడుకున్నాను.

నేను ఎన్నో పనుల ఒత్తిడినుండి తప్పుకొని ఇంత దూరం వచ్చింది అనకాపల్లి ప్రాంతపు టడవుల్లో నాల్రోజులు సరదాగా తిరిగి వేటాడటానికి. రామం మంచి షికారీ. వాడ్ని వెంటబెట్టుకొని వెళ్దామని ఆశగా వచ్చాను. వాడి పరిస్థితి చూడగానే ఉత్సాహం సగం చచ్చింది. తెల్లారాక వాడితో మాట్లాడి, ఏదో రైల్లో తిరిగి మద్రాసు వెళ్ళిపోవడంకన్నా వేరే గత్యంతరం లేదనిపించింది.

నిరాశ, నిస్పృహ, నన్నావరించాయి. అంతా డల్‌గా అనిపించింది. ప్రయాణపు బడలికవల్ల నిద్రలోకి మాత్రం ఒరిగిపోయాను.

తెల్లవారింది.

స్నానపానాదులు ముగించుకొని రామం గదికి వెళ్లాను.

"రారా! సుధాకర్!" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించాడు వాడు మంచంపైన కూర్చునే.

వెళ్ళి ఎదురుగా కూర్చున్నాను.

"నువ్వొచ్చిన పని నాకు తెలుసు. కానీ నీ వెంట వచ్చి సరదాగా నాల్రోజులూ నీతో గడిపే అవకాశం భగవంతుడు లేకుండా చేశాడు. తలచుకొంటేనే బాధగా వుంది" అన్నాడు

రామం నొచ్చుకుంటూ.

"అలాగనకు! ఇలాంటివి జరుగుతుంటాయి. అందుకే జీవితాన్ని వద్దించిన విస్తరిగా భావించను నేను. ఈ దినమే మద్రాసు వెళ్ళిపోదలచుకొన్నాను. మళ్ళీ వీలుచూచుకొని వస్తాను" అన్నాను.

"అలాగనకు. నేను రానంత మాత్రాన నీ ప్లాన్ మొత్తం తారుమారు కావలసిన అవసరంలేదు. నేను వేరే ఏర్పాటు చేశాను. ఇక్కడికి ఇరవై మైళ్ళ దూరంలోవున్న ధూపాడు గ్రామంలో నా స్నేహితుడున్నాడు. పేరుకు గ్రామంగానీ, ఉన్నది అతని ఇల్లు ఒక్కటే. చుట్టూ పెద్ద అడవి వుంది. చాల క్రూరమృగాలు కూడా వున్నాయి. అక్కడతనికి వ్యవసాయం వుంది. భార్యా, ముగ్గురు పిల్లలతో వుంటున్నాడు. ఈ ప్రాంతాల్లో పేరుపడ్డ షికారీ అతను. ఉత్తరం రాసి పంపుతాను. కారు తీసుకెళ్ళు. కొద్ది రోజులు అతనితో గడిపిరా!" అన్నాడు రామం.

ఆలోచించి "వద్దులేరా! నా వల్ల ఇంకెవరికో లేనిపోని అసౌకర్యం ఎందుకు?" అన్నాను.

"అలాంటిదేమీ లేదు. నాకు ప్రాణస్నేహితుడతను. నీ గురించి చాలాసార్లు మేమిద్దరం చర్చించుకున్నాం. మనిద్దరి స్నేహం అతనికి బాగా తెలుసు. మనిషి చాలా సరదాగా వుంటాడు. వెళ్ళిరా" అంటూ బలవంతం చేశాడు రామం.

కాదనడం కష్టమైంది.

సరేనని తలూపాను.

ఉత్తరం రాయించి సంతకం చేసి ఇచ్చాడు.

రామం కారులో బయలుదేరాను.

ఇరవై మైళ్ళు పోవడానికి దాదాపు రెండు గంటలు పట్టింది.

రోడ్ సరిగా లేదు. ఎత్తుపల్లాలు, మధ్యలో గంట్లు, చెట్లకొమ్మలు దారిని కప్పివేస్తూ పెరిగి వున్నాయి.

ధూపాడు గ్రామం దాటి రెండుమైళ్ళు వెళ్ళాం. విశాల మైన కాంపౌండ్‌లో వేసివున్న రెండు పెద్ద పూరిపాకలు కనుపించాయి. కారు పాకలదాకా వెళ్ళింది.

ఎదురుగా యాభై సంవత్సరాల వయస్సున్న వ్యక్తి కనుపించాడు. లావుపాటి తల. పెద్దపెద్ద కనుగుడ్లు, బుర్ర మీసాలు. తలపాగా, ధోవతీ కట్టుకుని, లాల్చి తొడుక్కుని వున్నాడు.

వెలుగుతున్న చుట్టను నోట్లోంచి ఎడంచేత్తో తీసి పట్టు కొని నాకేసి చూస్తూ "రామంగారి తాలూకా?" అడిగాడు గంభీరంగా అతను.

"అవును!" అంటూ ఉత్తరం తీసి ఇచ్చాను.

నిలబడే చదువుకున్నాడు. చదవడం పూర్తయ్యాక చేతులోవున్న చుట్ట తీసి దూరంగా పారేసి, "రండి! లోనికి రండి!" అంటూ వినమ్రంగా ఆహ్వానించాడు.

"మీ గురించి రామం చాలా చెప్పాడు. మిమ్మల్ని కలుసుకోగలిగినందుకు చాలా ఆనందంగా వుంది. ఇది మీ యిల్లుగానే భావించుకోండి. అరమరికలు లేకుండా అవసర మైంది అడగండి!" అన్నాడాయన.

"మీ పేరు?" అడిగాను.

"మల్లయ్య! ఇక్కడంతా నాకు లేని పెద్దరికం అంట గట్టి మల్లుదొర అంటూంటారు. మీరు నన్ను మల్లయ్యని పిలవండి చాలు" అన్నాడు.

ఆయన్ను చూస్తుంటే నా కెంతో ముచ్చటేసింది. ఆయనలో లేనిది గర్వం. ఉన్నది ప్రేమ. చుట్టూ వున్న ప్రకృతిలా, ఆయన కూడా ఆహ్లాదంగా కనుపించారు నాకు.

"మీరు బాగా వేటాడుతారా?" అడిగాడు మల్లుదొర.

"కొద్దిగా! మీ అంత నేర్పరిని కాను. కానీ, నాకు మొండిధైర్యం, అర్థంలేని తెగువ మాత్రం వున్నాయి." అన్నాను.

"వేటగాడికి అవే ముఖ్యమైన లక్షణాలు. ఇంతకు వేటిని వేశారు!"

"పదేళ్ళ క్రితం కాబోలు. ఈ ప్రాంతాల్లోనే రామంతో వచ్చి, ఏదు పందినీ, ఎలుగుబంటినీ కొట్టాను" అన్నాను.

"చిరుతపులినీ, పెద్దపులినీ, వెయ్యలేదా?"

"లేదు! అవి వున్నాయా ఈ అడవుల్లో" అడిగాను.

"ఇంతకుముందు వుండేవిగావు. నేనే పాతిక పిల్లల్ని తెచ్చి అడవిలోకి వదిలాను. ఆరేళ్ళనాటి మాట. ఈపాటికి అవి పెద్దవై వుంటాయి" అన్నాడు మల్లుదొర.

"అయితే వాట్ని చంపను!" అన్నాను.

"ఏం?" అడిగాడు మల్లుదొర.

"అవి మీరు ప్రేమతో తెచ్చి పెచ్చుకుంటున్నవి!"

"ఇంకెవరైనా వాటి జోలికి పోయినట్లు తెలిస్తే, తల తెగేస్తాను. కానీ మీరు ఒకదాన్ని వేటాడాలి! మీ సరదా కోసం ఏమైనా చేస్తాను. వెళ్ళి విశ్రాంతి తీసుకోండి! రాత్రికి వెళ్దాం వేటకు!" అన్నాడు మల్లుదొర.

కారును త్రిప్పి పంపేశాను. నాకు రెండో పాకలో మకాం ఏర్పాటు చేశారు.

రాత్రి భోజనాలయినాయి. రెండు తుపాకులు, మందు

గుండు, జీపు, పెద్ద టార్చిలైటు, ఒక వేటకుక్కతో సిద్ధమై మల్లుదొర నాకు కబురుపంపాడు. వెళ్ళి చూచి విశ్రాంతి చెందాను. నేనూ ఒక తుపాకీ తెచ్చాను.

అడవిలోకి వెళ్ళాం. అమావాస్య ముందురోజులు. చీకటి గొయ్యారంలాగుంది. ముందు కుక్క అరుచుకుంటూ పరుగెత్తసాగింది. వెంట జీపు సాగిపోయింది. మల్లుదొరే స్టీరింగు దగ్గర కూర్చున్నాడు. ఆ అడవి గురించి, అందు లోని జంతువుల గురించి వాటి నడవడిక గురించి చెప్పుకు పోతున్నాడు. ఊకొడుతూ అటూ ఇటూ గమనించసాగాను.

వేకువ ఝాము దాకా తిరిగాం. ఒక్క జంతువూ మా కళ్ళబడలేదు. తిరిగి వచ్చేశాం.

టిఫిన్ తిని విశ్రాంతి తీసుకునేందుకు వెళ్ళాను. పడుకో గానే నిద్రపట్టింది.

మళ్ళీ కళ్ళు తెరచేసరికి సాయంత్రం నాలుగు గంట లయింది. మంచం పైనుండి లేద్దామని ప్రయత్నించాను. అలసటగా, నీరసంగా తోచింది. కణతలు మంటలెత్తు తున్నట్లుగా అనిపించింది. ఒళ్ళు చూసుకున్నాను. బాగా జ్వరం తగిలినట్లు వేడిగా వుంది.

మల్లుదొరవచ్చి "ఏంటి ఇంకా అలసట తగ్గలేదా?" అని అడిగాడు.

"కాదు! బాగా జ్వరం తగిలినట్లుంది!" అన్నాను.

మల్లుదొర నా శరీరం తాకి చూశాడు. కనురెప్పను పైకెత్తి కనుగుడ్లను గమనించాడు. బిత్తరపోతూ "ఇప్పుడే వస్తాను!" అంటూ వెళ్ళిపోయాడు.

అతనలా ఎందుకు బెదరిపోయాడో అర్థంగాక, ఆలో చిస్తూ పడుకున్నాను.

రెండునిముషాల తర్వాత ముగ్గురు పిల్లలను వెంట బెట్టుకొని వచ్చాడు. "వీళ్ళు నా పిల్లలు. మీ మంచి చెడ్డలు చూచేందుకు తీసుకొచ్చాను. నేను అనకాపల్లికి వెళ్ళి డాక్టర్ని తీసుకొస్తాను. మీరు ధైర్యంగా పడుకొనుండండి!" అన్నాడు మల్లుదొర.

ఆయన అనవసరంగా కంగారుపడి లేనిపోని శ్రమ తీసుకుంటున్నట్లనిపించింది.

"ఎందుకండీ శ్రమ! రేపటికి అదే తగ్గిపోతుంది. డాక్టరు అవసరంలేదు!" అంటూ వారించాను.

కానీ ఆయన వినకుండా వెళ్ళిపోయాడు. పిల్లలు ముగ్గురూ నా మంచం చుట్టూ చేరారు. కాళ్ళు పిసకడం, కణతలు నొక్కడం, గాలి చాలదని విసనకర్రలతో విసరడం, లాంటి పనులన్నీ చెయ్యసాగారు. వాళ్ళను చూస్తే నాకు ఆనందం వేసింది. నాలాంటి అపరిచితుడికి అలా సపర్యలుచెయ్యడం అనూహ్యమైన విషయం కాబట్టి ఆశ్చర్య పోయాను.

రాత్రికి జ్వరం ఇంకా తీవ్రమైంది. స్పృహ కూడా పోయింది. మైకం వదలి, లోకం తెలిసేసరికి, మరుసటి రోజు రాత్రి ఏడుగంటలయింది.

"దొరగారొచ్చారా?" అడిగాను పెద్దబ్బాయిని.

"రాలేదు!" అన్నాడు.

"జీప్‌లో వెళ్ళి రావటానికి ఎంత టైమ్ పడుతుంది!" అడిగాను.

"నాన్నగారు ఎప్పుడు వెళ్ళినా నాలుగైదు గంటల్లో వచ్చేస్తారు. ఈతూరెందుకో ఆలస్యమైంది!" అన్నాడు రెండోకుమారుడు.

"వస్తారులెండి! ఆయన్ను గురించి కంగారుపడకండి!" అంది ఇద్దరిమధ్యా పుట్టిన అమ్మాయి.

అంతలోనే మల్లుదొర వచ్చాడు.

"నాన్నా జీపేది?" అడిగాడు పెద్దబ్బాయి.

"ఆక్సిడెంటయింది. పోయేటప్పుడు. నడచి వెళ్ళాను. ఏ డాక్టరును రమ్మన్నా రామని మొండికేశారు. రామాన్ని మద్రాసు తీసుకెళ్ళారట. అందుకని తిరిగి వచ్చేప్పుడు. కూడా నడక తప్పలేదు!" అన్నాడు మల్లుదొర.

అదంతా విన్నాక నాకు మతిపోయింది. ఏం మాట్లాడ లేకపోయాను. నా గురించి ఆయన తీసుకున్నంత శ్రమ, నేనే తీసుకోననిపించింది.

"ఎలావుంది బాబూ!" అడిగాడు నన్ను.

"నా సంగతి అలా వుంచి, ముందు మీ రెళ్ళి ఏమన్నా తిని విశ్రాంతి తీసుకోండి!" అన్నాను.

"నాకేం ఫరవాలేదు! ఇటువంటవన్నీ అలవాటే! నీ కోసం మందులు తెచ్చాను." అన్నాడు మల్లుదొర.

"థాంక్స్!" అని అందుకున్నాను.

"హాయిగా భోజనం చెయ్యవచ్చు డాక్టరు చెప్పాడు. ఇవాళ ఇద్దరం కలిసే తిందాం!" అన్నాడు మల్లుదొర.

"అలాగే!" అన్నాను.

భోజనాల దగ్గర ఆయనా, నేనూ, ముగ్గురు పిల్లలూ కూర్చున్నాం. వడ్డించేందుకు ఒకామె వచ్చింది.

తలెత్తి చూశాను. మంచి వయసులో వుంది. అందంగా వుంది. ఇంకాస్త పరిశీలనగా చూశాను. ఎక్కడో అంతకు ముందు ఆమెను చూచినట్లనిపించింది.

గబగబా, నాస్మృతి పథంలోని పాత జ్ఞాపకాలను తిర

గేశాను. ఆమె ఎవరయిందీ అంతుపట్టలేదు.

"ఏం అలా నిలుచున్నావెందుకు. ఆయన పరాయివాడు కాదు. రామంలాంటివాడు. మన ప్రాణస్నేహితుడు. సిగ్గు పడనవసరంలేదు! వడ్డించు!'' అన్నాడు మల్లుదొర ఆమెకేసి చూసి. ఆ తర్వాత నా వైపు తిరిగి "నా భార్య" అన్నాడు. ఆమె పైనుండి దృక్కులు మరల్చాను.

ఆమె వడ్డన ప్రారంభం చేసింది.

"ఈ పిల్లలంతా నా మొదట భార్య సంతానం. ఆమె అడవి జ్వరంతో సరయినమందు సకాలంలో అందక చచ్చిపోయింది. తర్వాత ఈమెను చేసుకున్నాను." అన్నాడు మల్లుదొర.

ఆమెకూ, ఆయనకూ వయస్సులో అంత వ్యత్యాసం వుండటానికి కారణాలు అర్థమైనాయి.

అన్నం తిన్నంతసేపూ ఆమె గురించి ఆలోచిస్తూనే వున్నాను.

ఆమె ఎవరు? నేనెక్కడ చూశాను? ఎక్కడో చూసిన వ్యక్తి ఈ మల్లుదొరకెలా తారసపడింది? ఎన్నో ప్రశ్నలు కానీ ఒక్కదానికీ జవాబు మాత్రం చిక్కలేదు.

భోజనం ముగించి వచ్చి ప్రక్కపైన పడుకున్నాను. నా గదిలో.

స్మృతిపథంలో శేఠ్ మోహన్‌లాల్ హత్యకేసు మెరుపులా మెరిసింది. మద్రాసు మహానగరంలో ఆరు సంవత్సరాల క్రితం జరిగిన ఓ ఘోరమైన నేరమది. అతన్ని ఇద్దరు యువకులూ, ఒక యువతీ, కాల్చి చంపారు. మోహన్‌లాల్ చచ్చిపోతూ తన దగ్గరున్న కెమెరాతో వాళ్ళను ఫొటో తీశాడు. ఫోన్‌చేసి పోలీసులకు చెప్పాడు.

ఆ ముగ్గుర్నీ పట్టుకునేందుకు ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు అతని భార్య తరఫున నేనూ ఎన్నో ప్రయత్నాలు చేశాం. ఆ యువకులు మాయమయినారు. ఆయువకుల ఆచూకీ కొంతదాకా తెలిసింది. నేను దాన్ని పట్టుకుని గుంటూరు దాకా వచ్చి వెళ్ళాను. ఆ తర్వాత ఆ కేసు అపరిష్కృతంగా ప్రభుత్వ రికార్డుల్లో వుండిపోయింది.

మల్లుదొర భార్య ఎవరోకాదు. ఆ తప్పించుకొన్న యువతే! అందులో ఏ విధమైన అనుమానంలేదు. ఆమెను అరెస్టు చేసేందుకు ఆరు సంవత్సరాలనాడే వారంటు జారీ చెయ్యబడింది.

నాలోని మనిషికీ, వృత్తి చేపట్టిన డిటెక్టివ్‌కూ మధ్య పెద్ద పోరాటం జరిగింది. మల్లుదొర ప్రేమ, అతని బిడ్డల ఆప్యాయత గుర్తొచ్చాయి. హాయిగా సాగే సంసారంలో చిచ్చు రగిలించవలసిన అగత్యం రావడం నాకు బాధా కరంగా తోచింది.

నా ఆరోగ్యం కుదుటపడలేదు. అందరూ నన్ను కంటికి రెప్పలా చూసుకోసాగారు.

చివరకు మల్లుదొర భార్య కూడా నాకు సపర్యలు చెయ్యడం మొదలెట్టింది.

అలా నాలుగు రోజులు జరిగిపోయాయి.

ఒకరోజు మల్లుదొర భార్య ఒంటరిగా వచ్చింది నా గదికి కాఫీ తీసుకొని.

"మీరు డిటెక్టివ్‌లా?" అడిగింది ఆమె నన్ను భయంగా.

"ఎవరు చెప్పారు?" అడిగాను.

"దొరగారు చెప్తే విన్నాను. మీది మద్రాసా?"

"అవును." అన్నాను.

"అక్కడ మీరుండేదెక్కడ?"

"మీకు మద్రాసు తెలుసా?" అడిగాను.

నా ప్రశ్నకు తడబడిపోయిందామె. ఏం జవాబు చెప్పాలో అర్థంగాక "లేదు!" అంది తక్కున.

"పోనీ గుంటూరు తెలుసా?" అడిగాను నా అనుమానం నివృత్తి చేసుకుందామని.

"తెలీదు! ఎందుకు?"

"నేనో కేసులో పనిచేస్తూ గుంటూరు వచ్చాను. అక్కడ మీలాంటి వ్యక్తిని చూసినట్లు అనుమానంగా వుంది. మిమ్మల్ని చూచింది మొదలు నాకు చాలా బాగా తెలిసిన మనిషి మీరై వుండాలనీ, మిమ్మల్ని ఇంతకుముందే ఎక్కడో చూచానని అనిపించింది. కానీ మనిషిని పోలిన మనిషి వుండివుండవచ్చు. అందుకే అడిగాను గుంటూరులో ఎప్పుడన్నా వున్నారాని?" అన్నాను.

"లేదండీ!" అందామె కాఫీ గ్లాసు తీసుకుని వెళ్ళిపోతూ.

ఆ తర్వాత రెండు రోజులకు కాస్త నయమనిపించింది ఆరోగ్యం.

"ఓమారు అనకాపల్లి వెళ్ళి డాక్టరును కలసివద్దామనుకుంటున్నాను" అన్నాను మల్లుదొరతో.

"అలాగే సాయంత్రం వెళ్దాం!" అన్నాడు.

"మళ్ళీ మీకా శ్రమ ఎందుకు? నే వెళ్ళి వస్తాను. జీపుందిగా?" అన్నాను.

"మీరు బలహీనంగా వున్నారు. మా పెద్ద అబ్బాయిని తీసుకొని వెళ్ళండి!" అన్నాడు మల్లుదొర.

"అలాగే!" అన్నాను.

ఆ రోజు సాయంత్రమే అనకాపల్లికి బయలుదేరాం.

రామం ఇంటికి చేరుకునేసరికి రాత్రి పదయింది. మద్రాసు నుండి అంతకు ముందురోజు రాత్రి వచ్చాడట రామం. నన్ను కౌగలించుకున్నాడు చూడగానే లేచొచ్చి.

కుశల ప్రశ్నలయ్యాక, మల్లుదొర భార్యగురించి నాకు తెలిసిందంతా చెప్పాను. విని విస్తుపోయి "నువ్వు పొరబడి వుండవచ్చు. మనిషిని పోలిన మనిషి వుండటం వింతా, విచిత్రంగాదు. అలాంటివి చాలా విన్నాం మనం. మల్లుదొర భార్యకూ, నువ్వు చెప్పే హత్యకేసుకు ఏవిధమైన సంబంధం వుండివుండదు" అన్నాడు రామం.

"అందుకే ఇప్పుడు ట్రంక్‌లో మాట్లాడి. ఆ వారంటు, ఫోటోలు, ఫైలు తెప్పిస్తాను. అంతా మరోసారి స్టడీచేశాక గాని ఏంచెయ్యాలో తేల్చుకోవడం కష్టం!" అన్నాను.

"నీ ఇష్టం!" అన్నాడు రామం.

ఆ రాత్రికి ఫోన్ చేశాను మద్రాసుకు.

తెల్లరాక మల్లుదొర కుమారుణ్ణి. జీపును త్రిప్పి పంపేశాను రెండ్రోజుల్లో రామంతోసహా కారులో వస్తానని.

ఆ దినం రాత్రికి మద్రాసుండి మనిషి వచ్చాడు ఫైలుతోసహా. ఆ మనిషిని తిరిగి వెళ్ళిపొమ్మన్నాను. గది తలుపులు మూసుకుని, తీరిగ్గా ఫైలుముందు పెట్టుకొని స్టడీచేశాను. ఆ ఫోటోని తదేకంగా అరగంటకాలం చూశాను. అనుమానం లేకుండా, అందులో వున్న యువతే! మల్లుదొర భార్యని అర్థమయింది. జారీకాని వారంటు కూడా వుందా ఫైల్లో.

బాధ్యతకల పౌరుడిగా, డిటెక్టివ్ వృత్తి చేపట్టిన వ్యక్తిగా, నా కర్తవ్యం నా కర్థమయింది. ఆమెను వెంటనే అరెస్టు చేయించి, నేరవిచారణ జరిపించడం కన్నా మరో మార్గం నాకు కనుపించలేదు.

ఉదయం రామానికి అన్ని కాగితాలు చూపించాను. ఫోటో కూడా అందించాను చూడమని.

చూసి నా కిచ్చేశాడు ఫోటో.

"ఏం చెయ్యమంటావ్?" అడిగాను.

"ఏం చెయ్యదలచుకున్నావ్?" అడిగాడు రామం.

నేను చెయ్యదలచుకుంది చెప్పాను.

"గుడ్! నీకు ఆరోగ్యం సరిగా లేనప్పుడు, ప్రాణాలకు తెగించి మల్లుదొర మందులు తెచ్చి ఇచ్చాడు. అతని పిల్లలు సేవలు చేశారు. అతని భార్యసపర్యలు చేసింది. నువ్వు వాళ్ళపట్ల చూపించే కృతజ్ఞత ఆమెను పోలీసులకు అప్ప గించడం. ఇంతకన్నా గొప్ప ఘనకార్యం మరేదీ వుండదురా సుధాకర్" అన్నాడు.

"అయితే ఏంచెయ్యాలంటావ్?" అడిగాను.

"ఏమో? నేను చెప్పేది నీకు నచ్చకపోవచ్చు. నా సలహా బహుశా నీ వృత్తికి వ్యతిరేకంగా వుండవచ్చు. అందువల్ల నువ్వే ఆలోచించుకొని నిర్ణయించుకోవడం మంచిది" అన్నాడు రామం.

అతని వద్దనుండి లేచి, కాగితాలు తీసుకుని నా రూంకు వెళ్ళిపోయాను. మంచంపైన వెల్లకింతలా పడుకుని ఆలో చించ సాగాను.

రాత్రంతా నాలో సంఘర్షణ జరిగింది.

ఆమె హంతకురాలయినా, ఆమె కుటుంబం నా ప్రాణాల్ని కాపాడింది. నాకు మరో పదిమంది హంతకుల్ని పట్టుకునే అవకాశం కల్పించారు వాళ్ళు. అలాంటివాళ్ళ గుండెల్లో మంటలు రేపడం, మనిషిగా ధర్మం కాదనిపించింది.

తెల్లారాక ఘూపాడుకెళ్ళి, అందరి దగ్గర శెలవు పుచ్చు

కుని మద్రాసు వెళ్ళిపోవాలనుకున్నాను.

ఆ రాత్రి హాయిగా నిద్రపట్టింది నాకు.

రామం గదికి వెళ్ళాను. అతను లేడు. సర్వెంట్‌ని అడిగితే ఎక్కడికో వెళ్ళాడని చెప్పాడు.

ఆ రోజు మధ్యాహ్నందాకా అంతులేడు రామం. ఒకవేళ నా ఊహలు పసిగట్టి, మల్లుదొరను హెచ్చరించేందుకు వెళ్ళివుంటాడేమోననుకున్నాను.

ఇక రామంకోసం ఎదురుచూచి లాభంలేదని, అతనింట్లో వున్న మోటార్‌సైకిల్‌మీద బయలుదేరాను ధూపాడుకు.

సగం దూరం వెళ్ళేసరికి రామం కారు ఎదురొచ్చింది. నన్ను చూచి ఆపి దిగాడు రామం కార్లోంచి.

"నా ఊహ తప్పలేదు!" అన్నాను నవ్వుతూ.

"నా అంచనా కూడా మారలేదు," అన్నాడు రామం.

"ఏమిటి నీ అంచనా?" అడిగాను నవ్వుతూనే.

"మల్లుదొర భార్యను అరెస్టు చేయించేందుకు వెళ్తున్నావు కదూ!" అడిగాడు రామం.

"కాదు! నా ప్రాణాలు కాపాడినందుకు ఊరికి వెళ్ళబోయేముందు ఓమారు నా కృతజ్ఞత తెలుపుకుందామని బయలుదేరాను." అన్నాను.

"అలాగా! అయితే పద నేనూ వస్తాను!" అన్నాడు రామం.

ఇద్దరం కారులో ధూపాడువైపు బయలుదేరాం.

మల్లుదొర ఇంటిముందు చాలామంది జనం గుమిగూడి వున్నారు. ఏడుపులూ, పెడబొబ్బలుగా వున్నారు జనం.

"ఏమైంది?" అడిగాను నేను.

"దొరగారి భార్య ఉరిపోసుకుంది." అన్నారు.

నాకు నోట మాట రాలేదు.

"ఆ త్రాడు నేనే ఇచ్చాను!" అన్నాడు రామం.

"కాదురా! కాదు! నేనే తెచ్చాను." అన్నాను కళ్ళనీళ్లు పెట్టుకుంటూ.

మా దగ్గరకొచ్చి నిలుచున్న మల్లుదొర "బాబూ! జంతువుల్ని వెంటాడే మనుషుల్ని చూశాను ఇన్నాళ్లు! కానీ మనుషుల్ని వేటాడే మనుషుల్ని కూడా చూశాను ఈనాడు!" అన్నాడు కళ్ళొత్తుకుంటూ.

"అంత మాటనకండి! సుభాకర్ వేటాడేందుకు రాలేదు!" అన్నాడు రామం.

ఆ మాటలు మల్లుదొరకు వినిపించివుంటాయన్న నమ్మకం నాకు లేదు. బాధతో తలొంచుకొని నిలుచున్నాను.

***

మేనేజర్: తన రాజీనామా వార్త మన పత్రికలో పడిన విషయం గురించి మంత్రిగారు చాల కోపంగా వున్నారట ఎందుకూ?

ఎడిటర్: ఆ...మరేమీ లేదు. పొరపాటున ఆ వార్త ''ప్రజాక్షేమం'' శీర్షిక క్రింద పడింది.

— యం. విద్యుల్లత, విశాఖపట్టణం.

"నకిలీఖాతా"

శ్రీరాజ్

మద్రాసులోని శాంతి విహార్ లాడ్జింగ్.

రూము నంబరు నాలుగులో కిరణ్ కూర్చొని అప్పటి దాకా తనకు కలెక్టు అయిన పేమెంట్సు లెక్క చూసుకో సాగాడు. మొత్తం అరవై అయిదువేలు. అన్ని పేమెంట్సు చెక్కుల రూపంలో వచ్చినాయి.

ఇంతవరకు కిరణ్ వసూలుచేసిన చెక్కులన్నీ కంపెనీకి పంపించలేదు. ఏ రోజు కారోజు యివాళ పంపిద్దాం, యివాళ పంపిద్దాం అనుకుంటు సమయం చాలక అవి అన్నీ తన దగ్గరే ఉంచుకొన్నాడు.

కిరణ్ కాన్పూరులోని ఖర్మవీర్ అండ్ కంపెనీలో సేల్సు రిప్రజింటెటివ్‌గా పనిచేస్తున్నాడు. ఆర్డర్సు బుక్ చెయ్యడం, డబ్బు వసూలు చెయ్యడం అతని పని.

కిరణ్‌కి టి. ఏ., డి. ఏలు కాక రెండు వందలు రూపాయల జీతం వస్తుంది నెలకి.

కిరణ్‌ది చాలా పెద్ద కుటుంబం. కుటుంబాన్ని అంతా అతనే పోషించాలి. వచ్చే మూడు వందల జీతం సరి పోదు. అతనికి వచ్చే డి. ఏ లో కొద్ది కొద్దిగా మిగుల్చు కుంటూ కుటుంబాన్ని అతికష్టంమీద పోషించుకుంటు న్నాడు.

అతని పెద్ద చెల్లెలు పెళ్ళీడుకు వచ్చింది. పెళ్ళి చేయాలి. అతనికివచ్చే నెల జీతం తప్ప వేరే ఆదాయంలేదు. ఆస్తి కూడ ఏమిలేదు. చెల్లెలి పెళ్ళి ఎలా చెయ్యాలనేది ఒక పెద్ద సమస్య అయి కూర్చొంది కిరణ్‌కి.

కిరణ్ తన దగ్గిర ఉన్న చెక్కులన్నీ కవర్లోపెట్టి కంపె నీకి పంపిద్దామని పోస్టాఫీసుకు బయలుదేరాడు.

కిరణ్‌కి మళ్ళీ చెల్లెలి పెళ్ళి విషయం గుర్తుకు వచ్చింది.

'ఏం చేయాలి! ఏం చేయాలి! తనకు అప్పిచ్చేవాడు కూడా ఎవడూలేడు. కావాలంటే కంపెనీవాళ్ళ వెయ్యో, రెండువేలో యిచ్చి, తరువాత జీతంలో మినహాయిస్తారు, ఆ డబ్బుతో తన చెల్లెలి పెళ్ళికాదు. కనీసం పదివేలన్నా కావాలి.

పోస్టాఫీసుకు చేరుకున్నాడు కిరణ్. రిజిష్టర్ కౌంటరు దగ్గిరకు వచ్చి 'క్యూ'లో నిలబడ్డాడు. మెల్ల మెల్లగా లైను కదులుతున్నది.

అంతలో కిరణ్‌కి ఏదో ఆలోచన వచ్చి 'క్యూ' లోంచి బయటికు వచ్చాడు. తనకు వచ్చిన ఆలోచనను తలచు కుంటే ఒక్కసారిగా గుండె అదిరింది. కాళ్ళు కొద్దిగా వణి కాయి. అతనిలో ఏదో తెలియని జంకు బయలుదేరింది.

మెల్లగా హోటల్‌వైపు దారి తీసాడు. కాఫీ తాగి, సిగి

రెట్టు వెలిగించు కొన్నాడు.

కిరణ్ మనసంతా గజిబిజిగా తయారయింది.

'అలాచేస్తే ఎలా ఉంటుంది?' యిదే ప్రశ్న అతన్ని వేధించసాగింది.

అవును అలాగే చేయాలి, అంతకుతప్ప దారిలేదు. దొరికిన ఈ అవకాశాన్ని జారవిడుచుకుంటే తిరిగి జన్మలో తను చెల్లెలి పెళ్ళి చేయలేడు. కాబట్టి తరువాత ఏం జరిగినా ముందు ఈ పని పూర్తయితేచాలు. అంతకు మించి దారిలేదు. తనకు తానే సమాధాన పరచుకొని మెల్లిగా లాడ్జింగ్ వైపు కదిలాడు.

అతని చేతి కవరు చెమటకు చెమ్మగిల్లింది.

2

ఉదయం పదిగంటల సమయం.

'కాన్పూరు పిటీ బ్యాంక్' అప్పుడే తెరిచారు. ఆఫీసు స్టాఫ్ అంతా అప్పుడే మెల్లిగా తమ సీట్లలో చేరుతున్నారు.

కిరణ్ బ్యాంకిలోకి ప్రవేశించి సరాసరి మేనేజర్ గదిలోకి అడుగు పెట్టాడు.

మేనేజర్‌కి నమస్కరించి ఆయన చేతికి ఒక కవరు అందించాడు కుర్చీలో కూర్చొని.

మేనేజర్ కవరు తెరచి అందులోని కాగితాన్ని బయటకు తీసి చదువుతున్నంత సేపు ఆయన వైపే చూస్తూ కూర్చొన్నాడు కిరణ్.

మేనేజర్ ఆ కాగితాన్ని చదివి మడచి టేబుల్‌పై వుంచి కిరణ్ వంక చూసాడు.

"మీరు కొత్తగా స్థాపించే ఈ 'ఖర్మవీర్ అండ్ కంపెనీ'కి మీరుకాక ఎవరన్నా పార్ట్‌నర్స్ ఉన్నారా?" అడిగాడు మేనేజర్.

"లేరు నే నొక్కడినే."

"మీకు ఈ రికమండేషన్ లెటర్ వ్రాసిన గుప్తాగారు ఏ విధంగా తెలుసు?" మళ్ళీ అడిగాడు మేనేజరు.

"గుప్తా, నేను ఒకప్పుడు క్లాస్‌మేట్సు ఆ పరిచయమే."

"ఈ ఖర్మవీర్ అండ్ కంపెనీకి మీరు ఎంత పెట్టుబడి పెట్టారు?" అడిగాడు మేనేజరు కాలింగ్ బెల్ నొక్కుతూ.

"యాభై వేలు" చెప్పాడు కిరణ్. అతనికి చాలా కంగారుగా ఉంది, తన గుట్టు ఎక్కడ బయటపడుతుందో అని. అయినా అవేమీ పైకి కనిపించనీయకుండా జవాబులు యిస్తున్నాడు.

అంతలో బాయ్ రెండు కాఫీలు తీసుకువచ్చి టేబిల్ మీద పెట్టి వెళ్ళి పోయాడు.

కాఫీ తాగి ఖాళీ కప్పు టేబిల్‌మీద పెడుతూ మళ్ళా బెల్ నొక్కాడు మేనేజర్.

అటెండర్ లోపలకువచ్చి నిలబడ్డాడు.

అప్లికేషన్ ఫారాలు తీసుకువచ్చి, మన ఎక్కౌంటెంటు గార్ని పిలుచుకురా, పురమాయించాడు మేనేజర్.

కొద్ది నిమిషాల తరువాత ఎక్కౌంటెంటుని పిలుచుకు వచ్చాడు. అటెండర్ అప్లికేషన్ ఫారాలు టేబిల్‌మీదపెట్టి వెళ్ళిపోయాడు.

ఎకౌంటెంటు, కిరణ్‌చేత అప్లికేషన్ ఫారాలు పూర్తి చేయించాడు. వంద రూపాయలతో ఎకౌంటు ఓపెన్ చేసాడు.

కొద్ది నిమిషాల తరువాత పాస్‌బుక్, చెక్కుబుక్ కిరణ్ చేతికి వచ్చాయి.

మేనేజర్‌కు 'థ్యాంక్స్' చెప్పి, బయటకు నడిచాడు కిరణ్

కిరణ్‌కి ఏదో చెప్పరాని భయం ఆవహించ సాగింది. అయినా తన దగ్గర ఉన్న చెక్కులు కొద్ది రోజులలో క్యాష్ అయి అరవై అయిదువేలు చేతికి వస్తాయన్న ఆశతో ఆ భయాన్ని పారద్రోలటానికి ప్రయత్నించ సాగాడు.

3

"అంటే ఈ సారి ట్రిప్పులో అయిదు వేలే కలక్షను అయిందన్నమాట. అంటె మిగతా అరవై వేలు బాలన్సు ఉండిపోయింది" అన్నాడు ఖర్మవీర్.

"అవును సార్! యింతవరకు ఒక్కసారికూడా ఈ విధంగా జరగలేదు. ఏ పార్టీ దగ్గర కెళ్ళినా బిజినెస్ లేదన్న మాటే. ఈ అయిదువేలయినా అతికష్టంమీద వసూలయి నాయి. వచ్చేనెలలో బాకీ మొత్తం వసూలు చేసుకొస్తాను" చెప్పాడు కిరణ్.

తను చేసిన పని బయటపడకుండా, డబ్బు వసూలు అవ లేదని చెపితే ఖర్మవీర్, తనని ఏమి అనుమానించకుండా ఉండాలని అందరి దేముళ్ళ పేర్లు జ్ఞాపకం చేసుకొని మరీ మొక్కుకోసాగాడు కిరణ్.

"డబ్బు వసూలు అవకపోతే మనం మళ్ళా ప్రొడక్షన్ ఎట్లాచేస్తాం, సప్లయి ఎట్లా చేస్తాం. అసలే రెండు మూడు నెలలనుంచి వ్యాపారం డల్‌గా సాగుతుంది." అన్నాడు ఖర్మవీర్ కణతలు రుద్దుకొంటూ.

"నా శాయశక్తులా ప్రయత్నించాను సార్. పని జరగ లేదు. వచ్చే నెల ఎలాగైనా కష్టపడి డబ్బంతా వసూలు చేస్తాను." అన్నాడు కిరణ్.

"సరే ఏం చేస్తాంగాని, మళ్ళా ఏమన్నా ఆర్డర్సు బుక్

చేసావా?" అడిగాడు ఖర్మవీర్.

"ఆర్డర్సుకూడా ఎక్కువలేవండి. మొత్తం పదివేలకే. అవయినా వచ్చేనెల మొదటివారంలో పంపించమని చెప్పారు." అన్నాడు కిరణ్ బిక్కు బిక్కుమంటూ.

"అన్నీ అన్నిగానే ఏడ్చినాయి. అయితే ఈ నెల.అంతా మనం ఖాళీ అన్నమాట."

అవునన్నట్లు తల వూపాడు కిరణ్.

కాసేపు యిద్దరిమధ్యా మౌనం నాట్యం చేయసాగింది.

కొద్దిసేపు అనంతరం "సార్, ఒఖ్క పదిహేను రోజులు సెలవుకావాలి. మా చెల్లెలికి పెళ్ళి సంబంధం చూడాలి. అందుకని" నీళ్ళు నమలసాగాడు కిరణ్.

"ఎలాగూ ఈ నెలంతా పనిలేదుగా. అలాగే సెలవు తీసుకో."

"థ్యాంక్సు. సార్!"అనిచెప్పి. ఖర్మవీర్ దగ్గిర శెలవు తీసుకొని బయటకు నడిచాడు కిరణ్.

అప్పటిదాకా ఎంతో భయాందోళనలతో సతమత మవుతున్న కిరణ్ హృదయం ఒక్కసారిగా కుదుటపడింది.

4

కిరణ్ బ్యాంకిలో ఎక్కౌంటు ఓపెన్‌చేసిన నాలుగు రోజుల తరువాత తన దగ్గిరఉన్న చెక్కులలో నాలుగు చెక్కులు బ్యాంకిలో ఇచ్చాడు. అవి కలక్షన్ అయివస్తే పదివేలరూపాయలు తన ఎక్కౌంటులో చేరిపోతాయి.

ఆ తరువాత తన దగ్గరఉన్న మిగతా పది చెక్కులు కూడ ఎటువంటి గొడవ లేకుండా కలక్షన్ అయివస్తే, ఆ డబ్బు తీసుకొని హాయిగా తన కుటుంబంతోసహా ఎటన్నా వెళ్ళిపోవచ్చు. తన కార్యక్రమం పూర్తయేదాకా ఎటువంటి

అవరోధాలు రాకుండాఉండాలని భగవంతుడ్ని పదే పదే ప్రార్థించసాగాడు.

బ్యాంకిలో చెక్కులు యిచ్చేసిన తరువాత బ్యాంకినుంచి సరాసరి ప్రెస్ దగ్గిరకువెళ్ళి అంతకుముందు తను ఆర్డరిచ్చిన 'ఖర్మవీర్ అండ్ కం' ప్రింటెడ్ కార్డ్సు డెలివరీ తీసుకొని బయటకువచ్చి తను టెంపరరీగా తీసుకొన్న ఆఫీసుగది వైపు నడిచాడు.

ప్రింటెడ్ కార్డ్సులో కొన్నిటిని తీసుకొని తమకున్న పార్టీలందరికీ ఉత్తరాలు వ్రాయసాగాడు.

డియర్ సర్

ఇక్కడ మార్కెట్ పొజిషన్ సరిగా లేనందున ప్రస్తుతం ఒక నెలరోజులు సప్లై ఉండదు. మీరు యిచ్చిన ఆర్డర్సు ప్రస్తుతం పెండింగ్‌లోఉంచి నెలరోజుల తర్వాత డిస్‌పాచ్ చేస్తాము.

ముఖ్యంగా వ్రాయునది ఏమనగా మా ఆఫీసు వేరే చోటికి మార్చాము. అడ్రసు ఈ క్రింద వ్రాస్తున్నాము. ఇకనుంచి జరిగే కరస్పాండెన్సు ఈ క్రింది అడ్రసుతో చేయగోర్తాము.

చిత్తగించవలెను.

ఇట్లు,

ఖర్మవీర్.

తను వ్రాసిన ఉత్తరాన్ని ఒకసారి చదువుకొని తృప్తిగా దానివంకచూసి మిగతా ఉత్తరాలుకూడా ఆ విధంగానే వ్రాసి పోస్టుచేసాడు.

తరువాత పదిరోజులలోపు మిగతా చెక్కులుకూడా బ్యాంకిలో యిచ్చాడు. వాటిలో యాభై అయిదువేలు విలువ

చేసే చెక్కులు మాత్రం కాష్ అయినాయి. 5 వేలు చేసే ఒకచెక్కు మటుకు యింకా క్యాష్ అవలేదు.

ఆ రోజునే యాభై అయిదువేలు డ్రా చేసాడు కిరణ్. మిగతా అయిదువేలు వచ్చేదాకా కూర్చుంటే ఈ విషయం బయటపడి గొడవ అవుతుందని భయపడి, ఆ మర్నాడే తన కుటుంబాన్ని అంతా తీసుకొని హైదరబాదులో అంతకు ముందే తను తీసుకొని ఉంచిన యింటికి వచ్చేసాడు.

రెండు రోజులు హైదరాబాదులో ఉన్న తరువాత తన దగ్గరఉన్న యాభై వేలు తల్లికియిచ్చి, మళ్ళి రెండు రోజు లలో వస్తాననిచెప్పి, మళ్ళీ కాన్పూరు బయలుదేరాడు.

5

ఆ రోజు పోస్టులో వచ్చిన ఉత్తరాలను ఒక్కొక్కటి తీసి చదువుతున్నాడు ఖర్మవీర్.

ఈ మధ్య అసలు పార్టీలనుంచి లెటర్సు రావటం లేదను కొన్నాడు మనస్సులో, మద్రాసునుంచి వచ్చిన కవరు కంట పడగానే దాన్ని విప్పి చదవసాగాడు.

"సర్,

మీకు ఇవ్వవలసిన బాకీతాలుకా పైకం చెక్కు బ్యాంకిలో హానర్ చేయలేక పోయినందుకు చింతిస్తున్నాము. సమ యానికి డబ్బు అందలేదు. అందుకని చెక్కు పాస్ అవటం కష్టం అయింది. కాబట్టి ఈ కవరులో మీ బాకీ తాలుకా బాకీ పైకము అయిదువేల రూపాయలు డ్రాఫ్టుతీసి పంపు తున్నాము. స్వీకరించగలరు.

- మా తాలుకా రిటర్న్ అయిన చెక్కుని మాకు పంపించ వలెను.

చిత్తగించవలెను,

ఇట్లు,

డ్రాఫ్టుమీద తారీఖు చూశాడు ఖర్మవీర్ 26 వ తారీఖు ఇవాళ తారీఖు 31.

మళ్ళీ ఖర్మవీర్ దృష్టి ఉత్తరం మీద పడింది.

"అవును, అసలు ఈ బాకీ వసూలు కాలేదని చెప్పాడే కిరణ్. మరి ఈ పార్టీ చెక్కు యిచ్చానని వ్రాసాడే. ఏమి టిది?" ఆలోచనల్లో పడ్డాడు ఖర్మవీర్.

వెంటనే ఖర్మవీర్‌కి ఏదో అనుమానమొచ్చి, టెలిఫోను ముందుకు లాక్కొని మద్రాసుకి ట్రంకాల్ బుక్‌చేసాడు.

ట్రంకాల్‌లో మద్రాసు పార్టీ చెప్పింది విన్న తరువాత ఆశ్చర్యంతోపాటు కోపంకూడ వచ్చింది ఖర్మవీర్‌కి. అయినా ఇంకా పూర్తిగా అనుమానం తీరక మిగతా ఊళ్ళల్లో ఉన్న పార్టీలందరికి కూడ ట్రంకాల్స్ బుక్‌చేసి మాట్లాడాడు ఖర్మవీర్.

అందరిదీ ఒకటే సమాధానం. "మీ రిప్రజంటెటివ్‌కి బాకీ తాలుకా చెక్కులు ఇచ్చామని."

కొద్ది క్షణాలు నిశ్చేష్ఠుడైపోయాడు ఖర్మవీర్.

"మరి కిరణ్ ఆ విధంగా ఎందుకు చెప్పాడు!"

ఖర్మవీర్ మెదడు వేగంగా పనిచేయసాగింది.

మళ్ళీ టెలిఫోన్ తీసుకొని తన ఖాతా ఉన్న బ్యాంకికి ఫోను చేసాడు. ఆ తరువాత ఊళ్ళో ఉన్న మిగతా బ్యాంక్ లన్నింటికీ ఫోను చేసాడు.

"ఖర్మవీర్ అండ్ కంపెనీ పేరుతో ఎవరన్నా ఖాతా తెరిచారా" అని.

అన్ని బ్యాంకిలనుంచి కూడ లేదనే సమాధానం వచ్చింది.

కాన్పూరులో ఇంకా ఏ ఏ బ్యాంకిలు ఉన్నాయా అని గుర్తు చేసుకోసాగాడు. "అవును ఇంకో బ్యాంకి మిగిలి

పోయింది. దానికి కూడా ఫోనుచేస్తే తన అనుమానం తీరి పోతుంది." వెంటనే డైరెక్టరీలో బ్యాంకి నెంబరు చూసుకొని ఫోన్ డయల్ తిప్పాడు.

"యస్, దిసీజ్ కాన్పూరు సిటీ బ్యాంక్." వినిపించింది అవతలనుంచి.

"హల్లోసార్, ఈ మధ్య మీ బ్యాంకిలో ఎవరన్నా 'ఖర్మవీర అండ్ కంపెనీ' పేరుతో ఖాతా తెరిచారా?" అడిగాడు ఖర్మవీర్. అతని మనసంతా గజిబిజిగా తయారయింది. అవతలనుంచి ఏం సమాధానమొస్తుందా అని చెవులు రిక్కించుకున్నాడు.

"ఆఁ! ఈ మధ్యనే.... అంటే పదిహేను రోజుల క్రితం కిరణ్ అనే అతను ఖర్మవీర్ అండ్ కంపెనీ పేరుతో ఖాతా తెరిచాడు, ఇంతకీ మీరెవరు?" వినిపించింది అవతలనుంచి.

ఒక్కసారిగా గుండె ఆగిపోయి కొట్టుకొన్నది ఖర్మవీర్‌కి. ఫోనులో మాట్లాడటానికి కూడ నోట్లోనుంచి మాట రావడంలేదు. చేతిలోని రిసీవరు క్రిందకు జారవిడిచి కుర్చీలో జారిపోయాడు నీరసంగా.

పావుగంటదాకా అలాగే పిచ్చిగా శూన్యంలోకి చూస్తూ కూర్చుండిపోయాడు. అలా బాధపడుతూ కూర్చుంటే లాభంలేదనుకొని, కుర్చీలోంచి లేచి, మేనేజర్‌కి ఆఫీసు అప్పగించి బయటకు నడిచాడు ఖర్మవీర్.

6

ఇన్‌స్పెక్టరుకు జరిగిన మోసమంతా వివరించాడు. ఇన్‌స్పెక్టర్, ఇద్దరు కానిస్టేబుల్స్‌ని తీసుకొని, ఖర్మవీర్‌తో కిరణ్ ఇంటికి వచ్చాడు.

కిరణ్ ఇంటికి తాళం కప్ప వ్రేలాడదం చూసి ప్రక్క

వాళ్ళను అడిగాడు కిరణ్ గురించి ఇన్‌స్పెక్టర్.

కిరణ్ వాళ్ళు ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోయారని, ఎక్కడకు వెళ్ళారో తమకు తెలియదని చెప్పారు వాళ్ళు.

అక్కడనుంచి సరాసరి కాన్పూరు సిటీ బ్యాంకికి వచ్చారు. మేనేజర్ దగ్గిరకు వెళ్ళి కిరణ్ గురించి వివరాలు అడిగి జరిగినదంతా చెప్పారు.

జరిగిన మోసం విన్న తరువాత మేనేజర్ విచారం వ్యక్తపరుస్తూ జరిగినదంతా చెప్పాడు.

"గుప్తాగారి అడ్రసు ఇస్తారా?" అడిగాడు ఇనస్పెక్టర్, మేనేజర్‌ని.

రెండు నిమిషాల్లో గుప్తాగారి అడ్రసు తెప్పించి ఇచ్చాడు బ్యాంకి మేనేజర్.

మేనేజర్ దగ్గిర శెలవు తీసుకొని కిరణ్‌కి రికమండేషన్ లెటరు వ్రాసి ఇచ్చిన గుప్తా ఇంటికి బయలుదేరారు ఖర్మవీర్ ఇన్‌స్పెక్టర్ బృందం.

ఇన్‌స్పెక్టర్ చెప్పినదంతా విన్న తరువాత—

"ఈ విషయంలో నా కెటువంటి సంబంధంలేదు. కొత్తగా కంపెనీ పెడుతున్నాను. బ్యాంకిలో ఎక్కౌంటు ఓపెన్ చేస్తున్నాను. కాస్త రికమండ్ చేయమన్నాడు చిన్ననాటి స్నేహితుడుగదా అని రికమండేషన్ లెటరు వ్రాసి ఇచ్చాను. అంతకుమించి నాకేమి తెలియదు." అని మొత్తుకున్నాడు గుప్తా.

దీనిలో గుప్తాకి ఏదో సంబంధముందని అనుమానించి గుప్తాని అరెస్టుచేసి జీప్‌లో ఎక్కించుకొని, కిరణ్ తీసుకున్న ఆఫీసు గదివైపు పోనిచ్చాడు జీప్‌ని.

అక్కడ కూడ తాళం కప్ప స్వాగతం ఇచ్చింది. తాళం

కప్పు పగులకొట్టి కిరణ ఆఫీసురూమ్‌లోకి నడిచారు ఇన్‌స్పెక్టర్ బృందం.

లోపల ఒక డ్రాయరు. రెండు కుర్చీలు ఉన్నాయి. టేబిల్ మీద కొన్ని కాగితాలు కనిపించాయి. వాటిని పరిశీలనగా చూసాడు. కాని వాటివల్ల ఎటువంటి ప్రయోజనం లేదని గ్రహించి, ఆ రూమ్‌కో సీలువేసారు.

ఖర్మవీర్ దాదాపు పిచ్చెక్కిన వాడిలా తయారయ్యాడు.

"ఇక దొరకడంటారా ఇన్‌స్పెక్టర్." అడిగాడు ఖర్మవీర్, కిరణ్ గురించి.

"దోషి తప్పించుకోలేడు. తప్పకుండా దొరుకుతాడు. మీరేమీ భయపడవద్దు."

"ఏం దొరకటమో, ఏమో, వాడు దొరికేదాక నా మనస్సు పిచ్చెక్కిపోతుంది. తీరా వాడు దొరికిన తరువాత, ఆ డబ్బు వాడి దగ్గర ఉందో, ఖర్చు చేసాడో, ఖర్చుచేస్తే వాడు దొరికిన తరువాత ప్రయోజనం ఉండదు" అన్నాడు ఖర్మవీర్ నీరసంగా.

"యాభై వేలు పదిహేను రోజులలో ఖర్చుచేస్తాడన్నది ఉత్తమాట. వాడు దొరికిన తరువాత అణా పైసలతో సహాఆ డబ్బు కక్కిస్తాం.

"కిరణ్‌కి, అతని లెక్క ప్రకారం బ్యాంక్‌లో యింకా అయిదువేలు ఉండాలి. మేనేజర్ చెప్పిన మాటలు విన్నారుగా యిందాక. అయిదువేల రూపాయల చెక్కు ఒకటి పార్టీ ఆనర్ చేయకపోతే రిటర్న్ అయిందని. ఈ విషయం కిరణ్‌కి తెలియదు. అతనింకా అయిదువేలు బ్యాంకిలో ఉన్నాయని అనుకుంటూ ఉండాలి. అతను తప్పకుండా ఆ అయిదువేలకోసం మళ్ళీ బ్యాంకికి వస్తాడు. అప్పుడు వల పన్ని పట్టుకోవాలి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

కొద్దిగా ఆశ చిగురించింది ఖర్మవీర్‌కి, ఇన్‌స్పెక్టర్ మాటలు విన్న తరువాత.

7

రైలు కాన్పూరు చేరేటప్పటికి రాత్రి ఒంటి గంట అయింది.

కిరణ్ రైలు దిగి స్టేషన్‌లోంచి బయటకు రాగానే ఎదురుగా ఉన్న హోటల్‌లోకి దూరాడు. రైలు దిగినప్పట్నుంచి పిరికితనం, భయం ఆవహించసాగింది. తిరిగి వెళ్ళి పోదామనుకొన్నాడు. ఇప్పుడు అయిదువేలకోసం బ్యాంకికి వెళితే ఒకవేళ పోలీసులు తనకోసం గాలించి పట్టుకుంటే మిగతా యాభై వేలు కూడా కక్కాల్సి వస్తుంది.

అయినా యింతదూరం వచ్చి చేజేతులా అయిదువేల రూపాయలు వదులుకోవడం దేనికి? అయినా ఖర్మవీర్‌కి తను చేసిన మోసం తెలియక పోవచ్చు. ఏమో! ఒకవేళ తెలిసిపోయి పోలీసు రిపోర్టు యిచ్చాడేమో.

ఆలోచిస్తూ చివరకు ఒక నిశ్చయానికి వచ్చి, దగ్గరలో ఉన్న లాడ్జింగ్‌లో రూమ్ తీసుకొన్నాడు.

పగటిపూట తను ఆఫీసుకు వెళితే ఎవరికన్నా తెలుస్తుంది. అదీగాక పోలీసులకు ఈ విషయం తెలిస్తే ఎవరో ఒకరు తన ఆఫీసురూందగ్గిర కాపలా కాస్తూ ఉంటారు.

ఉదయం ఆరుగంటల సమయంలో లాడ్జింగ్‌నుంచి బయటకు వచ్చాడు కిరణ్. ఇంకా సొంతం తెల్లవారలేదు. మసక చీకటిగా ఉన్నది.

పక్కనే ఉన్న టాక్సీని పిలిచి అడ్రసు చెప్పాడు. ఆ అడ్రసు ప్రకారం పోతే తన ఆఫీసు ఉన్న వీధిలోంచి వెళుతుంది టాక్సీ. అప్పుడు చూడవచ్చు, తన ఆఫీసు దగ్గిర ఎవరన్నా పోలీసు కాపలా వున్నాడేమోనని.

టాక్సీ కిరణ్ ఆఫీసు రోడ్డులోకి తిరిగింది. నిటారుగా కూర్చున్నాడు కిరణ్. హెడ్ లైట్స్ కాంతిలో రెప్ప వేయకుండా తన ఆఫీసువైపు చూడసాగాడు. కాని అక్కడ ఎవ్వరూ కనిపించలేదు కిరణ్ కి.

కాని కిరణ్ ఆఫీసుకు ఎదురుగా వున్న టీ దుకాణంలో ఒక పోలీసు కూర్చొన్నాడు.

గుండె జల్లుమంది కిరణ్ కి.

ఆ పోలీసు తప్పకుండా తనకోసమే కూర్చొన్నాడు. ఎందుకయినా మంచిది, తను ఇక ఆ వీధిలోకి రాకూడదనుకున్నాడు.

తిరిగి టాక్సీని లాడ్జింగ్ వైపు పోనివ్వమన్నాడు.

లాడ్జింగ్ కు చేరుకోగానే తన గదికి వెళ్ళి, కాలకృత్యాలు తీర్చుకొని, స్నానంచేసి, బ్రేక్ ఫాస్ట్ కావించాడు.

అప్పటికి పదిన్నర అయింది. ఈ పాటికి బ్యాంకు తెరిచే ఉంటారు అనుకొన్నాడు మనస్సులో.

గబగబా లేచి కాలకృత్యాలు తీర్చుకొని పదకొండు గంటలకల్లా తయారయ్యి బ్యాంకికి బయలుదేరాడు— కానీ—

అంతలో ఇంకో అనుమానం వచ్చింది. ఈ సంగతి బ్యాంకివాళ్ళకి కూడ తెలిసిందేమో?

అవును. ఎందుకయినా మంచిది. తను పోకుండా చెక్ రాసి యిచ్చి ఎవరినన్నా పంపిస్తే....? గుడ్....గుడ్.... అయిడియా.... ఎవర్ని పంపాలి?

వెంటనే రూమ్‌బాయ్ జ్ఞాపకం వచ్చాడు. 'ఏమో వాడు ఆ డబ్బు తీసుకొని ఎటన్నా పారిపోతే' అనుమానమొచ్చింది కిరణ్ కి.

ఆఁ! అంత తేలికగా ఎక్కడికి పోతాడు. వాడి వెనకాలే

టాక్సీలో తను కూడా వెళ్ళి బ్యాంకికి కొద్దిదూరంలో ఉంటే సరి. వాడు బయటకు రాగానే డబ్బు తీసుకోవచ్చు అనుకొని రామ్‌బాయ్‌ని కేకేసాడు.

రామ్‌బాయ్‌కి పది రూపాయలు ఇస్తానని ఆశ చూపించి, చెక్కు వాడి చేతిలోపెట్టి చెక్కు ఎక్కడ ఇవ్వాలో, డబ్బు ఎక్కడ తీసుకోవాలో, అన్ని వివరంగా చెప్పి, తన దగ్గిర ఉన్న చిన్న హాండ్‌బ్యాగు యిచ్చి పంపాడు కిరణ్.

రామ్‌బాయ్ కిందకు వెళ్ళగానే అయిదు నిమిషాల తరువాత కిరణ్ కూడ బయటకు వచ్చి టాక్సీ ఎక్కి బ్యాంకి దగ్గరకు బయలుదేరాడు.

బ్యాంకికి అరఫర్లాంగు దూరంలో టాక్సీని ఆపించి, బ్యాంకివైపే చూస్తూ కూర్చోసాగాడు.

పావుగంట గడిచింది. రామ్‌బాయ్ మటుకు బ్యాంకిలోంచి ఇంకా బయటకు రాలేదు.

కిరణ్ మనస్సు కీడు శంకించసాగింది.

మరో అయిదు నిముషాలకు రామ్‌బాయ్ బ్యాంకిలోంచి బయటకు రావడం కనిపించింది. ఒక్కసారిగా విప్పారింది కిరణ్ వదనం.

రామ్‌బాయ్ హ్యాండ్‌బ్యాగ్ చంకలో యిరికించుకొని బీడి వెలిగించుకొని మెల్లిగా నడవసాగాడు.

రామ్‌బాయ్ టాక్సీ సమీపంలోకి రాగానే పిలిచాడు కిరణ్.

"సార్! మీరు యిక్కడే ఉన్నారా! చెక్కుమీద సంతకం సరిగా లేదట. సరిచేసుకు రమ్మని పంపారు." అన్నాడు రామ్‌బాయ్ చెక్కు కిరణ్‌కి అందిస్తూ.

ఆతృతగా చెక్కుమీద సంతకంవైపు చూసాడు కిరణ్. దాంట్లో తప్పు ఏమీలేదు. మరి ఎందుకు తిప్పి పంపించారు?

అర్థంకాక ఆ చెక్కువైపే చూడసాగాడు. బహుశ రూమ్ బాయ్ వాళ్ళకి కొత్తగా కనిపించి ఉంటాడు. అందుకని తిప్పి పంపారేమో అనుకొన్నాడు.

అంతలో—

"మిష్టర్ కిరణ్! కారులోంచి బయటకు రా!" గంభీరంగా వినిపించింది ఎవరివో కంఠం.

ఒక్కసారి అదిరిపోయాడు కిరణ్. తల ఎత్తి బయటకు చూసాడు. బయట ఉన్నది మఫ్టీలో ఉన్న పోలీసు అని గుర్తు పట్టడానికి ఎంతోసేపు పట్టలేదు కిరణ్‌కి. ఏం చేయాలో తెలియక బిత్తరపోయి చూడసాగాడు.

అంతలో పోలీసుజీప్ వచ్చి ఆగింది. అందులోంచి ఇన్‌స్పెక్టర్, ఖర్మవీర్ ఇద్దరు దిగారు.

కిరణ్ అరెస్టు చేయబడ్డాడు.

కిరణ్ పోలీసులకు పట్టుబడ్డా కూడా డబ్బు ఏం చేసింది చెప్పలేదు. ఎక్కడ దాచింది చెప్పలేదు. కిరణ్ ఆ వెధవ పనిచేసింది, తన కుటుంబం కోసం, కిరణ్ మళ్ళీ కాన్పూరు వచ్చేటప్పుడు తన దగ్గిర ఉన్న డబ్బంతా తల్లికి యిచ్చి వచ్చాడు. అతన్ని ఎన్ని హింసలుపెట్టినా, ఆ డబ్బు ఎవరికి యిచ్చింది చెప్పలేదు.

జైల్లో ఉన్న వారం రోజులు కిరణ్ అనుభవించని హింస లేదు.

చివరకి ఒక రోజున జైలు వార్డనుని ఏమార్చి జైలులోంచి తప్పించుకొన్నాడు. కానీ పోలీసులకు ఈ విషయం తెలిసి కిరణ్‌ని వెంబడించారు. కాల్పులు జరిపారు. ఆ కాల్పులలో కిరణ్ ప్రాణాలు అనంతవాయువుల్లో కల్సిపోయాయి.

***

ద్రోహికి శిక్ష

ఎల్. రామగోపాల్

తలుపు తట్టిన శబ్దం విన్పించింది.

"ఎవరు?" సుమతి గుండెల్లో దాచుకున్న తలను కొద్దిగా పైకెత్తి అడిగాడు భాస్కరం.

"నేను!" నెమ్మదిగా విన్పించింది పరంధామయ్య కంఠం.

భాస్కరం విసుగ్గా మంచం దిగి లుంగీ సరిచేసుకొని తలుపు తెరిచాడు.

"నీతో కొంచెం...." పరంధామయ్య మాటలు మధ్య లోనే ఆగిపోయాయి.

"ఎందుకొచ్చావిక్కడికి? డబ్బుకోసమేగా? దీనికైనా సమయం సందర్భం ఉండాలి! వెధవ డబ్బు! ఎప్పుడూ పీడించుకు తినడమేనా?" కోపంగా అడిగాడు భాస్కరం, తండ్రివైపు చూస్తూ.

పరంధామయ్య మాట్లాడలేదు. బిక్కచచ్చిపోయి, సిగ్గుతో తల వంచుకున్నాడు. ఎంతో గౌరవంగా బ్రతికిన తను, ఈనాడు, ఈ అవసానదశలో, కన్నకొడుకుముందు ఇంత నికృష్టమైన స్థితిలో నిలబడతానని అనుకోలేదు.

"ఎంత కావాలో చెప్పు!" పర్సు బైటకుతీసి అడిగాడు భాస్కరం.

"కంటి మందు తెచ్చుకోవాలి! పది రూపాయలు చాలు!" ఆత్మాభిమానాన్ని అణచుకొని పరంధామయ్య గొంతులోంచి బైటకు వచ్చాయి మాటలు.

"ఇదిగో! ఇప్పుడల్లా అడక్కు! నా దగ్గిర లేవు!" అంటూ పది రూపాయల నోటు తండ్రి చేతిలో పెట్టి విసురుగా తలుపులు మూసుకున్నాడు.

పరంధామయ్య చిన్నగా నిట్టూర్చి వెనక్కు తిరిగాడు.

"ఎందుకండీ! మామగార్ని అంత చులకనగా చూస్తారు? ఆయన ఎంత బాధ పడతారో ఏనాడైనా ఆలోచించారా?" అంది సుమతి, భాస్కరం దగ్గరకు రాగానే.

"ఏమిటి ఆలోచించేది? నీ సంగతి, ఆయన సంగతి! ఇరవైనాల్గు గంటలు ఇలా డబ్బుకోసం పీడిస్తుంటే ఎవడు మాత్రం భరిస్తాడు:" విసుగ్గా అడిగాడు భాస్కరం సిగరెట్ వెలిగిస్తూ.

సుమతి ఒక్కక్షణం పరిశీలనగా భర్త మొహంలోకి చూచింది.

"మీలో ఇంత కాఠిన్య ముంటుందని, జన్మనిచ్చిన తండ్రినే ఇంత చులకనగా చూసే సంస్కారహీనులని అనుకోలేదు! అసలు...." మాటల మధ్యలోనే సుమతి చెంప అదిరిపోయింది.

"ఇడియట్! నోటికొచ్చినట్లల్లా వాగకు. నేను సంస్కార హీనుణ్ణా? సంస్కారవంతురాలివి నువ్వున్నావుగా? పెట్టి పోషించు! తండ్రట! పెళ్ళామట! ఈసారి అధిక ప్రసంగం చేసావా నీ తోలు వొలిచేస్తాను జాగ్రత్త!" విసురుగా లేచి బైటకు వెళ్ళాడు భాస్కరం.

సుమతి తలగడలలో తల దాచుకొని మౌనంగా పడుకుంది.

"వదినా!" పిలిచింది సరళ.

తలెత్తి చూచింది సుమతి.

"నే నంతా విన్నాను వదినా! కాని వినాలని వినలేదు. కాకతాళీయంగా వినవలసి వచ్చింది. అన్నయ్య ఇలా మారిపోతాడని, నాన్నని, నిన్ను ఇంత నీచంగా చూస్తాడని అనుకోలేదు. అన్నయ్య ప్రవర్తనకు చాల కుమిలిపోతున్నాను వదినా!"

"బాధ పడకు సరళా! మీ అన్నయ్య ఏనాటికైనా మారే రోజు వస్తుందని ఆశిద్దాం!" అంది సుమతి ధైర్యం చెబుతూ.

సరళ చిన్నగా పెదిమ విరిచి, "నీకో విషయం చెప్పాలి వదినా!" అంది నెమ్మదిగా.

"ఏమిటో చెప్పమ్మా!"

"కాని నువ్వు అన్నయ్యను అడగనని, ఎవ్వరికీ చెప్పనని చెప్తే చెబుతాను!"

"అలాగే చెప్పు!"

"అన్నయ్యకు వనజ అనే అమ్మాయితో సంబంధం ఉంది వదినా! రెండుమూడుసార్లు ఇద్దర్నీ బజార్లో చూచాను. నా స్నేహితురాలు ఒకామె చూచి చెప్పింది. అన్నయ్య ప్రతి

ఆదివారం ఆవిడ ఇంటికి వెళతాడట ..." మాటలు మధ్య లోనే ఆపి వదిన మొహంలోకి చూచింది సరళ.

సుమతి మాట్లాడలేదు. సరళ చెప్పేది వింటూ మౌనంగా కూర్చుంది.

"వదినా!" పిలిచింది సరళ.

"ఊఁ!" ఉలిక్కిపడింది సుమతి.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

"ఏమీలేదు. నువ్వేదో చెబుతున్నావుగా! పూర్తిగా చెప్పు." అంది నెమ్మదిగా.

"సారీ వదినా! అసలు నీకీ విషయం చెప్పకూడదను కున్నాను. కాని అన్నయ్య మరింత చెడిపోతాడేమోనని ముందుజాగ్రత్తకోసం చెప్పవలసివచ్చింది. వనజకు ఈ మధ్యనే అన్నయ్య ఒక నెక్లెస్ కూడ చేయించాడట."

"ఇక చాలు" ఆవేశంగా అరిచింది సుమతి.

సరళ భయంగా చూచింది వదినవైపు.

"సరళా! నన్ను కాస్సేపు ఒంటరిగా ఉండనివ్వు." అంది సుమతి ప్రాధేయపూర్వకంగా.

సరళ మౌనంగా లేచి వెళ్ళిపోయింది.

2

"వనజ ఎవరు?"

కోటు విప్పుకుంటున్న భాస్కరం, భార్య ప్రశ్నకు ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు.

సుమతి కాఫీ కప్పుతో ఎదురుగా నిలబడివుంది.

కోటు స్టాండుమీదకు నిర్లక్ష్యంగా విసరి, కాఫీ అందు కుంటూ, "అయితే నీకూ తెలిసిందన్నమాట!" అన్నాడు నిర్లక్ష్యంగా.

"ఇలాంటివి ఎప్పటికీ దాగవు! చెప్పండి ఆ వనజ ఎవరు?"

పకపక నవ్వాడు భాస్కరం. "నువ్వు మాత్రం కాదు. వనజ ఒక దేవత. ప్రేమస్వరూపిణి. నా సర్వస్వాన్ని తన సర్వస్వంగా ఎంచే ఒక ప్రేమమయి!" అన్నాడు కాఫీ త్రాగుతూ.

సుమతి కళ్ళు నిప్పులు చెరిగాయి.

"అయితే నాకేనన్నమాట మీమీద ప్రేమ లేనిది?"

నవ్వాడు భాస్కరం. "లేదని చెప్పలేదు. నీకు, వనజకు చాల వ్యత్యాసం ఉంది. పెళ్ళి వేరు, ప్రేమ వేరు. పెళ్ళి బంధాన్ని సృష్టిస్తుంది, ప్రేమ మనసుని బంధిస్తుంది. నీకు, ఆమెకు పోలిక ఏమిటి?"

"ఆపండి:" గర్జించింది సుమతి.

విచిత్రంగా చూచాడు సుమతివైపు.

"మీ వితండ నిర్వచనాలు కట్టిపెట్టండి. మీ భాష్యాలు, సంజాయిషీలు వినదల్చుకోలేదు నేను! మర్యాదగా ఆ వనజను మరచిపొండి!" హెచ్చరించింది.

హేళనగా నవ్వాడు భాస్కరం. "అలా జరగకపోతే?"

"మిమ్మల్ని మర్చిపోయే యోగం ఆమెకు కల్గిస్తాను!"

భాస్కరం ఉలిక్కిపడ్డాడు.

"యూ డెవిల్!" ఈడ్చి కాలితో సుమతి కడుపులో కొట్టాడు.

విరుచుకు పడిపోయింది సుమతి నేలమీద.

"ఇడియట్! నా ఇష్టం వచ్చినట్లు తిరుగుతాను. నువ్వెవరు నన్ను అడగడానికి. చచ్చినట్లు పడుండు. లేదా నీ రక్తం కళ్ళచూస్తాను!" విసురుగా బైటకు వెళ్ళాడు భాస్కరం.

పది నిముషాల తర్వాత నౌఖరు పిలుపుతో తలెత్తింది సుమతి.

"మీ కోసం ఎవరో వచ్చారు!" చెప్పింది.

నీరసంగా లేచి, హాల్లోకి వెళ్ళింది సుమతి.

ఎవరో పాతికేళ్ళ యువకుడు కూర్చుని ఉన్నాడు కుర్చీలో.

"భాస్కరం భార్య మీరే అనుకుంటాను?" అన్నాడు లేచి నిలబడి.

సుమతి తల ఊపి, "ఏం కావాలి?" అడిగింది నెమ్మదిగా.

"మీ భర్తను మీరు అదుపులో ఉంచుకోకపోతే, మీ పసుపు కుంకుమలు చెరిగిపోతాయి." అన్నాడు కఠినంగా.

అదిరిపడింది. "ఏమిటి నువ్వనేది?" అడిగింది కోపంగా.

"అదే చెబుతున్నాను. నేను ప్రేమించిన వనజను మీ ఆయన వలలో వేసుకున్నాడు. ఆయన కల్లబొల్లి మాటలకు వనజ పూర్తిగా మోసపోయి లొంగిపోయింది. నా వనజ నాకు దక్కనినాడు, నాకు ఈ ప్రపంచంలో ఏమీ అవసరం లేదు. ఆ పరిస్థితిలో నీ భర్తను బ్రతకనివ్వను! ఆ విషయం గుర్తుంచుకోండి!" చకచక వెళ్ళిపోయాడు ఆ వ్యక్తి.

స్థాణువులా నిలబడి పోయింది సుమతి.

ఏమిటి ఈ రోజు ఇలా జరుగుతుంది? ఏం జరుగుతుంది తనకు? భారంగా కణతలు నొక్కుకుంటూ అలాగే కుర్చీలో కూలబడింది.

3

"నమస్కారం! నా పేరు సరళ. మీ సహాయం కోసం వచ్చాను!" అంది సరళ నమస్కరిస్తూ.

డిటెక్టివ్ హరగోపాల్ ప్రతి నమస్కారం చేసి.

"అలా కూర్చోండి!" అన్నాడు కుర్చీ చూపిస్తూ.

సరళ కుర్చీలో కూర్చుని కర్చీఫ్‌తో మొహం తుడుచుకుంది.

"ఇప్పుడు చెప్పండి. మీకేం సహాయం కావాలో!" అడిగాడు డిటెక్టివ్ హరగోపాల్ సిగరెట్ వెలిగిస్తూ.

సరళ ఒక్క క్షణం సందేహించి, "మా అన్నయ్యను హత్య చేసిందనే నేరంమీద మా వదినను పోలీసులు అరెస్టు చేసారు!" అంది నెమ్మదిగా.

"అలాకాదు. ఇంకా వివరంగా చెప్పండి!" అడిగాడు హరగోపాల్,

"మా అన్నయ్య పేరు భాస్కరం. 'అనితా' ఐస్ ఫ్యాక్టరీ మేనేజర్. మా వదిన పేరు సుమతి. ఈ మధ్య కొద్దిరోజులుగా వాళ్ళిద్దరిమధ్యా వాగ్వివాదాలు జరుగుతూ వచ్చాయి.

నిన్నరాత్రి అకస్మాత్తుగా మా అన్నయ్య పెద్దగా అరిచాడు. అందరం ఉలిక్కిపడి లేచి వెళ్ళాం! కాని అప్పటికే మా అన్నయ్య చనిపోయాడు. పోలీసులు వచ్చి పరీక్షించి, మా అన్నయ్యను హత్య చేసిందనే నేరం మీద మా వదినను అరెస్టు చేసారు!"

"నేనిప్పుడేం చెయ్యాలి!" అడిగాడు హరగోపాల్.

"మా వదిన నిర్దోషి. ఆమెకు ఎవ్వరినీ హత్య చేసేంత గుండె ధైర్యంలేదు. ఎలాగైనా సరే అసలు హంతకుడెవరో కనిపెట్టి, మా వదినను విడిపించాలి." అంది సరళ నెమ్మదిగా.

"పరిస్థితులు మనిషిని రాక్షసుణ్ణి చేస్తాయి. మీకు తెలియని ఏవైనా పరిస్థితులవల్ల నిజంగా మీ వదిన ఈ హత్యచేసి ఉంటే?" అడిగాడు హరగోపాల్.

సరళ తల అడ్డంగా ఊపింది. "మా వదిన సంగతి నాకు బాగా తెలుసు. ఆమె అలాంటి పని ఎన్నడూ చెయ్యదు. దయచేసి మీరు ఈ కేసు పరిశోధించండి. మీ పరిశోధనల వల్ల నిజంగా ఈ హత్య మా వదిన చేసిందని తెలిస్తే.... చేయగల్గిందేమీ లేదు!" అంది చిన్నగా నిట్టూర్చి.

నిముషం తర్వాత మళ్ళీ తనే అన్నది. "మేము అంత ధనవంతులం కాము. మీరు అడిగిన ఫీజు ఇవ్వలేకపోవచ్చు. కాని మా శక్తికొలది ఇవ్వడానికి ప్రయత్నిస్తాం!" అంది నెమ్మదిగా.

"నెవర్ మైండ్! నేను కేవలం డబ్బుకోసమే కేసులు పట్టను. మీరు ఫీజు ఇవ్వకపోయినా ఫర్వాలేదు. ఈ కేసు పరిశోధిస్తాను. బైదిబై! మీ అన్నయ్యను హత్యచేసే అవసరం, ఎవరికైనా ఉందా?" అడిగారు హరగోపాల్.

సరళ ఒక్క నిముషం తటపటాయించి, "మా అన్నయ్యకు 'వనజ' అనే అమ్మాయితో సంబంధం ఉంది. ఈ విషయం నేను మా వదినకు చెప్పాను. ఆరోజు రాత్రి వాళ్ళిద్దరూ ఈ విషయాన్ని గురించి పోట్లాడుకోవడం విన్నాను. ఆ తర్వాత ఎవరో వ్యక్తి వచ్చి మా వదినను బెదిరించి పోయాడట. మా వదిన చెప్పింది!"

"ఏమని బెదిరించాడట?"

"అతను వనజను ప్రేమించాడట. తన ప్రియురాలిని మా అన్నయ్య వలలో వేసుకున్నాడట. మా అన్నయ్య గనక వనజను మర్చిపోకపోతే, అన్నయ్యను చంపుతానని బెదిరించి వెళ్ళిపోయాడట."

హరగోపాల్ తల ఊపి, "అతని పేరు, వివరాలు ఏమైనా తెలుసా?" అడిగాడు.

"పేరు తెలియదు. అతనూ చెప్పలేదట. కాని ఎర్రగా, సన్నగా ఉంటాడట. కుడికంటి క్రింద నల్లటి పుట్టుమచ్చ ఉందట! ఈ విషయాలు మా వదిన చెప్పింది" అంది సరళ.

డిటెక్టివ్ హరగోపాల్ తల ఊపి, "మీ అడ్రస్సు ఇచ్చి వెళ్ళండి! వీలయితే మళ్ళీ కలుస్తాను!" అన్నాడు.

సరళ అడ్రస్సు వ్రాసిచ్చి, నమస్కరించి వెళ్ళిపోయింది.

4

"హల్లో రఘూ! నేను హరగోపాల్ మాట్లాడుతున్నాను."

"గుడ్ మార్నింగ్. ఏమిటి విశేషం?" అడిగాడు ఇనస్పెక్టర్ రఘు.

"ఏమీలేదు. భాస్కరం హత్యకేసు పరిశోధిస్తున్నాను. సుమతిని అరెస్ట్ చేసావటగా? కాస్త వివరాలు చెబుతావేమో నని!" అన్నాడు హరగోపాల్.

"వెరీసారీ హరగోపాల్! మీరీ కేసు తీసుకోకుండా ఉండవలసింది. ఎందుకంటే, సుమతి ఈ హత్య చేసినట్లు కావలసినన్ని సాక్ష్యాలు ఉన్నాయి" అన్నాడు ఇనస్పెక్టర్ రఘు.

హరగోపాల్ తలఊపి, "పోస్టుమార్టం రిపోర్టు వివరాలు చెప్పగలవా?" అడిగాడు.

"ష్యూర్! మీకంత ఇంటరెస్టుగా ఉంటే, అన్ని వివరాలు చెబుతాను.

"మొన్న సాయంత్రం సుమతి 'ఫాల్స్ ప్రిస్క్రిప్షన్' ద్వారా ఒక మందుల షాపులో 'ఆర్సెనిక్' కొన్నట్లు రుజువయింది. ఆ విషయం కూడా ఆమె ఒప్పుకుంది. కాని ఎందుకు అనే విషయం చెప్పలేదు. పోతే భాస్కరం హత్య జరిగే ముందురోజు, భార్యాభర్తలు బాగా పోట్లాడుకున్నారు.

అందులో సుమతి తన భర్తను బెదిరించినట్లు పని మనుషులద్వారా తెల్సింది. అదీగాక భాస్కరానికి ఇంకో స్త్రీతో సంబంధం ఉన్నట్లు సుమతికి తెల్సు. ఇవి చాలవూ సుమతే, భాస్కరాన్ని హత్య చేసిందనడానికి?

ఇక పోతే, పోస్టుమార్టం రిపోర్టు చాలా విచిత్రంగా ఉంది. భాస్కరం శరీరంలో 'ఆర్సినిక్' లాంటి విషం ఏమీ లేదట. కాని 'అట్రోఫైన్' డోస్ ఎక్కువ కావడం వల్ల వెంటనే మరణం సంభవించి ఉండవచ్చని డాక్టరు రిపోర్టు ఇచ్చాడు.

ఇంకో విషయం ఏమిటంటే, 'అట్రోఫైన్' పొటెంట్ పాయిజన్ అనీ, కాని అది డైరెక్టుగా వాడిన సూచనలు లేవని రిపోర్టులో వ్రాశాడు. 'అట్రోఫైన్' కల్సిన ఏదైనా మందును, డోసేజ్ ఎక్కువ కలిపి హతుడిచేత త్రాగించి ఉండాలని, అందువల్లే మరణం సంభవించిందని, కాని, ఆ మందు ఏమైనదీ తెల్సుకోవడం అసాధ్యం అని రిపోర్టులో వ్రాశారు!" అన్నాడు రఘు.

డిటెక్టివ్ హరగోపాల్ రెండు నిముషాలు మౌనంగా ఉండి, "ఆల్ రైట్ మిస్టర్ రఘు! అవసరం అయితే మళ్ళీ ఫోన్ చేస్తాను" అన్నాడు ఫోన్ పెట్టేస్తూ.

ఐదు నిముషాలపాటు తీవ్రంగా ఆలోచించి లేచి నిలబడ్డాడు డిటెక్టివ్ హరగోపాల్. 'కాడిలాక్' బైటకు తీసి సరళ ఇంటివైపు పోనిచ్చాడు.

సరళ ఇంటిదగ్గర కారాపి క్రిందకు దిగి లోపలకు నడిచాడు.

"నమస్కారం! మీరా! రండి! రండి!" హరగోపాల్‌ను చూడగానే ఆహ్వానించింది సరళ.

"ఇంట్లో ఎవ్వరూ లేరా?" అడిగాడు హరగోపాల్ కుర్చీలో కూర్చుంటూ.

"మా నాన్నగారు, పనిమనిషి, నౌకరు ఉన్నారు. నాన్న గార్కి కంటిజబ్బు. చూపు సరిగ్గా కన్పించదు. ఆ గదిలో ఉన్నారు. రండి! పరిచయం చేస్తాను." అంది లోపలికి నడుస్తూ.

హరగోపాల్ ఆమెను అనుసరించాడు.

అంత పెద్ద గది కాకపోయినా విశాలమైన గది అది. గదిలో వస్తువులన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయి. గదిలో ఒక మూలగా మంచంమీద పడుకొని ఉన్నాడు పరంధామయ్య. మంచం పక్కగా చిన్న స్టూలుమీద మందు సీసాలు, గ్లాసులు ఉన్నాయి.

"నాన్నా! నేను చెప్పానే! డిటెక్టివ్ హరగోపాల్‌గారని! ఆయన వచ్చారు!" అంది.

పరంధామయ్య లేచి కూర్చుని, "నమస్కారం! రండి! మీ పేరు విన్నానుగాని ఎప్పుడూ చూడలేదు. దయచేసి అలా కూర్చోండి!" అన్నాడు ఆప్యాయంగా.

హరగోపాల్ ప్రతినమస్కారం చేసి, ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు. "మీ అబ్బాయి హత్య గురించి కొన్ని వివరాలు కావలసి వచ్చాను!" అన్నాడు హరగోపాల్ ఉపోద్ఘాతంగా.

పరంధామయ్య మొహం గంభీరంగా మారిపోయింది. "చనిపోయిన వాడ్నిగురించి చెడ్డగా అనుకోకూడదంటారు. కాని, నీచుడు! బ్రతికినంతకాలం అందరి ఉసురుపోసుకున్నాడు. వాడు చచ్చినందుకు బాధలేదు కాని, అన్నెపున్నెం ఎరుగని సుమతి బ్రతుకు నాశనమైపోయింది. దయ ఉంచి

ఎలాగైనా ఆమెను కాపాడండి" అన్నాడు పరంధామయ్య దీనంగా.

"నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. కాని నాకు కొన్ని వివరాలు కావాలి!" అడిగాడు హరగోపాల్.

"అడగండి! నాకు తెల్సినంతవరకు చెబుతాను."

"మొన్న సాయంత్రం, అంటే మీ అబ్బాయి హత్య ముందురోజు, మీ కోడలు సుమతి 'ఆర్సినిక్' మందుల షాపులో కొన్నదట. ఈ విషయం మీకు తెలుసా?" అడిగాడు హరగోపాల్.

పరంధామయ్య, సరళ ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

"ఆర్సినిక్ కొన్నదా? ఆ విషయం మాకు తెలియదు. అయినా అసలు విషం ఎందుకు కొన్నది?" ఆశ్చర్యంగా అడిగారు ఇద్దరూ.

"హరగోపాల్‌గారు, డాక్టరు రిపోర్టు నాకు తెల్సింది. మా అబ్బాయి 'ఆర్సినిక్' వల్ల కాదుగదా మరణించింది. మరి సుమతి ఆ విషం తెచ్చి ఏంచేసింది?" అడిగాడు పరంధామయ్య.

"అదే తెల్సుకోవాలి! మీ నౌకర్లను ఇలా పిలవండి" అన్నాడు.

సరళ వెళ్ళి రెండు నిముషాల్లో ఇద్దర్నీ తీసుకొచ్చింది.

"ఇతను నౌకరు గంగన్న. ఈమె సుబ్బులు. వంటపనీ ఇంటిపని చూస్తుంటుంది" చెప్పింది సరళ.

డిటెక్టివ్ హరగోపాల్ ఇద్దరివైపు పరీక్షగా చూచాడు. గంగన్న నల్లగా బలిష్టంగా ఉన్నాడు.

సుబ్బులుకు ముప్పైఏళ్ళుంటాయి. అంత అందగత్తె కాకపోయినా, ఆకర్షణీయంగా ఉంది.

"మీ అమ్మగారు విషం కొన్నట్లు మీకెవరికైనా తెలుసా?"

అడిగాడు ఇద్దరివైపు చూస్తూ.

ఇద్దరూ తల అడ్డంగా ఊపారు.

"షోనీ, మీ అయ్యగారు చనిపోయిన రోజు, ఏం జరిగిందో విపులంగా చెబుతారా?" అడిగాడు హరిగోపాల్.

"నాకేమీ తెలియదుబాబూ. నేను తోటపని చూస్తుంటాను. ఆ రోజు అసలు అయ్యగార్ని నేను కలవనేలేదు. అర్ధరాత్రి అయ్యగారి అరుపులు విని లేచివెళ్ళాను అంతే!" అన్నాడు గంగులు గాభరాగా.

సుబ్బులు వైపు చూచాడు హరగోపాల్.

"ఆ రోజు సాయంత్రం అయ్యగారు బాగా త్రాగి వచ్చారండి. రాగానే వరండాలో మూలగా ఉన్న తన గదిలోకి వెళ్ళి పడుకున్నారు. కొంచెం సేపటి తర్వాత అమ్మగారు కూడా గదిలోకి వెళ్ళినట్లున్నారు. గదిలోంచి ఇద్దరూ బిగ్గరగా పోట్లాడుకోవడం విన్పించింది. పది నిముషాల తర్వాత అమ్మగారు బైటకు వచ్చేసారు! అంతే, ఆ తర్వాత అర్ధరాత్రి అయ్యగారు కేకలేసేవరకు నాకేం తెలియదు." అంది నెమ్మదిగా.

రెండు నిముషాల తర్వాత లేచి నిలబడ్డాడు హరిగోపాల్ "పరంధామయ్యగారూ! వస్తాను. మీ సుమతి నిర్దోషి అయితే తప్పక విడుదల చేస్తాను." అంటూ బైటకు వచ్చి సరళకు సైగ చేసాడు,

సరళ బైటకు రాగానే "సరళా! నాకు వనజ అడ్రసు కావాలి! ఎలా" అడిగాడు.

"వనజ అడ్రస్సు నాకూ తెలియదు. కాని నా స్నేహితురాలి అడ్రస్సు ఇస్తాను. ఆమెకు తెలుసు వనజ అడ్రస్సు!" అంటూ స్నేహితురాలి అడ్రస్సు వ్రాసి ఇచ్చింది.

"ఇంకో విషయం? ఏమీ అనుకోకు. మీ అన్నయ్యను

హత్య చేసేంత ద్వేషం మీ నాన్నగారికి ఉందా!" అడిగాడు నెమ్మదిగా.

పెదిమ విరిచింది సరళ. "అన్నయ్య అంటే నాన్న గారికి తగని కోపం. కాని కన్న కొడుకును హత్య చేసేంతటి కఠినాత్ముడుకాదు!" అంది దృఢంగా.

హరిగోపాల్ తల ఊపి పైటకు నడిచాడు.

5

"హల్లో! డాక్టర్ స్పీకింగ్ హియర్!"

"డాక్టర్! నేను హరగోపాల్‌ను మాట్లాడుతున్నాను. నాకు కాస్త ఇన్ఫర్మేషన్ కావాలి!" అడిగాడు హరగోపాల్.

"ష్యూర్! అడగండి చెబుతాను." అన్నాడు డాక్టర్ డేవిడ్ అవతలనుంచి.

"మీరు భాస్కరం శవం పరీక్ష చేసారు కదా! అతని శరీరంలో ఆల్కహాల్ కంటెంట్సు ఏమైనా ఉన్నాయా?" అడిగాడు.

"ఉన్నాయి! హత్య చెయ్యబడే ముందు అతను ఆల్కహాల్ పుచ్చుకొని ఉండాలి. ఎందుకలా అడిగారు?"

"డాక్టర్! అతడు ఆల్కహాల్‌తో కలిపి 'అట్రోపైన్' త్రాగి ఉండవచ్చా?" అడిగాడు హరగోపాల్.

"ఇంపాసిబుల్! అట్రోపైన్ త్రాగగానే వెంటనే మరణం సంభవిస్తుంది. కాని శవ పరీక్షలో తేలిందేమంటే. హత్యకు కొద్ది గంటల ముందు అతను ఆల్కహాల్ తీసు కొని ఉండాలి." అన్నాడు డాక్టర్ డేవిడ్.

"థాంక్స డాక్టర్. ఇంకో విషయం. ఈ 'అట్రోపైన్' పాయిజన్ విడిగా దొరుకుతుందా?" అడిగాడు.

"దొరకదు. 'అట్రోపైన్ సల్ఫేటూ' అని పేటంట్. ఇటీజ్ స్ట్రిక్ట్లీప్రోహిబిటివ్ ఫర్ సేల్! దాన్ని అథరైజుడు

డ్రగ్ మాన్యుఫాక్చరర్స్ కొన్ని మందులలో కలిపి వాడుతారు. ఇది సామాన్యంగా సున్నితమైన అవయవాల జబ్బులకు వాడుతారు. ఐ మీన్ గుండె జబ్బులకు, కంటిజబ్బులకు ఎముకల నొప్పికి వాడే మందులలో చాల తక్కువ మోతాదులో దీన్ని వాడుతారు. ఈ మందులు 'ప్రిస్క్రైబ్డ్' మోతాదుకంటే ఎక్కువగా వాడితే వెంటనే మరణం సంభవిస్తుంది!" చెప్పాడు డాక్టర్.

"మెనీథాంక్స్ డాక్టర్. మంచి ఇన్ఫర్మేషన్ ఇచ్చారు!" అంటూ ఫోన్ పెట్టేసి ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు హరగోపాల్.

డాక్టరు చెప్పిన ప్రకారం, భాస్కరాన్ని హత్య చెయ్యడానికి, వనజకుగాని, ఆమె ప్రియుడికిగాని అవకాశం లేదని తెలుస్తుంది. మరి ఈ హత్య చేసిందెవరు? భాస్కరాన్ని ఇంట్లో వాళ్ళే హత్యచేసి ఉండాలి. ఎవరు!

ఉలిక్కిపడ్డాడు హరగోపాల్. అతని మస్తిష్కంలో ఏదో మెరిసింది. అవును! అదీ 'పిల్ కార్ పెయిన్'మందు.

చటుక్కున లేచి వెళ్ళి మెడికల్ డిక్షనరీ తీసి 'పిల్ కార్ పెయిన్' గురించి చదివాడు.

రెండు నిముషాల తర్వాత చటుక్కున లేచి నిలబడి, టెలిఫోన్ రిసీవర్ ఎత్తి నెంబరు తిప్పాడు. నిముషం తర్వాత ఇనస్పెక్టర్ రఘు గొంతు విన్పించింది.

"మిస్టర్ రఘు! భాస్కరాన్ని హత్యచేసిన అసలు హంతకుడిని పట్టిస్తాను. వెంటనే పరంధామయ్య ఇంటికిరా." అని ఫోన్ పెట్టేసి చకచక బైటకు నడిచాడు.

సరళ ఇంటిముందు కారు దిగగానే, చకచక పరంధామయ్య గదిలోకి నడిచాడు.

"ఎవరు?" అడిగాడు పరంధామయ్య.

"నేను! హరగోపాల్‌ను!" అంటూ స్టూలుమీద ఉన్న మందు సీసాలవైపు చూచాడు. 'పిల్ కార్ పెయిన్' మందు సీసా ఉంది స్టూలుమీద. దాన్ని తనింతకుముందు చూచాడు. ఇప్పుడది అలాగే ఉంది.

"ఏమిటి? మా సుమతి విషయం ఏమైనా తెల్సిందా?" అడిగాడు ఆతృతగా.

హరగోపాల్ మాట్లాడలేదు. ఆలోచిస్తున్నాడు. ఈ 'పిల్ కార్ పెయిన్' ద్వారా భాస్కరాన్ని హత్యచేసే అవకాశం పరంధామయ్యకు ఉంది. కాని పరంధామయ్య హత్యచేసి ఉండడానికి వీల్లేదు. అతనికి చూపు సరిగ్గాలేదు. అర్ధరాత్రి పూట లేచి వెళ్ళి మందు కలిపి భాస్కరానికి ఇవ్వడం అసంభవం! మరి ఎవరు చేసారీ హత్య? గంగన్న చేసి ఉంటాడా? ఎందుకు?

చటుక్కున అతనికో ఆలోచన వచ్చింది. 'సరళా' పిలిచాడు.

నిముషం తర్వాత సరళ గదిలోకి వచ్చింది. "మీరా?" అడిగింది ఆశ్చర్యంగా.

"అవును! సుబ్బులును ఇలా పిలువ్!" అన్నాడు హరగోపాల్.

సుబ్బులు గదిలోకి వచ్చింది. సుబ్బులు వైపు పరీక్షగా చూచాడు హరగోపాల్.

"సుబ్బులూ! భాస్కరాన్ని హత్యచేసింది నువ్వేనని తెలుసు. మర్యాదగా నీ నేరం ఒప్పుకుంటే సరి! లేదా పోలీసులు నీ నోటిద్వారా చెప్పించవలసి వస్తుంది!" అన్నాడు కఠినంగా.

సుబ్బులు భయపడలేదు. "నాకు తెలుసు మీరు తెల్సు కుంటారని. అయినా నాకు భయంలేదు. నేను అన్నిటికి సిద్ధపడే ఉన్నాను. అవును! భాస్కరాన్ని చంపింది నేనే! నీచుడు. నన్ను లొంగదీసుకొని, నా సర్వస్వాన్ని దోచు కున్నాడు. తత్ఫలితంగా నాకు గర్భం వచ్చింది. గర్భం పోగొట్టుకోడానికి అతన్ని డబ్బు ఇవ్వమని అడిగాను. పిసినారి! పైసా ఇవ్వలేదు సరికదా ఇంట్లోనుంచి తరిమేస్తా నని చెప్పాడు.

అతన్ని చంపాలనే ఆలోచన నాకు అప్పుడే కల్గింది. నా సర్వస్వాన్ని అతనికి ఇచ్చాను. కాని అతనుమాత్రం డబ్బు దగ్గర గడ్డి తిన్నాడు. ఇలాంటివాడ్ని బ్రతకనివ్వకూడదని పించింది. అందుకే అతన్ని హత్య చెయ్యాలని నిర్ణయించు కున్నాను.

పరంధామయ్యగార్ని తీసుకొని రెండు మూడుసార్లు డాక్టరు దగ్గరకు వెళ్లాను. ఒకసారి డాక్టరుగారు ఈ మందు గురించి చెప్పడం విన్నాను. ఈ మందు డోస్ ఎక్కువైతే వెంటనే మరణం సంభవిస్తుంది.

భాస్కరం త్రాగివచ్చి ఆ గదిలో పడుకోగానే,ఈ మందు తీసుకువెళ్ళి, అతని మంచంక్రింద ఉన్న గ్లాసులో పోసి పెట్టాను. నాకు తెలుసు ప్రతిరోజు రాత్రిపూట భాస్కరం లేచి నీళ్ళు త్రాగుతాడని. నేను అనుకున్నట్లే భాస్కరం అవి నీళ్ళనుకొని త్రాగాడు. నా కసి తీరింది!" అంది సుబ్బులు నిర్భయంగా.

పరంధామయ్య, సరళ నిశ్చేష్టులై ఆమె మాటలు వింటుండిపోయారు.

డిటెక్టివ్ హరగోపాల్ లేచి నిలబడ్డాడు. ఇంతలో పోలీసులు వస్తున్న శబ్దం వినిపించింది.

***



సీరియల్

(గత సంచిక తరువాయి)

"గ్రాండ్ సక్సెస్ బాస్! మరో నాలుగు గంటలలో కనక పురి నిండా హత్యలు, దోపిడీలు, మాన భంగాలు విచ్చలవిడిగా సాగుతాయి. వీధులలో రక్తం పారుతుంది. మొత్తం సర్వనాశనం అయిపోతుంది. వెంటనే ఆ వార్తలు దేశమంతట వ్యాపిస్తాయి. రేపటివరకు మొత్తం దేశంలో మారణ హోమం జరగడం తథ్యం!" చెప్పాడు మిస్టర్ ఫైవ్ రూపంలో వున్న ధర్మేంద్ర.

"వెరీగుడ్ మిస్టర్ ఫైవ్! మరి నంబర్ ట్వంటీ రాలేదే?" అనుమానంగా ప్రశ్నించాడు X లైట్.

"ఎక్స్‌క్యూజ్‌మి బాస్! అక్కడ కల్లోలాలు బాగా రేగిన సమయంలో విలువైన వస్తువులను దోచుకురమ్మని అక్కడే వుంచాను. క్షమించండి బాస్" అన్నాడు ధర్మేంద్ర.

"నో మిష్టర్ ఫైవ్! యు ఆర్ ఏ బ్రిల్లియంట్! చాలా మంచిపని చేశావ్! నీ వంత సామర్థ్యం గలవాడివని నాకు

తెలుసు మిస్టర్! అందుకే నీకు మరో ముఖ్యమైన కార్య క్రమం అప్పగించ బోతున్నాను."

"థ్యాంక్యూ బాస్! మీ అభిమానానికి కృతజ్ఞుడను" అన్నాడు ధరేంద్ర.

X-లైట్ తిరిగి చెప్పసాగాడు.

"డియర్ ఫ్రండ్స్ అండ్ లైట్స్! రేపు సూర్యోదయా నికి మన కార్యక్రమమంతా జయప్రదంగా ముగించ బడు తుంది. ఇందులో యిక సందేహాలకు తావులేదు. రేపు ఉదయం సూర్యునితోబాటు, మన నూతన విప్లవ ప్రభుత్వం కూడా ఉదయిస్తుంది. ఈ సందర్భంలో మన మొక ముఖ్య మైన కార్యక్రమాన్ని నిర్వహించవలసి వుంటుంది" ఒక్క క్షణం ఆగాడు X-లైట్.

కుతూహలంగా అంతా చెవులు రెక్కించారు.

"రేపు వేకువఝామున నాలుగు గంటలకు మద్రాస్‌నుండి స్పెషల్ రైలు వస్తోంది. ఇక్కడ జరుగబోవు అఖిలభారత రాజకీయ నాయకుల సమావేశంలో పాల్గొనేటందుకు వివిధ రాజకీయ నాయకులంతా వస్తున్నారు. రేపు ఆ రైలు గమ్య స్థానాన్ని చేరుకో గూడదు."

అంతా ఊపిరి బిగపట్టారు.

"ఆ రైలు కనకపురి సమీపంలో గల కృష్ణా బ్యారేజి వద్ద గల రైలు వంతెనపై రాగానే, వంతెనతోబాటు రైలు కూడా బూడిద కావాలి. రైలులోని వారందరూ పరలోకానికి పయనం కట్టాలి. ఏ ఒక్కరు మిగలకూడదు" తాపీగా చెప్పాడు X-లైట్.

"మరో రెండు గంటలో మీరు మన బోట్ హౌస్‌లో సమావేశం కండి. అక్కడ మిస్టర్ ఫైవ్, మీకు తుది

కార్యక్రమం అందజేస్తాడు మిష్టర్ షైప్ మీరు మీ గది లోకి వెళ్ళండి. కొద్ది సేపటిలో మీకు తుదిమెరుగులు దిద్దిన ప్లాన్ అందచేయబడుతుంది" చెప్పాడు X-లైట్.

"ఓ కె బాస్!" అన్నాడు ధరేంద్ర.

"ఆల్‌రైట్ ఫ్రండ్స్! ఇకమీరు వెళ్ళవచ్చు. గుడ్‌బై" అన్నాడు X లైట్. అప్పటివరకు వెలుగుతున్న గ్రీన్‌లైట్ ఆరి రెడ్‌లైట్ వెలిగింది. రెండు నిమిషాలలో రెడ్‌లైట్ కూడా ఆరిపోయింది. హాలులో లైట్లు వెలిగాయి.

అంతా బయటకు వెళ్ళిపోసాగారు.

ధరేంద్ర, మురళిని చేయిపట్టుకుని తన గదిలోకి తీసుకు వెళ్ళాడు.

"డియర్ మురళీ, ఏ క్షణంలోనైనా మన మోసం బయటపడవచ్చు! మనం అందుకు సిద్ధంగా వుండాలి. నువ్వు వెంటనే పోలీస్ కమిషనర్‌ను కలుసుకో. అతనికి విషయం తెలియపర్చు. సరిగ్గా మరో రెండు గంటలలో బోట్ హౌస్‌లో సమావేశమవబోయే లైట్‌రాకెట్ సభ్యులందర్నీ బంధించ మని చెప్పు.

ఇప్పుడు ఇక్కడి సభ్యులలో కనీసం పదిమంది మన ...జంట్లు వారివేషాలలో వున్నారు. వాళ్ళ సహకారంతో ఏ ...క్కరినీ విడువకుండా బంధించాలి. ఇనస్పెక్టర్ రంజన్‌ను ...లీసులతో సహా ఇక్కడకు వచ్చి దాడిచేయమని చెప్పు. ...కపోతే X-లైట్ తప్పించుపోకుండా అన్నిమార్గాలు ...ట్టుదిట్టం చేయండి. సరిహద్దు రక్షకదళ విమానాలకు ...చ్చరికలు పంపండి. నువ్వు ఓ హెలికాప్టర్‌లో రెడీగా ...ండాలి, గగనాన్ని కనిపెడుతూ. ఒక పవర్‌ఫుల్ మాగ్నెట్ ...డా అందుబాటులో వుంచు. అందరికీ క్విక్ వైర్‌లెస్

మెసేజ్ పంపండి," చెప్పాడు ధర్మేంద్ర.

"సార్, మన ప్రయత్నాలను పసిగట్టి X-లైట్ బోట్ హౌస్‌లో సమావేశాన్ని రద్దుచేసినట్లు సభ్యులకు తెలియ పరిస్తే?"

"నో. X-లైట్‌కు ఎక్కువగా టైంలేదు. రెండు గంటలేకదా! అదీగాక ప్రస్తుతం ఇక్కడినుండి బయటకు వార్తా సంబంధాలను విచ్ఛిన్నం చేశాను. అతనికి ప్రస్తుతం అనుమానం కలగకుండా ఇంటర్ కమ్యూనికేషన్ మాత్రం భగ్నం చేయకుండా వుంచాను," చెప్పాడు ధర్మేంద్ర.

"ఓ. కె. సార్! మీరుమాత్రం చాలా జాగ్రత్తగా వుండండి," అంటూ బయటకు వెళ్ళిపోయాడు మురళి.

ఆలోచనలతో సతమతమవుతున్న ధర్మేంద్ర ఫోన్ మ్రోతకు చిన్నగా ఉలిక్కిపడి రిసీవర్ ఎత్తాడు.

"మిష్టర్ ఫైవ్! వెంటనే రూం నంబర్ X-లో నన్ను కలుసుకో" X-లైట్ కంఠం గంభీరంగా విన్పించింది.

"ఓ. కె. బాస్!" అంటూ ఫోన్ పెట్టేశాడు ధర్మేంద్ర.

X-లైట్ గదిలోకి అడుగుపెట్టగానే అదిరిపోయాడు ధర్మేంద్ర.

తను ఎవరినైతే బంధించి అతని వేషంలో వున్నాడో, అతనే కర్కశంగా నవ్వుతూ రివాల్వర్ పట్టుకొని ఎదురుగా నిలబడి వున్నాడు. X-లైట్ సిగరెట్ త్రాగుతూ నిర్ల క్ష్యంగా నవ్వుతూ ప్రక్కనే నిలబడి వున్నాడు.

"చాలా పొరబాటుపడ్డాను మిష్టర్ ధర్మేంద్ర! నో, నేను పొరబాటు పడటమేకాదు, నువ్వు చాలా తెలివిగా ప్రవర్తిం చావు. ఇప్పుడే నీ నిజస్వరూపం తెలుసుకున్నాను. నీవు తెచ్చిన వజ్రాలు నకిలీవని, రామ్మూర్తి ఏమీ రహస్యం

చెప్పలేదని, కనకపురిలో అసలు గొడవలు జరగలేదని కూడా తెలుసుకున్నాను. అయినా ఫర్వాలేదు. అంతిమ కార్యక్రమానికి ముందే నీ అంతు చూస్తాను." అన్నాడు నవ్వుతూ X-లైట్.

బిగ్గరగా నవ్వాడు డిటెక్టివ్ ధర్మేంద్ర.

"మిష్టర్ X-లైట్, వురఫ్ హోషియార్‌సింగ్, ఎలియాస్ జలీల్!" అన్నాడు.

ఆశ్చర్యంగా చూశాడు X-లైట్.

"మిస్టర్ X-లైట్! నీ గుట్టు ముట్టులన్నీ ఎప్పుడో తెలుసుకున్నాను. మీరు చంపిన మా సీక్రెట్ బ్రాంచ్ ఏజంట్ నంబర్ టూ ద్వారానే నీ రహస్యం తెలిసింది. 1965న ఇండో-పాక్ యుద్ధంలో మా ప్రముఖ యుద్ధవీరుడు హోషీమార్‌సింగ్ మీకు ఖైదీగా దొరికాడు. అతన్ని జెనీవా సిద్ధాంతాలకు వ్యతిరేకంగా దారుణంగా హత్యచేసి అతని స్థానంలో ప్రముఖ పాక్ ఏజెంట్‌వైన నువ్వు ప్రవేశించి, శత్రుశిబిరాలనుండి తప్పించుకొని వచ్చినట్లు భారత సైనికుల వద్ద నాటకమాడావు.

ప్రభుత్వం నిన్ను విశ్వసించింది. యుద్ధంలో హోషియార్ సింగ్ అసమాన ప్రతిభకు తగినట్లుగా సైన్యంలో ఉన్నత పదవిని కట్టపెట్టింది భారత ప్రభుత్వం. అయితే పాక్ ఏజెంట్ జలీల్, హోషియార్‌సింగ్ స్థానంలో ప్రవేశించాడని ఎవరూ వూహించలేదు. ఇక నువ్వు అప్పటినుండి నీ బలగాన్ని క్రమేపీ పెంచుకుంటూ చివరకు యీ స్థానంవరకు ఎదిగావు.

అయితే అన్యాయం ఎప్పుడూ నిలవదు. న్యాయానికి విజయం తప్పదు. మా ఏజెంట్ తన ప్రాణాలను పణంగా ఒడ్డి నీ రహస్యాలను కనిపెట్టి, తను ప్రాణాలు కోల్పోయి

గూడా మాకు అందజేశాడు" నవ్వుతూ చెప్పాడు ధర్మేంద్ర.

"ఓహ్! మిస్టర్ ధరేంద్ర! నా గురించి చాలా విషయాలు తెలుసుకున్నారు. మీ పరిశీలనాశక్తి, పరిశోధనా చాతుర్యానికి నా జోహార్లు. అయితే ఒక్క విషయం! ఇంతవరకు నా రహస్యం తెలుసుకున్నవారు ఎవరూ బ్రతికిలేరు. సో, నువ్వూ చావక తప్పదు!" వికటంగా నవ్వాడు.

"మిస్టర్ జలీల్! అంత అవసరమైతే నా ప్రాణాలను సంతోషంగా అర్పిస్తాను. కానీ నేను మరణించే ముందు కొన్ని విషయాలు చెబుతున్నాను విను. ఇది విన్న తర్వాత నీకూ గుండాగిపోతుంది."

"ఏమిటా వివరాలు?"

"ఇంతవరకు నీ వివరాలు నాకొక్కడికే తెలుసనుకుంటు న్నావ్! అది శుద్ధ అబద్ధం! మా ఆఫీసర్స్ అందరికీ తెలుసు. ఇక పోతే, నంబర్ ఫిఫ్టీన్ వేషంలో వచ్చింది నా అసి స్టెంట్ మురళి అని గుర్తుంచుకో! అతను యింతకుముందే బయటకు వెళ్ళిపోయాడు. ఈసరికి బోట్‌హౌస్‌లో సమా వేశమవబోతున్న నీ అనుచరులందర్నీ అరెస్ట్ చేసివుంటారు. మరికొద్ది నిమిషాలలో పోలీసులు యీ స్థావరాన్ని కూడా ముట్టడిస్తారు. నిన్ను ప్రాణాలతో బంధించి బహిరంగ విచారణ జరుపుతారు." చెప్పాడు ధర్మేంద్ర.

ధర్మేంద్ర చెప్పిన వివరాలు అన్నీ విన్న X-లైట్ ముఖం పాలిపోయింది. సన్నగా కాళ్ళు వణికాయి. మనసు తీవ్రాలోచనలో పడిపోయింది.

"ఎస్ మిస్టర్ X-లైట్! ఇక నన్ను కాల్చండి." కవ్వించాడు ధర్మేంద్ర.

X-లైట్ ధర్మేంద్రవైపు పరీక్షగా చూశాడు. అతని బుర్రలో ఓ ఆలోచన తళుక్కుమని మెరిసింది.

"మిస్టర్ ధర్మేంద్ర! ఇప్పుడప్పుడే నిన్ను చంపను. నువ్వు ప్రస్తుతం నా 'కవచానివి'! ఒకవేళ నేను మీ పోలీసులకు లొంగిపోవలసిన పరిస్థితి ఏర్పడితే నాకూ, నీ ప్రాణానికీ బేరం పెడతాను. లేదూ, నా కార్యక్రమమే జయప్రదంగా జరిగితే అప్పుడే నీ ప్రాణాలు తీస్తాను." నవ్వుతూ చెప్పాడు X-లైట్.

"మిస్టర్ X-లైట్, నీ తెలివి అమోఘం! కానీ నాకన్న నీ ప్రాణానికే విలువ ఎక్కువని నేను చెబుతాను తెలుసా?"

"తెలుసు. నీ ప్రాణానికి ఎంత విలువ వుందో కూడా నాకు తెలుసు." అంటూ తన అనుచరుడికేదో సైగచేశాడు X-లైట్.

రివాల్వర్ పుచ్చుకొనివున్న నంబర్ ఫైవ్ ధర్మేంద్ర దగ్గరికి వచ్చాడు. రివాల్వర్ వెనక్కు తిప్పి ధర్మేంద్ర తలపై మోదబోయాడు.

అంతే, చటుక్కున ధర్మేంద్ర తనపై పడబోతున్న చేతిని పట్టుకొని మెలిత్రిప్పి డొక్కలో ఒక్క తన్ను తన్నాడు. అతను గింగరాలు తిరుగుతూ క్రిందపడ్డాడు. చటుక్కున తన జేబులోంచి రివాల్వర్ తీసి X-లైట్‌కు గురిపెట్టాడు ధరేంద్ర.

ఈ హఠాత్సంఘటనకు అదిరిపోయాడు X -లైట్. క్షణంలో పరిస్థితి తారుమారు అయిపోయింది.

అయినా ధైర్యం కూడగట్టుకొని "మిస్టర్ ధర్మేంద్ర! మీరు నన్ను ప్రాణాలతో బంధించలేరు. మైండ్ ఇట్!" అన్నాడు ఓ అడుగు ప్రక్కకు వేస్తూ.

క్రింద పడిన నంబర్ ఫైవ్ లేవబోయాడు. "ఢన్"మని ధర్మేంద్ర చేతిలోని రివాల్వర్ ప్రేలింది. అతనలాగే క్రిందకు వాలిపోయాడు.

బయట పోలీసులు వస్తున్న శబ్దం విన్పించింది.

చటుక్కున X-లైట్ ప్రక్కనే వున్న గదిలోకి వెళ్ళి క్షణంలో తలుపు వేసేసుకున్నాడు. ధర్మేంద్ర రివాల్వర్ పేల్చినా లాభంలేకపోయింది.

"మిస్టర్ ధర్మేంద్ర, గుడ్‌బై! పోలీసులు వచ్చేలోపు యీ గదిలో వ్యాపించబోయే విషవాయువుతో ఘోర మరణం పొందుతావ్." అంటూ టకటక ఏవో బటన్లు నొక్కాడు.

మరుక్షణం ప్రక్క గది లిఫ్ట్‌లా పైకి లేచిపోయింది. పై నుండి గదిలోకి విషవాయువు రావడం మొదలుపెట్టింది.

ధర్మేంద్ర తలుపువద్దకు పరిగెత్తాడు. అది లాక్ అయి పోయింది. ఎంత ప్రయత్నించినా తెరుచుకోలేదు. విష వాయువుతో ఆ గది నిండిపోసాగింది.

40

ధర్మేంద్ర గబగబ క్రింద పడివున్న వ్యక్తి దగ్గరకు వచ్చాడు. అతను మెల్లగా కదులుతున్నాడు.

"మిస్టర్ ఫైవ్! ఇప్పటికైనా X-లైట్ ప్లాన్ గ్రహించావనుకుంటా! త్వరగా చెప్పు. యీ గదినుండి తప్పించుకోవడానికి ఏమైనా రహస్యమార్గాలున్నాయా? క్విక్, ఇద్దరం తప్పించుకోవచ్చు." ఆత్రుతగా అడిగాడు ధర్మేంద్ర.

నంబర్ ఫైవ్ ఏదో సైగచేశాడు. అది ధర్మేంద్రకు అర్థంకాలేదు.

ఇక లాభంలేదని నంబర్ ఫైవ్‌ను రెండు చేతులతో ఎత్తుకున్నాడు ధర్మేంద్ర. ఒక చోట వున్న సీక్రెట్ బటన్‌ను ప్రెస్ చేశాడు నంబర్ ఫైవ్. వెంటనే తలుపు తెరచుకుంది.

నంబర్ ఫైవ్‌తోసహా బయటకు పరిగెత్తుకు వచ్చాడు

ధర్మేంద్ర.

అప్పుడే ఇన్‌స్పెక్టర్ రంజన్ బలగంతో లోపలకు ప్రవేశించాడు.

"మిస్టర్ రంజన్! X-లైట్ పారిపోతున్నాడు. నేను వెంబడిస్తాను. నువ్వు యితన్ని వెంటనే హాస్పిటల్‌కు పంపు. గెస్ట్ నంబర్ టూ రూంలో అసలు రామ్మూర్తి వుంటారు. వారిని గూడా జాగ్రత్తగా తీసుకువెళ్ళండి. క్విక్." అంటూ బయటకు పరిగెత్తాడు ధర్మేంద్ర.

బయట మురళి హెలికాప్టర్‌లో రెడీగా వున్నాడు. ధర్మేంద్రను చూడగానే "సర్! ఇప్పుడే హోటల్ పైభాగం నుండి హెలికాప్టరొకటి పైకి లేచింది. బహుశా X-లైట్‌దే ననుకుంటా." అని చెప్పాడు.

మౌనంగా తల వూపి హెలికాప్టర్‌లో కూర్చున్నాడు ధర్మేంద్ర. మరుక్షణంలో హెలికాప్టర్ పైకెగిరింది.

కొద్దిసేపటిలోనే ముందు వెళుతున్న హెలికాప్టర్‌ను సమీపించింది ధర్మేంద్ర హెలికాప్టర్.

మురళి వైర్‌లెస్ సెట్ ఆన్‌చేశాడు.

"మిస్టర్ X-లైట్! వెంటనే సరండర్ అయిపో!" హెచ్చరించాడు మురళి.

"నో. నా ప్రాణాలు పోయినా ఆ పని జరగదు." ప్రతిధ్వనించింది X-లైట్ కంఠం.

"మురళీ! ఇక నేను రంగంలోకి ప్రవేశిస్తాను." పవర్‌ఫుల్ మాగ్నెట్, బ్యాటరీ నడుంకు కట్టుకుంటూ అన్నాడు ధర్మేంద్ర.

"సార్! ఇప్పుడు మీరు సాహసం చేయవలసిన అవసరమేముంది? సరిహద్దు రక్షకదళ విమానాలకు మెసేజ్ పంపించాను. వాళ్ళు గస్తీ తీవ్రతరం చేసివుంటారు. అలాం

టప్పుడు X-లైట్ వాళ్ళను గూడా తప్పించుకుపోతాడని మీ అనుమానమా?"

"కాదు మురళీ! X-లైట్ శత్రుదేశ గూఢచారి. గూఢ చారి అవసరమైతే ప్రాణాలైనా కోల్పోతాడుగానీ శత్రువు లకు చిక్కడు. X-లైట్ పారిపోవడానికి ప్రయత్నం చేస్తే సరిహద్దు రక్షకదళ విమానాలు కాల్పులు జరపవచ్చు. X-లైట్ హెలికాప్టర్ని కూల్చేయవచ్చు. కానీ X-లైట్‌ను సజీవంగా పట్టుకునే అవకాశం లేదుకదా! X-లైట్‌ను సజీవంగా పట్టుకుని, అతను చేసిన ఘాతుకాలను సాక్ష్యంగా అంతర్జాతీయ న్యాయస్థానంలో అతన్ని నిలబెట్టి నిరూపించితేగానీ, పాకిస్తాన్ నైజం ప్రపంచ దేశాలకు తెలియదు. అతన్ని సజీవంగా పట్టుకోవాలనే నా తాపత్రయం!" చెప్పాడు ధర్మేంద్ర.

మౌనంగా మురళి హెలికాప్టర్‌ను బాగా పైకి తీసుకు వెళ్ళాడు. సరిగ్గా క్రిందనున్న హెలికాప్టర్‌కు సూటిగా తీసుకువచ్చాడు. ధర్మేంద్ర అంతా సెట్ చేసుకొని హెలికాప్టర్‌లోంచి క్రిందకు దూకాడు.

ధర్మేంద్ర గాలిలో తేలియాడుతున్నాడు. బ్యాటరీ స్విచ్ ఆన్ చేశాడు. మాగ్నెటిక్ పవర్ పనిచేయడం ప్రారంభించింది. క్రమేపీ క్రింద హెలికాప్టర్‌కు చేరువ కాసాగాడు. మరో రెండు నిమిషాలలో హెలికాప్టర్ సైడ్ రాడ్‌కు మాగ్నెట్ ఆకర్షించుకుపోయింది. గట్టిగా ఆ రాడ్‌ను చేతితో పట్టుకొని ఒక్క వూపులో హెలికాప్టర్‌లోకి గెంతాడు. బ్యాటరీ స్విచ్ ఆఫ్ చేశాడు. మాగ్నెట్ విడిపోయింది.

X-లైట్ కంగారుగా వెనక్కు తిరిగాడు. ధర్మేంద్ర ఆకలిగొన్న సింహంలా మీదకురికాడు. కంట్రోల్ వదిలే

శాడు X-లైట్. ఇద్దరూ హోరాహోరీ కలబడ్డారు. కంట్రోలు తప్పిన హెలికాప్టర్ వీరి తాకిడికి వూగిపోసాగింది. ఎదురుగా భారత వైమానిక దళానికి చెందిన మిగ్ విమానాలు వస్తున్నాయి.

X-లైట్ చేతులు ధర్మేంద్ర కంఠాన్ని వడిసిపట్టాయి. చేతులు బిగిసిపోతున్నాయి. ధర్మేంద్రకు శ్వాస ఆడటం కూడా కష్టమైపోయింది.

బలమంతా ఉపయోగించి కాలుఎత్తి డొక్కలో తన్నాడు ధర్మేంద్ర. పట్టు కొంచెం సడలింది. క్రొత్తగా గాలి పీల్చుకున్న ఉత్సాహంతో మరోసారి తన్నాడు ధర్మేంద్ర. ఆ దెబ్బకు తూలి వెనక్కుపడ్డాడు. వెనుక తలకు ఇనుప రాడ్ బలంగా తగలడంతో కెవ్వున కేకవేసి స్పృహతప్పి పడిపోయాడు X-లైట్.

ధర్మేంద్ర చటుక్కున కంట్రోల్ చేపట్టాడు. ఎదురుగా వస్తున్న మిగ్ విమానాల్లోంచి హెచ్చరికలు వినబడుతున్నాయి. వెంటనే ధర్మేంద్ర వైర్‌లెస్ సెట్ ఆన్‌చేసి ఎదురుగా వచ్చే భారత విమానాలకు, వెనుక వస్తున్న మురళి హెలికాప్టర్‌కు తన విజయాన్ని తెలియజేశాడు.

రెండు మిగ్ విమానాలు వచ్చి హెలికాప్టర్‌కు యిరువైపులా ప్రయాణించసాగాయి.

హెలికాప్టర్ మెల్లగా క్రిందకు దిగసాగింది.

భారతదేశ నాయకులను, ప్రజలను ఎందరినో పరలోక ప్రయాణం కట్టించాలని వచ్చిన మిస్టర్ X-లైట్ అంతర్జాతీయ న్యాయస్థానం ద్వారా తనకే 'పరలోకప్రాప్తి' కలిగించుకున్నాడు.

—: సమాప్తం :—

వలలో చిక్కిన వనిత!

సంపత్

"హోటల్ శ్రీలేఖ" ముందు ఆగి, హుషారుగా ఈల వేసుకుంటూ లోనికి నడిచాడు వాసు.

వాసు నల్లగా, అయిదడుగుల పదంగుళాల ఎత్తు ఉంటాడు. కొద్దిగా లావే అని చెప్పొచ్చు. క్రాఫ్ ఎప్పుడూ నుదుటిమీద పడుతుంటుంది. చంచలమయిన అతని కనులు ఎప్పుడూ అటూ, ఇటూ తిరుగుతూ, దేనికోసమో అన్వేషిస్తున్నట్లుంటాయి.

ఆ కళ్ళని చూసి, అతనొక నేరస్థుడని, రెండు హత్యలు చేసి తప్పించుకుతిరుగుతున్న వ్యక్తి అని ఎవరూ చెప్పలేరు. పెద్దపెద్ద బుర్రమీసాలు పెట్టినప్పటికీ అవి కూడా అతనికి నప్పాయి. ఖరీదయిన దుస్తులు, కాళ్ళకు బూట్లు. 'పెద్దమనిషి'లాగే ఉన్నాడు.

హోటల్లో ప్రవేశించి, చుట్టూ ఒకసారి పరికించాడు, దూరంగా, ఒక మూలగా ఉన్న ఖాళీ టేబుల్ కన్పించింది.

వెళ్ళి కూర్చున్నాడు. వెయిటర్ వచ్చిన తరువాత కావలసిన పదార్థాలకు ఆర్డర్ యిచ్చి, మరోసారి చుట్టుప్రక్కలు పరిశీలించాడు.

"హోటల్ శ్రీలేఖ" చాలా పెద్ద హోటల్. అక్కడ దొరకనిది అంటూ ఏమీ లేదు.

వాసు దృష్టి ఒక యువతిమీద పడింది. ఆ యువతి ఎదురుగా మరో ప్రౌఢ కూర్చొనివుంది. ఆమెకు నలభై కి పైగానే వయసుంటుంది. అయినా తన వయసుని తగ్గించు కుందుకు మేకప్ భారీగా వాడినట్లు కన్పిస్తోంది.

ఆమె ఎదురుగానున్న యువతికి పాతికకంటే ఎక్కువ ఉండదు. సాదా దుస్తులు ధరించి, శుభ్రంగానే ఉంది.

ఆ యిద్దరికీ ఎటువంటి సంబంధం లేదని గ్రహించాడు వాసు. ప్రౌఢ కూర్చొని మెనూ కార్డ్ చూస్తోంది. ఆ యువతి కాఫీ తాగుతోంది. మధ్యలో కళ్ళెత్తి ఆమెవైపు చూస్తోంది.

ప్రౌఢ వెయిటర్‌కి ఏదో ఆర్డర్ యిచ్చింది. ఆ యువతి కాఫీ తాగటం ఇంకా పూర్తికాలేదు. వాసు దగ్గరికి పదార్థాలు వచ్చాయి.

వారిద్దరినీ గమనిస్తూనే తింటున్నాడు వాసు.

అతని ఆలోచనలు పదేపదే ఆ యువతిమీదకు మళ్ళు తున్నాయి.

"బాగుంది" అనుకున్నాడు. ఆమెలో ఏం ఆకర్షణ ఉందో, అతనికీ తెలియలేదు. నిజానికి ఆ యువతి పెద్ద అందగత్తేమీ కాదు. యవ్వనం యిచ్చిన అందాలు, ఎక్కడి వక్కడ పొందికగా అమర్చబడి ఉండటంవల్ల అతనికి అందంగా కన్పించిందేమో!

ఆమెవంటి వాళ్ళను రోజూ ఎంతోమందిని చూస్తున్నా.

యింతవరకు, యింత పరీక్షగా ఎవరినీ చూడలేదతను. కాని ఎందుకో ఆమెను పదేపదే చూడాలనిపిస్తోంది.

కాఫీ తాగడం ముగించాడు. ప్రౌఢ కూడా టిఫిన్ ముగించి, కాఫీ తాగుతోంది. కాఫీ తాగటం అయిపోయినా ఆ యువతి యింకా అక్కణ్ణుంచి లేవలేదు.

వారివైపు చూసిన వాసు కనుబొమలు ముడుచుకున్నాయి.

వారిద్దరి మధ్య ఉన్న టేబుల్ మీద ఖరీదయిన హేండ్ బాగ్ ఒకటి ఉంది. ఆ యువతి అటూ ఇటూ చూస్తూ, మెల్లిగా తనవైపు లాక్కుంటూంది.

ప్రౌఢ కాఫీ తాగటం అయిపోయింది. ప్రక్కనే ఉన్న ఏదో పేపర్ తీసింది. డైలీ పేపర్.

వాసు చటుక్కున లేచి నిలబడ్డాడు. బిల్లు చెల్లించి బయటికి నడిచాడు.

అతని వెనకగా ఆ యువతి వచ్చింది. మరుక్షణమే లోపలినుంచి "దొంగ! దొంగ!" అన్న కేకలు విన్పించాయి.

ఆ యువతి కంగారుపడింది. ఏం చేయాలో తోచలేదు. పారిపోదామనుకుంటుండగా, ఎదురుగా టాక్సీ ఆగటం, ఆమె లోపలికి దూరటం, టాక్సీ కదిలి వెళ్ళటం ఒకేమారు జరిగాయి.

వెనక గోల, కేకలు క్రమంగా తగ్గిపోయాయి. నెమ్మదిగా ఊపిరి పీల్చుకుంది ఆమె. తన ప్రక్కన ఎవరో ఉన్నారని గ్రహించి ఉలిక్కిపడ్డది.

"నా పేరు వాసు!" అన్నాడతను.

ఏదో అనబోయింది ఆమె. "ష్‌!" డ్రయివర్‌న్ను

చూపిస్తూ, సంజ్ఞచేశాడు వాసు.

మధ్యలో టాక్సీ మారారు. ఆమె రానని మొండికేసింది. అతను బలవంతంగా మరో టాక్సీలో కూలేశాడు!

టాక్సీ సందులు, గొందులు తిరిగి ఒక వీధి మొదల్లో ఆగింది. అక్కడ దిగి డబ్బులిచ్చి పంపేశాడు. ఆమె చేతిని పట్టుకొని నడక సాగించాడు. రెండు, మూడు వీధులు దాటి మరో వీధిలోకి ప్రవేశించాడు.

ఇద్దరు ఒక ఇంటిలోకి ప్రవేశించారు. పాడుబడ్డ కొంప లాగా ఉందది. గోడకు పెచ్చులూడిపోయి, శిధిలావస్థలో ఉంది. గది గుమ్మానికి తాళంకప్ప వేలాడుతుంది. అతను తెరవగానే, ఇద్దరూ లోనికి నడిచారు.

ఆమె లోనికి రాగానే గడియవేశాడు. భయపడిందామె. అతను నవ్వి, కిటికీ తలుపులు తెరిచాడు.

లోపల నీట్‌గా ఉంది. సామానులు ఎక్కువగాలేవు. ఒక చాప, దుప్పటి. దిండు, ఒక ట్రంక్ పెట్టి. ఊడవడాని కొాక పాత చీపురు మూలుగా వుంది.

"బహుశా నేను చేసేదంతా నీకు వింతగా అన్పించవచ్చు కాని ఇది నీ మంచి కోసమే. నువ్వు చేసింది ఎంత ప్రమాద కరమో తెలుసా? నిన్ను పోలీసులు వేటాడతారు. నీ రూపు రేఖలు వారికి తెలుస్తాయి. వాటి ఆధారంతో నీ ఫొటో ఒకటి తయారు చేసినా ఆశ్చర్యపోనక్కరలేదు. అందుకే నీజాడ తెలియకుండా ఇంత శ్రమపడవలసి వచ్చింది. ఇక నీ గురించి చెప్పు. నువ్వు దొంగవుకాదు. నీవు చేసింది దొంగ తనం. అయినా ఆ విద్యలో నీకు ప్రావీణ్యత లేదు."

ఆజ్ఞాపిస్తున్నట్లే అన్నాడు వాసు.

"నా పేరు శ్యామల!" గొంతు విప్పిందామె. కోకిల

కంఠంలా లేకపోయినా, బాగానే ఉందనుకున్నాడు వాసు.

"మాది కాకినాడ. చిన్నప్పటినుంచి అనాథ శరణాలయం లోనే పెరిగాను. నా అన్నవారు నా కెవరూ లేరు. నాకు వయస్సు వచ్చిన తరువాత అక్కణ్నుంచి మద్రాసువచ్చాను. ఇక్కడ ఏంచేయాలో తోచలేదు. ఉద్యోగంకోసం ప్రయత్నించాను. చిన్న ఉద్యోగం దొరికింది. అది కూడా ఖాళీ అయింది. పెద్దగా చదువుకోలేదు నేను. మంచి ఉద్యోగా లెక్కడినుంచి వస్తాయి? ఇక లాభంలేదని దొంగతనాలకు దిగాను. చిన్నచిన్న దొంగతనాలు చేశాను. ఇంతవరకు పట్టుబడలేదు.

కాని ఈ రోజు ఆమె బాగ్ చూసిన తర్వాత కళ్ళు తిరిగాయి. ఎప్పుడూ అంత డబ్బు చూడలేదు నేను. అసలు నేనూ హోటల్‌కే వచ్చాను. కాని ఆ డబ్బు మైకంలో పడి పోయాను. అందుకే అంత సాహసం చేశాను. నన్ను పోలీసుల బారినుండి రక్షించారు. మీకెలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియడంలేదు."

ఆమె నిజమే చెప్తుందని గ్రహించాడు వాసు. ఇప్పుడు తన గురించి చెప్పాలా, వద్దా? ఒక్కక్షణం సందేహించాడు. సూచనప్రాయంగా తన గురించి చెబితే మంచిదన్పిం చింది.

"నేనూ నీ తరహాకు చెందిన మనిషినే. ఇంతవరకు పట్టుబడలేదు. నాకూ మా వారెవ్వరూలేరు." అని ఆగాడు. రెండు క్షణాల తర్వాత అన్నాడు మరలా "నీ కిష్టం అయితే నువ్వూ నాతోనే ఉండవచ్చు!"

శ్యామల చివుక్కున తలెత్తి అతని ముఖంలోకి చూసింది.

"ఇందులో బలవంతం ఏమీలేదు. ఇద్దరం ఏకాకులం.

ఒకేజాతి పక్షులం. జంటగా ఎగిరితే బాగుంటుందని నా ఉద్దేశ్యం. తొందరేం లేదు కనక ఆలోచించుకుని చెప్పు. నీ కిష్టం లేకపోతే, నీ దారిన నువ్వు పోవచ్చు."

వాసు ఇప్పుడే వస్తానంటూ బయటికి వెళ్ళిపోయాడు.

ఎంతో ఆలోచించిన మీదట అతనితో వుండటానికే నిశ్చయించుకుంది శ్యామల.

"ఎంత చిత్రం!" నవ్వుకొంది శ్యామల. ముక్కు, మొగం తెలియని అతడు తనకి అండగా లభిస్తున్నాడు. ఎవ్వరూ లేని తనకి సంసారం ఏర్పడబోతూంది. కాని ఇది శాశ్వతమేనా లేక కొంతమందిలాగానే ఇతనూ నమ్మించి మోసగిస్తాడా అన్న అనుమానం లేకపోలేదు. అతని కళ్లు చూస్తుంటే మోసగాడిలా అన్పించటం లేదు అని అనుకొంది.

2

నిముషాలు గంటలుగా, గంటలు రోజులుగా, రోజులు కూడా వారాలుగా, నెలలుగా మారిపోతున్నాయి.

శ్యామల కిప్పుడు కూడా శాంతిగా లేదు. వాసు తరహా ఆమెని భయపెడుతూంది. అతని కళ్ళల్లో అంతకుముందు లేని విషపు జీరలు కదలాడుతున్నాయి.

ఎప్పుడొస్తాడో, ఎక్కడుంటాడో తెలియదు. అతనిష్టం వచ్చినపుడు వస్తాడు, వెళతాడు.

సుమారు రెండు నెలల తర్వాత ఒకనాటి సాయంత్రం వాసు కుంటుకుంటూ యింటికి వచ్చాడు. అతని కాలు అంతా రక్తమయం. రుమాలు బిగించి కట్టినప్పటికి రక్త స్రావం ఆగలేదు. రుమాలుకూడా రక్తంతో తడిచి, ఎర్రగా అయిపోయింది.

శ్యామల గాభరాపడిపోయింది. వాసే స్వయంగా బుల్లెట్ తీసి బాండేజ్ వేసుకుని కట్టుకున్నాడు, అలవాటున్నవాడిలా. అతనికి కావల్సిన వస్తులవీ, యివీ అందిస్తుండిపోయింది శ్యామల. కాని ఒకటి మాత్రం ఆమెకు నిర్ధారణ అయిపోయింది.

వాసు తాననుకున్నంత మంచివాడు కాడు. తనతో నిజం చెప్పలేదు.

"శ్యామలా! మనం వెంటనే యిక్కణ్నుంచి వెళ్ళిపోవాలి. తయారవు. క్విక్!"

"ఎక్కడికి?" మెల్లిగా అడిగింది శ్యామల, భయపడుతూనే.

"షటప్! ముందు తయారవు. లేకపోతే కొంచెంసేపట్లో నాతోపాటు నువ్వూకూడా కటకటాల వెనక వుంటావ్!"

జైలు మాట వినేసరికి శ్యామలకి వెన్నులోంచి దడ పుట్టుకొచ్చింది. క్షణాల్లో రెడీ అయింది. తానే స్వయంగా వెళ్ళి రిక్షా పిల్చుకొచ్చింది. వాసుని ఎక్కించారు రిక్షావాడు, శ్యామల కలసి. వస్తువులేవీ వదలలేదు ఇంట్లో.

ట్రెయిన్ ఏదో పల్లెటూరులో ఆగింది. అక్కడ దిగారు యిద్దరూ. వాసు నడవలేకపోతున్నాడు. శ్యామలే అతన్ని పట్టుకొని నడిపిస్తోంది. ఎవరయినా చూసి తమని గమనిస్తారేమోనని ఆమె భయం. చేతిలో చిన్న సంచి, అందులో ఇద్దరి బట్టలు తప్ప మరేమీ లేవు. అక్కడ ఉన్నప్పుడు రోజూ హోటల్లోనే భోజనం. వాసు సామానులు కొనటానికి నిరాకరించాడు. ఎందుకో యిప్పుడర్థం అయింది శ్యామలకి.

స్టేషన్ బయటికి నడిచారు. స్టేషన్‌నుంచి ఊరు మైలు దూరం ఉంటుంది. జట్కావాడు తన బండిలో నిద్రపోతు

న్నాడు. వాడిని లేపి యిద్దరూ ఎక్కారు. జట్కా బయలు దేరింది.

అది పల్లెటూరేమీ కాదు. అలా అనీ పట్నమూ కాదు. ఇప్పుడిప్పుడే డెవలప్ అవుతున్న చిన్న సైజు పల్లెటూరు. కరెంటు కూడా ఉంది. నాలుగైదు సినిమా థియేటర్లు ఉన్నాయి.

ఆ ఊళ్ళో దిగేటప్పటికి సమయం రాత్రి ఎనిమిది కావొచ్చింది. ఒక హోటల్‌లో దిగారు యిద్దరూ.

అప్పుడు గుర్తుకొచ్చింది శ్యామలకి. గుండాగినంత పనయింది. ఈ సంగతి వాసుకి చెబితే చంపుతాడు. తానేం చేయాలి?

సందేహిస్తూనే చెప్పింది శ్యామల. చెంపలదిరిపోయేలా కొట్టాడు శ్యామలని. వాసు వాలకం చూస్తే, తనని చంపుతాడేమోనన్పించింది.

ఎంతో ప్రయత్నంమీద తనని తాను నిగ్రహించుకున్నాడు వాసు. "అందుకే ఆ రోజు నీకు చెప్పాను. అయినా నువ్వినలేదు. అయినా నిన్ననేదేముందిలే. నాకు బుద్ధి ఉండాలి. నీకు ముచ్చటపడి ఫోటో తీయించుకోవాలని ఉంటే. నాకు తెలుసు, ఇటువంటిదేదో అవుతుందని. సరే, పద. ఇక్కణ్నుంచి మకాం ఎత్తేయాలి. లేకపోతే ఆ ఫొటో పట్టుకొని మన వెనకే వస్తారు. లేదా తెల్లవారేటప్పటికి పేపర్లో మనిద్దరి ముఖాలే ఉంటాయి."

ఆ చీకట్లోనే వెళ్ళిపోతున్న శ్యామల్ని, వాసుని విచిత్రంగా చూశాడు హోటలు యజమాని.

3

ఆకాశం మేఘావృతమైంది. చల్లగాలి రివ్వున వీస్తోంది. ఇంకా కొద్దిసేపటిలో వాన వచ్చే సూచనలు కన్పిస్తున్నాయి.

చిన్నగా మూలిగాడు వాసు. అతని కాలు బాగా నొప్పి చేసి, వాచింది. దానికితోడు జ్వరం. మూసిన కన్ను తెరవటంలేదు.

శ్యామలకు ఏం చేయాలో తోచటంలేదు. జీవితంలో ఇంతవరకు ఎరుగని బంధం తమది. అతని బాధ చూస్తుంటే గతంలో తనని హింసించిన దృశ్యాలు కన్పించటంలేదు. అతని బాధ తీరే మార్గాలకోసం వెదుకుతూంది.

చుట్టూ చూసిందొకసారి. అడవి. ఊరికి దూరంగా ఉంది. క్రూరమృగాలేమీ లేకపోయినా, పాములు, తేళ్లు మొదలైన విషజంతువుల ఉనికి ఆమెని భయపెడుతోంది.

హోటల్‌లోనుంచి బయటపడిన తర్వాత ఇద్దరూ అక్కడకు చేరుకున్నారు. శ్యామల, తమ ఫొటో మరచిపోయిందని తెలియగానే వాసు విపరీతంగా భయపడిపోయాడు. శ్యామలకి తనమీద నమ్మకం కల్గించటంకోసం ఆమెతో ఫొటో దిగాడే కాని, అది ఈ రోజు తన ప్రాణంమీదకు తెస్తుందని ఊహించలేకపోయాడు.

ఆ ఫొటో పోలీసుల కళ్ళబడితే.... ఇంకేముంది? మరునటి దినం పేపర్లలో తామిద్దరి ఫొటోలుంటాయి. ఈ ఊళ్లో తామిద్దరిని ఎవరైనా గుర్తుపడతారు. అదీగాక తను ఇప్పుడు సరిగ్గా నడవనుకూడా లేకున్నాడు. తామిద్దరు ఈ పరిస్థితుల్లో ఇతరుల కంటపడడం మంచిదికాదు.

అతనికి ఆ ఊరి చివరగా వున్న అడవి గుర్తుకొచ్చింది. తాము దాగుంటానికి అంతకంటే మంచి ప్రదేశం లేదు. వెంటనే శ్యామలని అటు నడవమన్నాడు. అతని ఉద్దేశ్యం అర్థమైనా, ఏమీ మాట్లాడలేదు ఆమె.

వాసుని ఆ పరిస్థితులలో వదిలి వెళ్ళబుద్ధికావటంలేదామెకు. నెమ్మదిగా అడవిలోకి నడిచారు.

ఆ అడవి గురించి వాసుకి బాగా తెలుసు. ఇంతకు ముందు రెండుమూడు మార్లు అక్కడ దాక్కున్నాడు. అక్కడ అడవిమృగాలేమీ లేవని, తమకు ఎటువంటి భయమూ లేదని శ్యామలతో చెప్పాడు.

ఇంత చెప్పినప్పటికీ శ్యామలకి ఆ చీకటిలో ఆ అడవిని చూస్తే విపరీతమైన భయంవేసింది. అయినా వాసు మూలంగా అతనికి భయపడి, తన భయాన్ని బయటపెట్ట లేదు. ఆ చీకట్లోనే లోనికి నడిచారు.

వాసు తన దగ్గరున్న సిగర్‌లైటర్‌ని వెల్గించాడు. దూరంగా నడిచారు. ఒక పొద దగ్గర ఎండిన మానొకటి పడిపోయివుంది. దానిని అతి కష్టంమీద పొదకు అడ్డంగా జరిపారు.

పొదలోకి దూరారు. ఎటువంటి జీవజాలం లేదు.

అందులో ఉంటే యితరుల కంటపడరు. మాను వారికి అడ్డంగా ఉంది. అయితే శ్యామల భయం అదిగాదు. తాముంటున్న ఆ పొద ఎండనుంచి, గాలినుంచి తమని రక్షించగలదు. కాని వాన వస్తే తాము తడవటం ఖాయం.

ఇప్పుడేం చేయాలి? ఎన్నాళ్ళిలా ఆ అడవిలో?

శ్యామల పమిటకొంగు ఆమె చేతిలో నలిగిపోయింది. వాసు అప్పుడప్పుడు చిన్నగా మూలుగుతూ, ఉలిక్కిపడు తున్నాడు. అతని శరీరం వేడిగా కాలిపోతోంది.

అయిదు నిమిషాలనంతరం పొదనుంచి బయటపడింది, ఏదో నిశ్చయించుకుని. కొంతదూరం ఆ చీకట్లోనే నడిచి, ధైర్యం చాలక తిరిగి వాసు దగ్గరికే వచ్చింది.

ఆ చీకటిలో వెలుగుకోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

కాలం దొర్లుతూంది. అదృష్టవశాత్తు వాన రాలేదు. కమ్ముకున్న మేఘాలు తొలిగిపోయాయి. తూర్పున వెలుగు

రేఖలు విచ్చుకున్నాయి.

ఆకలివేసింది శ్యామలకి. అడవిలోకి నడిచి తినదలుచుకున్న ఫలాలు కోసుకొచ్చి తిన్నది. వాసుచేత కూడా తిన్పించాలని ప్రయత్నించి, విఫలురాలై పోయింది. అతని పరిస్థితి మరింత క్షీణించింది.

శ్యామలలో ధైర్యం నశించింది. కాళ్ళుచేతులు ఆడటం లేదు. అతన్ని ఆ పరిస్థితుల్లో వదిలిపోలేదు. తానూ ఏం చేయలేదు.

అతనికి ఎదురుగా ఉంటే తాను వెళ్ళిపోలేననిపించిందామెకు. దూరంగా పోతే, అతన్నుంచి తానూ దూరంగా పోగలనని అభిప్రాయపడింది. ఆ అభిప్రాయంతోనే పొద నుండి బయటపడి కొంతదూరం నడిచింది. కాని ఆగిపోయింది. ఆమె హృదయంలో మెదులుతున్న వాసు రూపం ఆమెను ముందడుగు వేయనీయలేదు.

వెనుదిరిగి వచ్చింది. వాసు తలని ఒళ్ళో పెట్టుకుంది. కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి. వాసు శరీరం విపరీతమైన వేడితో కాలిపోతోంది.

పోలీసులకు పట్టుబడినాసరే, తాము యిక్కణ్ణుంచి బయటపడాలి. ముందు ఎవరి సాయం అయినా తీసుకొని వాసుని యిక్కణ్ణుంచి తరలించి, హాస్పిటల్‌లో చేర్పించాలి. ఆ నిశ్చయానికి రాగానే ఆమె హృదయం తేలికపడింది.

పొదనుండి బయటపడి, నడవసాగింది.

అడవి చివరకు వచ్చింది. దూరంగా ఊరి చివరనున్న భవనాలు కన్పిస్తున్నాయి. ఊరికి, అడవికి మధ్య పొలాలు లేవు. పచ్చికబయలు వుంది. ఆ బయలులో ఎవరూలేరు. ఎవరిదో స్కూలు ప్లేగ్రౌండ్‌లా వుంది.

ఎదురుగా ఎవరో రావటంతో చటుక్కున ఆగిపోయింది శ్యామల. ప్రక్కకు తప్పుకోవాలని చూసిందిగాని, అప్పటికే ఆ వ్యక్తి కంటపడింది. భయంతో అలానే నిల్చుండి పోయింది.

అతనికి ముప్పై, ముప్పైఅయిదు సంవత్సరాలుంటాయి. ఎర్రగా, హుందాగా వున్నాడు. వాసు అంత ఎత్తేవుంటాడు. చేతిలో 'హంటింగ్ గన్' ఉంది. జంగిల్ బూట్సు ధరించి వున్నాడు.

వనకన్యలా, హఠాత్తుగా తన ముందు ప్రత్యక్షమయిన యువతిని చూసి విస్మయంతో నిలబడి పోయాడతను.

మరుక్షణంలో తేరుకొని "ఎవరు?" అని అడిగాడు.

శ్యామల చెప్పటమా, వద్దా అన్న సందిగ్ధంలో పడిపో యింది. చెప్పటమే మంచిదనుకుంది.

శ్యామలలో తడబాటు గమనించాడతను. అతనిముఖంలో ఎటువంటి భావమూ ద్యోతకం కాలేదు.

చివరకు చెప్పలేక చెప్పింది శ్యామల, ఒక్కవిషయం కూడా పొల్లుపోకుండా. అతని భృకుటి ముడివడటం గమనించి, ఆమె గుండెలు ఆందోళనతో కొట్టుకున్నాయి. ఏం చేస్తాడితను? తమని పోలీసులకు అప్పగిస్తాడా?

"ముందు వాసుగారిని తీసుకు పోదాం పద!"

ఆ మాటలు విన్న తర్వాతగాని, ఆమె గుండెలు కుదుట పడలేదు. యాంత్రికంగా అతన్ని అనుసరించింది.

అతనికి తామున్న పొద చూపించింది.

వాసు మీద చేయివేసి, షాక్ కొట్టినట్లు తృళ్ళిపడ్డాడు అతను. శ్యామల ముఖంలోకి చూశాడు. తలదించుకుంది శ్యామల.

"మైగాడ్! ఒళ్ళంతా కాలిపోతోంది. వెంటనే వైద్యం

చేయించకపోతే ప్రాణాలకే ప్రమాదం!" అన్నాడతను. "మా ఇల్లు ఇక్కడికి దగ్గరే. ముందు అక్కడికి తీసుకుపోదాంపద. మా ఫామిలీ డాక్టరు చూస్తాడు."

శ్యామల, నూతన వ్యక్తి యిద్దరు కలసి, చెరొక రెక్క పట్టుకొని, స్పృహలో లేని వాసుని లేవదీశారు. మెల్లిగా నడిపించుకుంటూ వస్తున్నారు. నడిపించుకుంటూ అనటం కంటే ఈడుస్తూ అనటం సబబుగా ఉంటుంది.

పచ్చిక మైదానంలో తమనెవరయినా గమనిస్తారేమోనని భయపడింది శ్యామల. కాని ఎవరూ రాలేదు ఆ వైపు.

అతని యిల్లు, అతనన్నట్లు ఊరి చివరగానే వుంది. చిన్న బంగళాలా వుంది. చుట్టూ కాంపౌండ్ విశాలంగా ఉండి ధారాళంగా గాలి వీస్తూంది. ఆధునిక రీతులలో కట్టబడి వుంది.

శ్యామల సాయంతో వాసుని ఒక గదిలోకి చేర్చారు.

"నా పేరు గౌతమ్, మద్రాసులో బిజినెస్ నడుపుతున్నాను. అప్పుడప్పుడు యిక్కడకు వచ్చి గడుపుతుంటాను. నా భార్య చనిపోయింది. పిల్లలు లేరు. ఆ గది నా భార్యది. అందులో ఆమె చీరలు ఉన్నాయి. వెళ్ళి స్నానంచేసి, రెస్టు తీసుకో. ఈ లోపున డాక్టరుని పిల్చుకొస్తాను!" సాధ్యమైనంత క్లుప్తంగా, గబగబా తనని పరిచయం కానిచ్చుకొని వెళ్ళిపోయాడు గౌతమ్.

ఇంటి ముందున్న గేటు తెరుచుకొని, రోడ్ మీదుగా ఊళ్ళోకిపోతున్న గౌతమ్‌ని రెప్ప వాల్చకుండా చూస్తుండిపోయింది శ్యామల. అపరిచిత వ్యక్తుల్ని తన యింటిలో వుంచి, వారిని నమ్మి వెళ్లిపోతున్న అతని ప్రవర్తన ఆమెకు వింతను గొలిపింది.

4

చాలా రోజుల తర్వాత హాయిగా, కరువుతీరా, శుభ్రంగా స్నానం చేసింది శ్యామల. బాత్‌రూం ఆ గదికి అటాచ్ చేయబడి వుంది.

స్నానం ముగించి, బట్టలు కట్టుకోవటానికని, టవలు వంటికి చుట్టుకొని, బట్టల రాక్ వైపు నడిచింది. అదే సమయంలో బయట ఎవరో తలుపు తడుతున్న శబ్దం అయింది. "గౌతమ్‌గారు వచ్చేసి ఉంటారు!" అనుకుంది.

గబగబ చీర, జాకెట్ ధరించింది. తల కొద్దిగా సరిచేసుకొని, గుమ్మం తలుపు తీసింది.

ఎదురుగా ఉన్నది గౌతమ్‌గాదు. వేరే వ్యక్తి.

అతన్ని చూసి శ్యామల, ఆమెని చూసి అతడు కొంత తొట్రుపడ్డారు.

అతనికీ గౌతమ్ వయసే ఉంటుంది. చామనఛాయ. ఎత్తుగా, బలంగా ఉన్నాడు. అతని కోర మీసాలు చూస్తుంటే భయంవేసింది శ్యామలకి. తను బయటపడి పోతున్నట్లనిపించింది. తనవంక అలా కళ్ళప్పగించి చూడటం నచ్చలేదామెకు.

ఆ కోపంతోనే "ఎవరు కావాలి?" అని గౌరవ సంబోధనను కూడా మరిచి అడిగింది.

"ముందు మీ రెవరో చెప్పండి!" అతని గొంతులో మార్దవం లేదు. ఆదోరకమయిన అధికారం. ముందు తెల్లబోయినా, అతని ధోరణి శ్యామలకు కోపంతోపాటు చిరాకుని కూడా తెప్పించింది.

"మీరెవరో చెప్పండి ముందు!" అంది అసహనంగా.

"చూడండి. మీరు చూస్తే చదువుకున్న వారిలాగా ఉన్నారు. అతిథుల్ని ఇలా గుమ్మంలోనే నిలబెట్టి మాట్లా

డటం బాగుండదు."

తన తప్పు తెలిసి వచ్చింది శ్యామలకి. గౌతమ్‌గారికి ఫ్రెండ్ కాబోలు. తన ప్రవర్తన విని ఆయనేమను కుంటాడు? సిగ్గుతో ప్రక్కకు తప్పుకుంది.

అతను చనువుగా లోనికివచ్చి, కూర్చుంటూ "గౌతమ్ గారు ఇంకా లేవలేదా?" అని అడిగాడు.

"ఇప్పుడే ఏదో పనిమీద బయటికి వెళ్లారు." ముక్తసరిగా అంది ఆమె.

అతనిరాక ఆమెకు చాలా ఇబ్బంది కల్గించింది. డాక్టరుని తీసుకొని గౌతమ్‌గారు లోనికివస్తే, డాక్టరు ఎందుకని అడుగుతాడు. తమ బండారం బయటపడిపోతుంది. ఈయన్ని ఎలాగయినా యిక్కణ్నుంచి వెళ్ళేలా చేయాలి.

కాని ఎలా? ఆయన స్నేహితుణ్ని ఈ విధంగా ట్రీట్ చేస్తే ఆయన ఏమనుకుంటారు? తనని ఎంత హీనంగా అంచనా వేస్తారు! ఇప్పటికే తనగురించి ఏమను కుంటు న్నారో! ఎటూ తేల్చుకోలేక సతమతమయిపోతోంది శ్యామల.

"ఏమండోయ్!"

అతను పెద్దగా అనటంతో చిన్నగా ఉలిక్కిపడింది శ్యామల.

"మీరేదో ఆలోచిస్తున్నట్లున్నారు. నా పేరు సుందర్. ఇక్కడే సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాను."

ప్రక్కలో బాంబు పడ్డట్లయింది శ్యామలకు. సబ్ ఇన్‌స్పెక్టరా? తమని పసిగట్టి వచ్చాడా? లేక....లేక.... గౌతమే యిక్కడకు ఇతన్ని పంపారా?

తన మాటలు వింటూనే, ఆమె ముఖం పాలిపోవటం అనుభవజ్ఞుడయిన సుందర్ గ్రహించటం పెద్ద కష్టమేమీ

కాదు. ఆమె ఎవరో అతనికి తెలియదు.

తనకు తెలిసినంతవరకు గౌతమ్‌కి భార్యా పిల్లలు లేరు. బంధువులు కూడా ఎవరూ ఉన్నట్లు లేరు. అమ్మాయి ఎవరు? పెళ్ళి కానట్లే వుంది. ఒకవేళ గౌతమ్ ఈ అమ్మాయిని పెళ్ళాడ దల్చుకున్నాడేమో. తన మాటలు విని ఆమె ముఖం ఎందుకు అంతగా పాలిపోయింది? ఈమెకు, గౌతమ్‌కు ఏమిటి సంబంధం?

ఆ యింట్లో వేరే ఎవ్వరూ ఉన్నట్లులేరు.

"ఇంతకీ మీ పేరు చెప్పారు కారు!" మరలా తన ప్రశ్నని వేశాడు సుందర్.

"శ్యామల." అంది శ్యామల.

"గుడ్ నేమ్! గౌతమ్‌కు మీ రేమవుతారు?"

ఏమని చెప్పాలి? శ్యామల ఆలోచిస్తూంది

"ఉండండి కాఫీ తీసుకొస్తాను!" అంది వెళ్ళటానికి ఉద్యుక్తురాలవుతూ. తన ప్రశ్నకు, ఆమెకు సమాధానం చెప్పటం ఇష్టం లేదని గ్రహించాడు సుందర్. పదే పదే ఆమెని అడిగి ఆమెని కష్టపెట్టటం ఆయనకి యిష్టంలేదు.

"ఒద్దులెండి ఇప్పుడే యింటి దగ్గర తాగి వచ్చాను. నేను వెళుతున్నాను." అని బయటికి నడిచాడు సుందర్.

ఊపిరి పీల్చుకుంది శ్యామల. కాంపౌండ్ గోడకి, ఇంటికీ మధ్యఉన్న పచ్చిక మధ్య వేయబడి ఉన్నబాట కుండా పోతున్న సుందర్‌ని చూస్తూ నిలబడింది. వెనక్కు తిరిగింది. తరువాత సుందర్ వెనుదిరిగి, మూసి ఉన్న తలుపులను చూడటం ఆమె చూడలేదు.

తరువాత రెండు నిముషాలకు గౌతమ్, అతనివెంట డాక్టర్ వచ్చారు.

డాక్టర్‌తో చెప్పి, అతన్ని వాసు గదిలోకి పంపాడు.

"ఇక్కడికి ఇన్‌స్పెక్టర్ సుందర్‌గారు రావటంచూసి అక్కడే ఆగిపోయాను. మీరు నా భార్య చెల్లెలని చెప్పండి. ఆ ఇన్‌స్పెక్టర్ అసాధ్యుడు" అన్నాడు గౌతమ్.

యాంత్రికంగా తలూపింది శ్యామల. అతనికి, తనకి మధ్య నడిచిన సంభాషణాసారాన్ని గౌతమ్‌తో చెప్పింది.

ఇద్దరు వాసు ఉన్న గదిలోకి నడిచారు.

5

"వెంకయ్యా!" పిలిచాడు ఇన్‌స్పెక్టర్ సుందర్.

"సార్!" బదులువచ్చింది.

"ఈ ఊరి చివర ఉండే గౌతమ్‌గార్ని ఎన్నాళ్ళనుండి ఎరుగుదువు?" అని ప్రశ్నించాడు.

"దాదాపు సంవత్సరం నుండిసార్! చాలా మంచివాడు బాబు. ఏం సార్? ఆయన మీదేమయినా రిపోర్టు వచ్చిందా?" అనుమానంగా అడిగాడు వెంకట్రావు.

"లేదులే! ఊరికినే అడిగాను. నే నీ ఊరువచ్చి మూడు నెలలేగా అయ్యింది. అందర్ని గురించి తెలుసుకోవద్దూ!" అంటూ నవ్వాడు సుందర్.

"సరే! నేను యింటికి పోతున్నాను. అవసరమయితే కబురుపంపు!" అని వెళ్ళిపోయాడు సుందర్.

ఇంటి దగ్గర పని ముగించుకొని, మరలా గౌతమ్ యింటివైపు నడిచాడు. ఈ సారి ఇంట్లోనే ఉన్నాడు గౌతమ్.

కుశల ప్రశ్నలు, అవీ అయ్యాక అన్నాడు సుందర్ హఠాత్తుగా.

"ఇందాక మీ యింటి కోమారు వచ్చి చూశాను. ఎవరో ఒకామె తలుపు తెరిచింది. ఎవరావిడ!"

గౌతమ్ యింటికి రెండోసారి వచ్చిన తర్వాత, సుందర్‌కి శ్యామల కన్పించలేదు. కనీసం ఆవిడ అలికిడి కూడా విన్పించలేదు. ఉందో, లేదో నన్న అనుమానం తోనే అడిగాడు గౌతమ్‌ని.

"ఆమె పేరు శ్యామల. నా భార్య చెల్లెలు. నా భార్య చనిపోయాక నాకూ, వారికి సంబంధాలు తెగిపోయాయి." అని, మరలా చిన్నగా "ఇప్పుడేదో డబ్బు అవసరం వచ్చిందిట. అందుకని వచ్చింది." అన్నాడు.

"మీ ఆవిడ ఏదో ఆక్సిడెంట్‌లో చనిపోయినట్లు విన్నానే!" ఆ మాట వినగానే గౌతమ్ ముఖం విషాదంగా మారిపోయింది. "అవును! అగ్ని ప్రమాదం. ఇదివరలో మద్రాసు ఇలియట్స్ రోడ్‌లో ఉండేవాళ్ళం. నేను బొంబాయి వెళ్ళినపుడు అగ్నిప్రమాదం జరిగి కాలిపోయింది. మొత్తం నలుగురు మరణించారు, నా భార్యతో సహా."

"ఇలియట్స్ రోడ్‌లోనా? ఎక్కడ?"

అడ్రసు చెప్పాడు గౌతమ్.

"సారీ! గతించిన విషయాలు గుర్తుచేసి మిమ్మల్ని బాధ పెట్టాను అన్నట్లు, వచ్చిన పని చెప్పనేలేదు. ఈ రోజు సాయంత్రం క్లబ్‌లో చిన్న ఫంక్షన్ అరేంజ్ చేశారు సుదర్శనంగారు. వాళ్ళమ్మాయి మారేజి సెటిలయ్యింది గదా. నిన్నరాత్రే క్లబ్‌లో అనౌన్స్ చేశారు. మీరు రాలేదుగా."

"అవును. ఒంట్లో బాగోలేక రాలేకపోయాను!"

"సుదర్శనంగారే ఈ మాట మీతో చెప్ప మన్నారు నన్ను. పనుల వత్తిడివల్ల ఆయనే స్వయంగా రాలేక పోతున్నట్లు కూడా చెప్పమన్నారు."

"దానిదేముంది? తప్పకుండా వస్తాను! అన్నట్లు పార్టీ

ఎన్నింటికి?"

"ఏడుగంటలకి అన్నారు. ఎనిమిది అవుతుంది." అని లేచి నిలబడ్డాడు సుందర్.

"నేను వెళతాను. స్టేషన్‌కు వెళ్లాలి." అని ఆగి "ఎన్నాళ్ళుంటారిక్కడ?" అని అడిగాడు.

గోడ మీదున్న కాలెండరుచూసి "ఇంకా పదిహేను రోజులు!" అన్నాడు గౌతమ్.

ఇన్‌స్పెక్టర్ సుందర్ వెళ్ళిపోయాడు.

గుమ్మం చాటునుంచి వింటున్న శ్యామల వెనుదిరిగింది.

ఆ మధ్యాహ్నం ఆమె స్వయంగా భోజనం చేసి వడ్డించింది. గౌతమ్ ఆమె వంటనే కాక, ఆమెను కూడా మెచ్చుకున్నాడు.

వాసుకి మత్తుమందు ఇవ్వటంవల్ల నిద్రపోతున్నాడు. భోజనంచేసి, జాగ్రత్తలు చెప్పి, హంటింగ్‌గన్ పట్టుకొని వెళ్ళిపోయాడు గౌతమ్.

6

ఆ రాత్రి వాసుకి తెలివి వచ్చింది. ఆ సమయంలో గౌతమ్, యింటివద్దలేదు. పార్టీకి అని చెప్పి వెళ్ళిపోయాడు. శ్యామలే దగ్గరుండి, బ్రెడ్, పాలు తినిపించింది వాసు చేత.

వాసు తెలివిలో లేనప్పుడు జరిగిన సంగతులన్నీ ఏకరువు పెట్టింది.

తమ సంగతి గౌతమ్‌కి చెప్పిందని వినగానే మండిపడ్డాడు వాసు. కాని శ్యామల అతనికి తామున్న పరిస్థితి చెప్పింది.

వాసు, గాయం మానాలంటే పక్షం రోజులయినా పడుతుంది. ఈ పక్షం రోజులు ఎలాగోలా సర్దుకుంటే

ఇక్కణ్ణుంచి వెళ్ళిపోవచ్చు. అని నచ్చచెప్ప జూసింది శ్యామల.

వాసు కూడా కాలుని ఏమాత్రం కదిలించలేకపోతున్నాడు. సెప్టిక్ అయిందేమోనని భయంగా ఉందతనికి. అతడి వంట్లోజ్వరం కాస్త తగ్గింది. కాని శ్యామల మీద కోపం తగ్గలేదు.

శ్యామలమీద గొణుక్కుంటున్నాడు. అప్పుడప్పుడు పెద్దగానే అంటున్నాడు. ఉన్నట్లుండి అతని మాట విని అదిరిపడింది శ్యామల.

"ఏది? మరోసారి ఆ మాట అను!" ఆతనిని గౌర వించటం మానేసి చాలాకాలం అయింది.

"అవును. మళ్ళా అంటాను. నువ్వు వాడి వలలో పడి పోయావు. ఈ సిరిసంపదలకు నీ కళ్ళు చెదిరిపోయాయి. వద్దు. నువ్వు నాకు కావాలి. ఇక్కణ్ణుంచి వెళ్ళిపోదాం."

గిరుక్కున వెనుదిరిగి తన గదిలోకి వచ్చి పడింది శ్యామల.

వాసు అంటున్నది నిజమేనా? తను గౌతమ్ వలలో పడి పోయిందా? గౌతమ్‌ని తను ప్రేమిస్తున్నదా?

ఆ మాట అనుకోగానే సిగ్గుతోపాటు పులకరింత కూడా కలిగింది."ఈ వయసులో ప్రేమేమిటి తనకు! అయినా తనలో ఏం ఉందని గౌతమ్ తనని ప్రేమిస్తాడు? అయినా తనకు, ఆయనకి పోలికెక్కడ? అయినా ఇదేమిటి?

ఆ రాత్రి తొమ్మిది గంటల ప్రాంతాలలో వచ్చాడు గౌతమ్. శ్యామలే తలుపు తెరిచింది. గుప్పున కొట్టింది వాసన. బ్రాందీనో, విస్కీనో అనుకుంది శ్యామల. వాసు దగ్గర అలవాటు అవటంవల్ల ఎఫెక్ట్ ఏమీ కలగలేదు శ్యామలకి.

శ్యామలని చూసి. అదో రకంగా చూశాడు గౌతమ్. చూపులు మరల్చుకుంది శ్యామల. తడబడే అడుగులతో లోనికి నడిచాడు. అతన్ని పడిపోకుండా పట్టుకొని, అతడి గదిలోకి ప్రవేశించింది మొదటిసారిగా.

అతన్ని బెడ్ మీదకు చేర్చి, బూట్లు విప్పి, టై వదులు చేసి, షర్ట్ గుండీలుతీసి, దుప్పటి కప్పి, వెళ్ళిపోయింది శ్యామల లైటు ఆర్పి.

అతడి గది కెదురుగానే శ్యామల గది ఉంది. ఆ రెండు గదులకు మధ్య గుమ్మానికి ఎదురుది వాసు ఉన్న గది.

గౌతమ్ రావటం, శ్యామల అతన్ని లోపలికి చేర్చటం మొదలైనవి అన్నీ గమనిస్తున్నాడు వాసు. అతడి గదిలోకి వెళ్ళినపుడు మరలా శ్యామలమీద ఎగిరాడు. శ్యామల ఏమీ మాట్లాడలేదు. మౌనంగా నీళ్ళ కూజా అతడికి అందు బాటులో ఉంచి వెళ్ళిపోయింది.

వాసు గొణుక్కుంటూనే ఉన్నాడు.

7

ఎందుకో మెలకువ వచ్చింది శ్యామలకి. అరనిముషం సేపు అలానే బెడ్ మీద ఉండిపోయింది.

తనకి మెలకువ ఎందుకొచ్చినట్లు? ఏదో 'దబ్'మన్న శబ్దం విన్పించింది నిద్రలో. ఏమిటది? ఒకవేళ వాసుగాని క్రిందకి దొర్లలేదు గదా నిద్రలో.

చటుక్కున లేచి నిలబడింది. చెదిరిన చీరని సరిచేసు కుంది. గదిలోపల బెడ్ లాంప్ వెలుగుతూంది.

లైటు వేసింది, తలుపులవద్దకు నడిచి తలుపులు తెరిచి చూసింది. ఎదురుగానున్న గౌతమ్ గది తలుపులు మూసి ఉన్నాయి. పుడిప్రక్కగానున్న వాసు గది తలుపులు కూడా మూసివున్నాయి.

వాసు గదిపద్దకు నడిచి, నెమ్మదిగా తలుపుల్ని తోసింది.

లోపల కూడా బెడ్‌లాంప్ వెలుగుతూంది. బెడ్‌మీద వాసు పడుకొనివున్నాడు. అతని కళ్ళు తెరుచుకొనే ఉన్నాయి.

తన గదిలోకి ప్రవేశించిన శ్యామలని చూసి, మాట్లాడ వద్దన్నట్లు సైగచేశాడు వాసు. శ్యామలకి అయోమయం అయిపోయింది.

వాసు సైగననుసరించి అతనివద్దకు నడిచింది. ప్రక్కనే ఉన్న అద్దాల కిటికీవైపు చూపించాడు.

వాసుకి కూడా ఎవరో ఆ కాంపౌండ్ గోడ దూకినట్లు అనుమానం రావటంతోనే మెలకువ వచ్చింది. కాలునొప్పి కూడా తగ్గిపోవటంవల్ల మత్తుమందు ఇవ్వబడలేదు.

కిటికీలోనుంచి చూసింది శ్యామల. బయట కన్పించిన దృశ్యం చూసి నిర్ఘాంతపోయింది.

దూరంగా చిన్న బ్యాటరీలైటు పట్టుకుని ఉన్నారెవరో. ఆ కాంతిలో నేలమీద పడివున్న ఒక వ్యక్తి కన్పించాడామెకు. అతనెవరో శ్యామలకు తెలియదు. బ్యాటరీలైటు పట్టుకున్నది కూడా ఎవరో ఆ చీకట్లో కన్పించటంలేదు.

ఇంతలో లైటు ఆరిపోయి, చీకటి ఆవరించింది. మరి కొద్దిసేపు చూసింది లైటు మరలా వెలుగుతుందేమోనని. కాని వెలగలేదు.

వాసుతో లోగొంతుతో చెప్పింది తను చూసిన దృశ్యం గురించి. అది విని ఆలోచనలో పడ్డాడు వాసు. అతడిని వదిలి బయటికి నడిచింది. గౌతమ్ గదిలోకి నడిచి, ఆశ్చర్యంతో నిల్చుండిపోయింది.

లోపల గౌతమ్ లేడు. తాగి మత్తులో పడిన వ్యక్తి తెల్లవారేవరకు లేవలేని వ్యక్తి ఏమైనట్లు?

టైం చూసింది. పదకొండు గంటలు దాటింది రాత్రి.

శ్యామలకు భయంవేసింది. ఏదో గూడుపుఠాణీ జరుగుతుందన్న అనుమానం కలిగిందామెకు. చటుక్కున వెనుదిరిగింది, గుమ్మంలో శబ్దం అయి.

అప్పుడే ద్వారం తెరుచుకొని లోనికి ప్రవేశిస్తున్న గౌతమ్ నైట్‌డ్రెస్‌లో ఉన్నాడు. అతని చేతిలో బ్యాటరీ లైటు ఉంది.

తన గది ముందు నిలబడిన శ్యామలని చూడగానే అతని భృకుటి కొద్దిగా ముడివడింది.

"మీరా?" ఆశ్చర్యంతో అడిగింది శ్యామల.

"మిస్ శ్యామల! దయచేసి యిక్కడిదంతా మర్చిపోండి. రేపుదయం అంతా వివరంగా చెబుతాను. మీకు నిద్రపట్టదని తెలుసు. ఇవిగో నిద్రమాత్రలు. వాసుగారికి కూడా!"

అని జేబులోనుంచి తీసి యిచ్చాడు. మౌనంగా అందుకుంది వాటిని. తన గది తలుపులు మూసుకున్నాడు గౌతమ్. వాసు గదిలోకి ప్రవేసించింది శ్యామల.

"ఏం జరిగింది? నీతో ఎవరు మాట్లాడేది? గౌతమేనా?" అనుమానంతో ప్రశ్నించాడు వాసు.

శ్యామల జవాబు చెప్పలేదు.

"నాకు తెలుసు. నువ్వు వాడి వలలో పడిపోయావు. నిన్ను మెల్లిగా బుట్టలోకి లాక్కుంటున్నాడు. నా మాట విను. వాడివల్ల నీకు ప్రమాదం" ఇంకా ఏదో అనబోతున్న వాసు నోటిలో మాత్రలువేసి, నీళ్ళు పోసింది.

"పడుకో. రేపు అంతా చెబుతాను."

చకచక తన గదిలోకి నడిచి తానూ మాత్రలు వేసుకొంది.

అరగంట తర్వాత గౌతమ్ బయటికిపోవడం ఆమెకి తెలియదు.

8

మర్నాడు ఉదయం కాఫీ, టిఫిన్‌లతో గౌతమ్ గదిలోకి ప్రవేశించింది శ్యామల. ఆమెని ఆగమన్నట్లు సైగచేశాడు గౌతమ్. అప్పటికే అతను తయారయి ఉన్నాడు.

"మిస్ శ్యామలః రాత్రి నీకొక పరీక్ష పెట్టాను. అందులో నెగ్గావు" అంటున్న అతనివైపు అర్థంగాక చూసింది శ్యామల.

"నా భార్య చనిపోయి చాలాకాలం అవుతూంది. తర్వాత నన్ను వివాహం చేసుకొనమని ఎంతోమంది చెప్పారు. అయినా ఎవరినీ చేసుకోలేదు. వివాహం అంటే యిష్టంలేక కాదు.

నిన్ను చూసినపుడే ఎందుకో నీ మీద సదభిప్రాయం కల్గింది. నీ గత చరిత్ర విన్నా. నీమీద ఆ అభిప్రాయం పోలేదు. అయినా నీమీద అనుమానం తీరక, రకరకాలుగా టెస్ట్ చేశాను.

నా సిరి సంపదలు, భోగ భాగ్యాలు నాలో మార్పు తెస్తాయేమోనని చూశాను. కాని అవి నీ మీద ఎటువంటి ప్రభావాన్నీ చూపించలేక పోయాయి.

రాత్రి తాగి వచ్చాను, నిజానికి నాకు బాగా అలవాటయి పోయింది, ఎంత తాగినా కూడా మామూలు మనిషిలాగే ప్రవర్తించగలను. గుమ్మంలో నిన్ను చూడగానే మరో ఆలోచన కల్గింది. తడబడినట్లు నటించాను. అయినా నన్ను అసహ్యించుకోలేదు నువ్వు.

నీ గదిలో నా భార్యకు సంబంధించిన నగలు, చీరెలు మొదలయినవి ఉన్నాయి. వాటిని తాకలేదు నీవు. నీ మనస్సు నాకు బోధపడింది. పరిస్థితులవల్ల దొంగగా మారేవే, కాని, దొంగవి కాదు."

ఆగాడు గౌతమ్ శ్యామల గుండెలు కొట్టు కుంటు న్నాయి వేగంగా.

"నీ ప్రవర్తన అంతా పరిశీలించాక, నువ్వేనాకు తగిన భార్యవని తలిచాను. నీ గత చరిత్రతో నాకు పనిలేదు, నీ కిష్టం అయితే పెళ్ళిచేసు కుంటాను."

శ్యామలలో ఆనందోద్రేకాలు మితి మీరాయి. పట్టరాని ఆనందంతో, చటుక్కున అతని కాళ్ళమీదపడి ఏడవ సాగింది. ఆమె జుట్టు సరిచేస్తూ, తల నిమురుతూ ఉండి పోయాడు గౌతమ్.

అయిదు నిమిషాలనంతరం తేరుకొంది శ్యామల.

ఇరువురు విడిపోయారు.

ముఖం కడుక్కొని వాసుగదిలోకి ప్రవేశించింది శ్యామల. గౌతమ్ వెళ్ళిపోయాడు.

"ఏమిటీవేళ ఆనందంగా కన్పిస్తున్నావ్?" అని వాసు అనేసరికి ఉలిక్కిపడింది శ్యామల.

వాసు అనుమానంగా ఆమెవంక చూశాడు.

వాసు ఏమవుతాడు? తనని నమ్ముకొని ఉన్నాడు. తనకి ఆధారం లేనప్పుడు సాయపడ్డాడు. అతనెటువంటి వాడ యినా కాని, తనకు సహాయం చేశాడు.

"ఏమయింది? ఆ గౌతమే నీ కేదో ఆశచూపి ఉంటాడు. పెళ్ళి చేసుకుంటా నన్నాడా? వాడి మాటలు నమ్మకు. నీకు ద్రోహం తలపెడుతున్నాడని నా మనస్సు చెబుతోంది."

వాసువైపు ఈసడింపుగా చూసింది శ్యామల,

"హత్యలు, దుర్మార్గాలు చేసే నాకూ మనసంటూ ఉందా?" అన్నట్లుంది ఆ చూపు. మౌనంగా వెళ్ళిపోయింది, వాసు పిలుస్తున్నా విన్పించుకోకుండా.

9

కాంపౌండ్ తలుపులు నెట్టుకు వస్తున్న సబ్-ఇన్స్పెక్టర్ని చూడగానే అదిరిపోయాడు వాసు. అంతకుముందు, అతను వచ్చి వెళ్ళిన సంగతి వాసుకి తెలియదు.

గుమ్మానికి ఎదురుగా ఉన్న తలుపులు తెరిచే ఉన్నాయి. బయట గుమ్మం తలుపులు కూడా బార్లా తెరవబడి ఉన్నాయి. శ్యామల మరిచిపోయి ఉంటుందా? లేక కావాలనే అలా చేసిందా?

తను తప్పించుకోవాలి. చటుక్కున పక్కకు దొర్లి, నేలమీదకు పడ్డాడు. భరించలేనిబాధ. గాయం రేగింది. పళ్ళ బిగువున బాధని సహించాడు. బెడ్ క్రింద దూరాడు.

తన సంగతి ఈ ఇన్స్పెక్టర్కి ఎలా తెలిసింది? ఆ గౌతమ్గాడేచెప్పి ఉంటాడు. శ్యామలని తనకు దక్కకుండా చేయాలని చూస్తున్నాడు. వీడి ఆట ఎలాగయినా కట్టించాలి.

సుందర్రావు లోనికి ప్రవేశించాడు. అతని అడుగుల చప్పుడువిని శ్యామల తన బెడ్రూంకి యివతలవున్న కిచెన్లోనుంచి బయటికి వచ్చింది. 'డ్రస్'లో ఉన్న సుందర్ని చూడగానే, ఆమె గుండె ఝల్లుమంది.

అప్పటికే సుందర్, తెరిచిఉన్న గదివంకచూసి, సోఫాలో కూర్చున్నాడు. ఆ గదిలో వారిద్దరేగాక, మరో వ్యక్తి కూడా ఉండి ఉండాలని, నలిగిన బెడ్మీది బట్టలను పట్టి ఊహించాడు. అయితే ఎవరూ కన్పించలేదు.

"మిస్ శ్యామలా! నిజం చెప్పండి గౌతమ్కు మీరే మపుతారు?"

శ్యామల జవాబు యిచ్చేలోపలే ప్రత్యక్షమయ్యాడు గౌతమ్ గుమ్మంలో.

సుందర్‌తోపాటు శ్యామలకూడా ఆశ్చర్యపోయింది. రోజూ మధ్యాహ్నం ఒంటిగంటకు వచ్చే గౌతమ్ ఆ వేళ ప్పుడు రావటం శ్యామలకు ఆశ్చర్యంతోపాటు ఆనందాన్ని కూడా యిచ్చింది. అతనే లేకపోతే ఇన్‌స్పెక్టర్ తనని ఎన్ని ప్రశ్నలతో వేధించేవాడు?

సుందర్ మాట మార్చేశాడు వెంటనే. "హల్లో గౌతమ్‌గారు! త్వరగా వచ్చేశారే! అప్పుడే హంటింగ్ అయిపోయిందా?"

"అవును ఇన్‌స్పెక్టర్! ఈ రోజు విసుగ్గా ఉంది. ఏమిటీ వేళ యిలా దయచేశారు?" సోఫాలో కూర్చొంటూ ప్రశ్నించాడు గౌతమ్.

"మా కానిస్టేబుల్ వీర్రాజు రాత్రినుంచి కన్పించటం లేదు. అతని ఆచూకీ తీస్తూ యిటువచ్చి, దగ్గరేకదా, మిమ్మల్నొకసారి చూసిపోదామని వొచ్చాను." అన్నాడు సుందర్ గౌతమ్ ముఖ కవళికల్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ.

గౌతమ్ ముఖంలో ఎటువంటి భావంలేదు. "అలాగా? ఏమయ్యాడు?"

"అది తెలియటం లేదు." అన్నాడు సుందర్.

తర్వాత ఒక పావుగంట ఉండి వెళ్ళిపోయాడు సుంద ర్రావు. శ్యామల వాసుగదిలోకి పారింది. మంచం క్రింద నుంచి అంతా వింటూండిన వాసు, సుందర్ వెళ్ళిపోగానే బయట పడ్డాడు.

అతన్ని ఆ స్థితిలో చూసిన శ్యామలకు నవ్వొచ్చింది. కాని తమాయించుకుంది.

గౌతమ్ తన గదిలోకి వెళ్ళటం గ్రహించి, మెల్లిగా అన్నాడు వాసు "శ్యామలా! ఇప్పటికయినా అర్థం అయిం

దను కుంటా ఈ గౌతమ్ మనం అనుకుంటున్నంత అమా యకుడుకాడు. ఏదో గూఢపుఠాణీ జరుపుతున్నాడు. ఆ వీర్రాజు మాయం అవటానికి, ఆ గౌతమ్‌కి ఏదో సంబంధం ఉండి ఉంటుంది. నా మాటనమ్ము. యిక్కణ్నుంచి వెళ్ళి పోదాం!"

శ్యామల ఎటూ నిర్ధారించు కోలేక, సందిగ్ధంలో పడింది. రాత్రి జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది. ఆ క్రింద పడిన వ్యక్తి వీర్రాజు? అతని కేమయింది? అతనిక్కడికి ఎందు కొచ్చాడు?

గౌతమ్, వాసు గదిలోకి అడుగు పెట్టాడు. అతనిని చూడగానే వాసు కోపం కట్టలు తెంచుకుంది.

"నీ మోసం నాకు తెలుసు. నా శ్యామలకి లేనిపోని ఆశలు చూపి, లొంగ దీసుకున్నావు. నీ మోసం ఆమె గ్రహించలేక పోతోంది. నీ అంతు తేల్చందే నిద్రపోను." గౌతమ్ మీద ఎగిరాడు వాసు.

శ్యామల అవమానంతో గౌతమ్‌వైపుచూసి, తల దించు కుంది.

"మిస్ శ్యామలా! విన్నావుగా వాసుగారి మాటలు. నీ అభిప్రాయం చెప్పు. తీరిగ్గా ఆలోచించుకునే చెప్పు. అత నన్నట్లు వీర్రాజు మాయం అవటానికి, నాకూ సంబంధం వుంది.

ఇన్‌స్పెక్టర్ సుందర్‌కి మనమీద అనుమానం వొచ్చింది. వీర్రాజుని కాపలాగా పంపాడు. అదిగమనించిన నేను, అత నితో తలపడ్డాను. ప్రమాదవశాత్తు అతని ప్రాణంపో యింది." ఆగాడు గౌతమ్. మిగిలిన యిద్దరు వింటున్నారు.

"ఆ వీర్రాజు యిక్కణ్నుంచి వెళితే మీ గుట్టు బయట పడుతుంది. డాక్టరుకి డబ్బు ముట్టచెప్పి నోరు మూయించాను.

కాని వీర్రాజు తత్వం నాకు తెలుసు. డబ్బుకి లొంగడు. అందుకే అతన్ని...."

"చంపావు" అందుకున్నాడు వాసు. "డాక్టరుకి డబ్బు ముట్టచెప్పటంలో ఉద్దేశ్యమేమిటి? వీర్రాజుని చంపిందెందుకు? శ్యామలకోసం అవునా?" అరిచాడు వాసు.

"ష్! మీరేమనుకున్నా నాకు ఫర్వాలేదు. ఇదంతా మీ మంచి కోసమే చేశాను. మిస్ శ్యామలా! సాయంత్రం నీ నిర్ణయం తెలుపు. అర్జెంటుగా మద్రాసు వెళుతున్నాను రాత్రికి. ఒక విషయం. నువ్వు గనక నాతో వస్తే వాసు గురించి దిగులు పడనవసరంలేదు. అతని విషయం నేను చూసుకుంటాను."

"అవును. పోలీసులకు పట్టిచ్చి" కసిగా అన్నాడు వాసు.

గౌతమ్ అతనివైపు మామూలుగా చూసి, వెళ్ళిపోయాడు. శ్యామల నిర్ఘాంతపోయి చూస్తుండిపోయింది.

"శ్యామలా! నువ్వు వెళ్ళటానికి వీల్లేదు!"

వాసువైపు మామూలుగా చూసి, బయటకు నడిచింది శ్యామల. ఆమె మనస్సంతా గజిబిజి అయిపోయింది.

10

సుందర్ పోలీస్‌స్టేషన్‌కు తిరిగి వచ్చేసరికి అతనికోసం ముఖ్యమైన వార్త ఒకటి సిద్ధంగా ఉంది.

ఊరి చివర ట్రంక్ రోడ్ ఇవతల తుప్పల మధ్య వీర్రాజు శవం ఉంది.

వెంటనే వెళ్ళి చూశాడు సుందర్. వీర్రాజు అక్కడే చంపబడలేదని, ఎక్కడో చంపి ఇక్కడ పారేశారని అర్థం చేసుకున్నాడు.

తననుకున్న దానికంటె పెద్ద గూడాపుఠాణీనే జరుగు

తున్నదన్పించింది. దీనితో గౌతమ్‌కు సంబంధం కూడా ఉందని అర్థం అయింది. ఎందుచేతంటే, గౌతమ్‌ని 'వాచ్' చేయమని తనే వీర్రాజుకి చెప్పాడు. వీర్రాజుని వాళ్ళు గమనించి ఉంటారు. అడ్డు తొలిగించుకున్నారు. అయితే ఈ హత్య గౌతమ్ చేశాడా, లేదా అన్నది తెలియదు.

శ్యామలకు ఇందులో భాగం వుందా? అసలా అమ్మాయి ఎవరు? గౌతమ్‌కి, ఆమెకీ ఏమిటి సంబంధం? పైగా తన కంట పడకుండా ఉన్న మూడో మనిషి ఎవరు?

హఠాత్తుగా గౌతమ్ మాటలు గుర్తుకొచ్చాయి. వెంటనే మద్రాసుకి ట్రంక్ కాలు చేసి మాట్లాడాడు. అక్కడినుంచి వచ్చే వివరాలకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు.

ఒకగంట తర్వాత మద్రాసునుంచి వచ్చిన సమాచారం విని నిర్ఘాంతపోయాడు ఇన్‌స్పెక్టర్ సుందర్. అతని బుర్ర పనిచేయటం మానేసింది ఒక్క క్షణం.

చటుక్కున లేచి నిలబడ్డాడు. కానిస్టేబుల్స్‌ని కేకేసి బయలుదేరాడు హడావిడిగా.

ఏదో పెద్ద బందిపోటు దొంగలను పట్టుకోవడాని వెడుతున్నట్లు బయలుదేరిన సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్స్‌లను చూసి అచ్చెరువొందారు జనం.

జీప్, గౌతమ్ ఇంటి ముందాగింది. కాని ఇంటి బయట వేలాడుతున్న తాళంకప్ప అతన్ని వెక్కిరించింది.

ఆశ్చర్యపోయాడు సబ్ ఇన్‌స్పెక్టర్ సుందర్. గౌతమ్ ఏమయినట్లు? ఇంత హఠాత్తుగా ఏమయ్యాడు? తను అతనిని పసికట్టినట్లు గుర్తించాడా? శ్యామల ఏమయింది?

జీప్ కదలబోతుండగా, ఎవరో కానిస్టేబుల్ అరవటంతో అదిరిపడి, జీపు ఆపేశాడు డ్రైవర్.

శాంతి విప్లవం అవతరిస్తుంది.
తుపాకితో విప్లవం సాధించాలనిఅనుకుంటే అదిఆటవికం.
రక్తపాతం అత్యంత బార్బరికం.
విప్లవం రావాలి శాంతి వెలిగించే నవచేతనలో నుంచి
మేము ప్రోగిస్తున్నది అదే విపంచి.

"శాంతి విప్లవం"

రాజకీయ తెలుగు వారపత్రిక

ఎడిటర్: కె. ఎస్. కుమార్

భారత ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి నాయకత్వంలో దేశం ముందడుగు వేస్తున్నది. ఈ నగ్న సత్యాన్ని ఎవరూ కాదనలేరు. ప్రభుత్వ ప్రణాళికలకు ప్రజల సహకారం ఎంతో అవసరం. అందుకు అత్యంత ప్రచారం జరగాలి. "శాంతి విప్లవం" యొక్క ఉద్దేశం అదే.

విడి ప్రతి: 30 పైసలు

సంవత్సర చందా రూ. 15-00

వివరాలకు:

ఎడిటర్: శాంతి విప్లవం
నెం. 17-5-338/A.
మాతాకిడ్కి.
డబీర్‌పురా.
హైద్రాబాద్-500 024.

"సార్! లోపల్నుంచి ఎవరో తలుపు తడుతున్నట్లు న్నారు!"

క్రిందికి దిగి పరుగెత్తాడు సుందరరావు.

నిజమే! ఎవరో తలుపు తడుతూ, అరుస్తున్నారు.

పది నిమిషాలనంతరం తాళంకప్ప ఊడకొట్టి, లోనికి ప్రవేశించారు. లోని దృశ్యం చూసి ప్రమాన్పడి నిలుచుండి పోయారు.

కొన ఊపిరితో పడిపోయి వున్నాడొక వ్యక్తి. అతన్ని ఇంతకు ముందు చూడలేదు సుందర్. అతని ఒళ్ళంతా రక్తసిక్తం అయిపోయింది. మధ్య గదిలోనుంచి, అక్కడికి దెక్కుంటూ వచ్చినట్లు చారలు కన్పిస్తున్నాయి.

మూసుకు పోతున్న కళ్ళను బలవంతంగా తెరిచి చూశాడు వాసు. అతని కళ్ళకు సబ్‌యిన్‌స్పెక్టర్ కన్పించాడు.

ఆ వ్యక్తికి చికిత్స జరిగినా బ్రతకటం కష్టం అని గ్రహించాడు సుందర్. అతను ఏదో చెబుతుండటం, అతని పెదాల కదలికవల్ల తెలుసుకొని చెవిని, పెదాల దగ్గరికి చేర్చాడు. సుందర్‌కి ఏమీ విన్పించలేదు-'మద్రాసు గౌతమ్' అన్నమాటలు తప్ప. వాసు తల వాల్చేశాడు.

దారుణంగా పొడిచి చంపారు అతన్ని. ఇద్దరు కానిస్టేబుల్సని అక్కడే ఉంచి, బయటకు పరుగెత్తాడు సుందర్,

11

గౌతమ్‌తో వస్తానని తల ఊపిందేగాని, తరువాత చాలా బాధపడింది శ్యామల. వాసు హంతకుడే కావచ్చు. కాని తనని మనస్ఫూర్తిగా కోరుతున్నాడు.

గౌతమ్ హెచ్చరించటంతో తన గదిలోకి నడిచింది. అప్పటికే గౌతమ్ నగలు, బట్టలు మొదలైనవాటితో రెడీ అయిపోయాడు.

అపరాధ పరిశోధన పోటీ-97 [ఫలితాలు]

ఆగస్టు '76 నెల "అపరాధ పరిశోధన పోటీ_97"కి సరియైన సమాధానాలు :

1. ధరలు.
2. లోభి.
3. అరబ్బు దేశాలు.
4. సంగీతం.
4. శరణార్థులు.

పై జవాబుల ప్రకారం ముగురు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి నవంబర్ '76 నుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక ఉచితంగా పంపగలము.

బహుమతి పొందిన విజేత :

(1) శ్రీ ఆర్. కె. సింగ్,
(సబ్ పోస్టుమాస్టరు)
మాచవరం పోస్టాఫీసు,
మెదక్ జిల్లా.

(2) శ్రీ మిట్టె శివానంద,
కేరాఫ్—మిట్టె ఎంటర్ ప్రైసెస్,
177 (2) IX, కారుస్ట్రీట్,
బళ్ళారి_583 101. (కర్ణాటక రాష్ట్రము)

(3) శ్రీమతి వి. రాజ్యలక్ష్మి,
కేరాఫ్—వి. అబ్బయ్య,
పోస్టు—అత్తలూరు,
తాలూకా—సత్తెనపల్లి,
(గుంటూరు జిల్లా.)

"రిక్షా పిలుచుకొస్తానుండు." అని వీధిలోకి వెళ్ళాడు.

శ్యామల వాసుని చూడాలని వెనక్కి తిరిగింది. కాని ఆగిపోయింది. ఆమె మనస్సులో తెలియని సంఘర్షణ జరుగుతూంది. తెలివితప్పి పడిపోవచ్చనుకుంది.

బయటకు నడిచింది. రిక్షా కాంపౌండ్‌లోకి తెచ్చాడు గౌతమ్. "రిక్షాలో కూర్చో! ఇప్పుడే వస్తా!" అని లోనికి వెళ్ళాడు.

తన గదిలో ఏదో మరిచిపోయినది గుర్తుకు రావటంతో రిక్షా దిగి వచ్చింది శ్యామల.

వాసు గది తలుపులు వేసివున్నాయి—

తలుపు తాళం రంధ్రంగుండా చూసింది.

మరుక్షణమే భయంతో వణికిపోయింది. కళ్ళు బైర్లు కమ్మాయి. నోట తడి ఆరిపోయింది.

లోపల పదునైన కత్తితో వాసు కడుపులో పొడుస్తున్నాడు గౌతమ్.

భయంగా వెనక్కి వచ్చింది శ్యామల. బయటికి వచ్చి, పరుగెత్తి రిక్షా ఎక్కింది.

"పోనీవ్! త్వరగా పోనివ్వు!" అరిచింది శ్యామల.

శ్యామల శరీరంనిండా చెమటలు. ఆమె భయపడటం చూసి ఏదో జరిగిందనుకున్నాడు రిక్షావాడు. కాని శ్యామల బ్రతిమాలి, ఏడుస్తూ పోనివ్వమనటంతో రిక్షాని పోనిచ్చాడు.

కాని కాంపౌండ్ గోడని దాటకముందే గౌతమ్ వెనక నుంచి వచ్చాడు. "ఈమెకు కొస్త పిచ్చి ఉంది. హాస్పిటల్‌లో చేర్చాలి. స్టేషన్‌కు పద!" అన్నాడు గౌతమ్ ఎక్కి కూర్చుని. భయంతో మూర్ఛపోయింది శ్యామల.

12

చనిపోతూ వాసు అన్న మాటలనుబట్టి గౌతమ్ మద్రాసు

సప్లిమెంట్ పోటీ-23 [ఫలితాలు]

ఆగస్టు '76 నెల "సప్లిమెంట్ పోటీ_23"కి సరియైన జవాబు :

106	107	105	103	104

పై విధంగా సరియైన జవాబు ఒకే ఒక్కరు వ్రాశారు. వీరికి నవంబరు '76 నెల నుండి ఒక ఏడాది పాటు "సప్లిమెంట్" ఉచితంగా పంపగలము.

బహుమతి పొందిన విజేత:—

శ్రీమతి టి. శకుంతల,

ఇంటి నెంబరు : 7/11,

పోస్టు : ఖుదావంద్ పూర్,

వయా : నందిపేట,

తాలూకా : ఆర్మూరు,

(నిజామాబాద్ జిల్లా)

పోవటానికి ప్రయత్నిస్తున్నాడని అర్థం అయింది ఇన్ స్పెక్టర్ సుందర్‌కి.

జీప్‌ని శరవేగంతో పోనిచ్చాడు తానే డ్రైవ్ చేస్తూ.

కొంతదూరం పోయిన తరవాత రోడ్ ప్రక్కన పడి వున్న మరో శవం అతని కళ్ళబడింది. అదెవరిదో తెల్సు అతనికి. రిక్షా రాముడిది. కత్తితో పొడిచి పోయారు.

గౌతమ్‌మీద పట్టరాని కోపం వచ్చింది సుందర్‌కి.

జీప్ ముందుకి కదిలింది. సుందర్‌కి ఆశ్చర్యం కల్గించిన దొకే విషయం. ఎంతో పకడ్బందీగా ప్లానులు వేస్తున్న గౌతమ్ ఎందుకు త్వరపడ్డాడు? ఇద్దరిని ఎందుకు చంపాల్సి వచ్చింది? భయపడి ఈ పని చేశాడా?

"సార్!"

సడన్ బ్రేక్‌తో ఆగింది జీపు. దూరంగా పొలాలకు అడ్డంపడి పరుగెత్తుతున్నారెవరో. అతని భుజంమీద ఎవరో ఆడవ్యక్తి ఉంది.

వారివైపు పరుగులు తీశారంతా "గౌతమ్! ఆగు!" అని అరుస్తూ.

గౌతమ్ ఆగి వెనక్కి తిరిగి చూశాడు.

అతని రూపమే మారిపోయి ఉంది. కళ్ళు భయంకరంగా ఉన్నాయి. పళ్ళు కొరుకుతున్నాడు. విపరీతమైన చెమటతో శరీరమంతా తడిసి, బట్టలు తడిసిపోయివున్నాయి. పరుగెత్తు కొని రావటంవల్ల ఆయాసంతో గుండెలు ఎగసిపడు తున్నాయి.

సబ్ ఇన్‌స్పెక్టర్ సుందర్ అతని దగ్గరకు వచ్చి కొద్ది దూరంలో టక్కున ఆగిపోయాడు.

గౌతమ్ చేతిలోని కత్తి శ్యామల మెడమీద ఉంది.

"ఇన్‌స్పెక్టర్! అక్కడే ఆగు. ముందుకి అడుగువేస్తే

అపరాధ పరిశోధన పోటీ-99

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు· ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు 30-10-'76 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు డిసెంబర్'76 నెల సంచికలో ప్రకటిస్తాము.*

1. చైనా ప్రజలను గత నెల అంతులేని విచారంలో ముంచివేసింది___? (తీవ్రభూకంపం, మావో మరణం.)

2. స్త్రీలలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది___? (దైవభక్తి, పతిభక్తి.)

3. ఇది అపచారమే___? (దైవదూషణ, గురునింద.)

4. నేటి విద్యార్థులలో ఇది బొత్తిగా కనిపించటం లేదు___? (గురుపూజ, క్రమశిక్షణ.)

5. ఇవి రాకూడదని కోరుకుంటారు అందరు___? (కష్టాలు, రోగాలు.)

శ్యామల తల తెగిపోతుంది!" భయంకరంగా ఉంది అతని గొంతు.

అసహాయంగా నిలబడిపోయాడు సుందర్. మిగిలిన పోలీసులు కూడా అతని వెనకే ఆగిపోయారు.

సరిగ్గా అప్పుడే స్పృహలోకి వచ్చింది శ్యామల. తన మెడమీద కత్తి. పోలీసులు. పరిస్థితి అర్థం అయింది.

చటుక్కున గౌతమ్ చేయి కొరికింది. కసుక్కున గొంతులోకి గుచ్చుకుంది కత్తి. 'కెవ్వు'మంటూ కేకవేసి, మూర్ఛపోయింది మరలా. ఎగిరి అతనిమీదకు దూకారు పోలీసులు.

13

నెమ్మదిగా కళ్ళు విప్పి చూసింది శ్యామల. తానొక హాస్పిటల్‌లో వున్నట్లు తెలుసుకుంది. ఆమె మంచం ప్రక్కనే ఇన్‌స్పెక్టర్ సుందర్.

అదిరిపడి లేవబోయింది. వారించాడు సుందర్.

"నీకేం భయంలేదు శ్యామలా! త్వరలోనే కోలుకుంటావు!"

శ్యామల మెడమీద తడుముకుంది. బాండేజి తగిలింది.

తరవాత సుందర్ చెప్పిన విషయాలు విని నిర్ఘాంతపోయింది.

"గౌతమ్ ఒక 'మానియాక్.' అంటే పిచ్చివాడని అర్థం చెప్పుకోవచ్చు. అయితే మామూలు పిచ్చివాళ్ళకి, ఇతనికీ భేదం వుంది. గౌతమ్‌కున్న పిచ్చి భయంకరమైనది.

స్త్రీలను మచ్చిక చేసుకొని, వారిని చిత్రహింసలు పెట్టి చంపటం అతనికి ఆనందం కల్గిస్తుంది. ఆ ఆనందం కోసం అతనేమయినా చేస్తాడు. ఎంతయినా ఖర్చుపెడతాడు.

మద్రాసులో బిజినెస్ అని అందరినీ నమ్మించాడు. ఎక్కడెక్కడో స్త్రీలకోసం వలలువేసి, తిరిగి వస్తుంటాడు,

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5_25 లకే మీ ఇంటిదగ్గర అందజేయబడతాయి. ఇప్పటికే వేలాది పాఠకులు సభ్యులుగా చేరారు. వెంటనే మీరూ చేరండి.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు రు. 5/- లు పంపవలసి వుంటుంది. పైకం మనియార్డరు ద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. సభ్యులకు పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5_25 (అన్ని ఖర్చులతో)లకే ప్రతినెలా వి.పి. ద్వారాగాని, మా ఏజెంట్ ద్వారాగాని పంపుతాము. మీ ఇంటిదగ్గరే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చు.

4. కాపీలు మీకు నెల నెలా రెగ్యులర్ గా పంపబడతాయి. ఏ నెలలోనైనా మీరు కాపీలు తీసుకోక పోతే, వి. పి. తిరిగొస్తే మీ సభ్యత్వము రద్దవుతుంది.

5. మీ చిరునామా మారితే వెంటనే తెలియజేయాలి.

6. సభ్యులకు ఏవైనా పాతకాపీలు కావలిస్తే వాటిని కూడ వి. పి. ద్వారా పంపగలము.

7. ప్రస్తుతము ఈ క్రింది సెంటర్లలో ఏజెంట్ ద్వారా 'హోమ్ డెలివరీ' ఏర్పాటు వున్నది: రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్టణం, హైద్రాబాదు, అనకాపల్లి, తెనాలి, పామిడి, కరీంనగర్, సీలేరు ప్రాజెక్టు, శ్రీశైలం ప్రాజెక్టు, హిందూపురం, తాడేపల్లిగూడెం, గుంటూరు, నెల్లూరు, భీమవరం, బెల్లంపల్లి, నంద్యాల, సూర్యాపేట, కర్నూలు.

కొంతమందిని పెళ్ళిచేసుకొని, మరికొంత మందిని బలవంతంగా తీసుకొచ్చి చంపుతుంటాను.

సబ్ యిన్స్పెక్టర్ సుందర్ కూడా ఆ ఊరికి వచ్చి మూడు నెలలే అవటంవల్ల, అతనూ అందరిలాగానే అతని మాటలు నమ్మాడు.

గౌతమ్ ఇచ్చిన అడ్రసు ప్రకారం మద్రాసు ఇలియట్స్ రోడ్‌లో వాకబు చేశారు పోలీసులు. ఆ వాకబులో వింతయిన విషయాలు అనేకం తెలిసాయి. గౌతమ్‌కి అసలు పెళ్ళే కాలేదు. ఆక్సిడెంట్‌లో మరణించినట్లు చెప్పుకుంటున్నామె అతని భార్యకాదు. ఆమె భర్తపేరు కూడా గౌతమేనని, కాని ఆయన కూడా కొద్దికాలం క్రితమే చనిపోయాడని తెలిసింది.

దీనినిబట్టి చూస్తే గౌతమ్ అసలు పేరు గౌతమ్ గాదని, ఎవరి పేరో అతనుపయోగించుకుంటున్నాడని వెల్లడయింది.

ఈ రకంగా పంజాబులో ఆరుగురిని, తమిళనాడులో మధ్యప్రదేశ్‌లో నలుగుర్ని చంపాడు. ఇతనికోసం ఆయా రాష్ట్రాల పోలీసులు వెదుకుతున్నారు.

ప్రస్తుతం గౌతమ్ అనబడే ఈ మానియాక్ 'ప్రభుత్వ కస్టడీ'లో ట్రీట్‌మెంటు పొందుతున్నాడు."

తానెంత భయంకరమైన పరిస్థితి నుంచి బయట పడిందో అర్థం అయింది శ్యామలకి.

వాసు చనిపోయాడని విని నివ్వెరపోలేదు. పోలీసులకు తన విషయం, వాసు విషయం, గౌతమ్ వ్యవహారం యావత్తు చెప్పింది.

ఆమెకు శిక్ష తగ్గే అవకాశం ఉందని చెప్పాడు సుందర్.

విరక్తిగా నవ్వుకుంది శ్యామల. "తన విషయం మరలా మొదటికి వచ్చింది" అనుకుంది. ***

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు, సైజు తెల్ల కాగితంపై వ్రాసి, ఈ నెల 10వ తేదీలోపల మాకు చేరేట్లు పంపండి.

ఇదే విధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. హోం. డె. సభ్యులు తమ నెంబరును స్పష్టంగా వ్రాయాలి. ఇతరులు తమవ్యాఖ్యలతో 30 పైసల స్టాంపులు జతపర్చి పంపాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 20/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు వచ్చే సంచికలో చూడండి. ★

గత నెల పోటీ ఫలితాలు

(1) సెప్టెంబర్ '76 నెల "అపరాధ పరిశోధన" మాసపత్రిక ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

ప్రాణాలతో పరిహాసం!

పాపాలకు పరిహారం!!

పంపినవారు: శ్రీ ఎల్. రామగోపాల్, బి. కాం., సిండికేట్ బ్యాంక్, దర్గమిట్ట, నెల్లూరు-3.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

కోట ముందు ప్రశాంతి!

వేటకు ముందు విశ్రాంతి!!

పంపినవారు: శ్రీ ఎన్. సత్యానంద్, మెయిన్ రోడ్, బెల్లంపల్లి, అదిలాబాద్ జిల్లా.

లేఖలు

ఈ నెల సప్లిమెంట్‌లోని నాలుగు నవలలలో 'దేవతా మూర్తి' 'నకిలీజన్మ' మార్వెలెస్‌గా వున్నాయి. 'ప్రేమ లేఖలు'లో కొత్తదనం కనిపించలేదు. 'ఖైదీ' సీరియల్‌ను మొత్తం ఒకే పుస్తకంగా అచ్చువేయండి. మరో సీరియల్ కోసము ఒళ్ళంతా కళ్ళు చేసుకొని ఎదురు చూస్తున్నాము.

—ఎన్. సాయికృష్ణప్రసాద్, హైద్రాబాదు-34

ముఖచిత్రాలు ఆకర్షణీయంగా వుంటున్నాయి. సప్లిమెంట్‌లోని వసుంధరగారి 'ప్రేమ పూజారులు' నవల అత్యుత్తమంగా వుందనడంలో సందేహంలేదు. ఇందులో గీత పాత్ర మమ్మల్నెంతగానో ఆకట్టుకున్నది. కథల్లో 'గురువు చెప్పని శిష్యుడు'కంటే 'కొండమీది రాక్షసుడు' నాకు బాగా నచ్చింది.

—సి. హెచ్. రాజా, బొంబాయి-12

ఈ నెల కథలలో గురువు చెప్పని శిష్యుడు, ప్రాణం తీసిన తేనెటీగలు, శ్యామల ఆత్మహత్య మాకు బాగా నచ్చిన కథలు. సుజనశ్రీగారి 'దేవతామూర్తి' నవల మంచి ఇంటరెస్టింగ్‌గా చాలా బాగుంది. రచయితకు మా అభినందనలు తెలుపగలరు. 'ఖైదీ'లాంటి సీరియల్‌ను నా దృష్టిలో ఇంత వరకు చదవలేదు. మరొక సీరియల్‌ను వెంటనే ప్రచురించగలరని ఆశిస్తున్నాము.

—బి. మురళీధర్, భీవండి.

సెప్టెంబర్'76 నెల సంచికలో కట్టుడుపళ్ళు, ప్రాణం తీసిన తేనెటీగలు, గురువు చెప్పని శిష్యుడు కథలు చాలా అభినందనీయంగా వున్నాయి. 'దేవతామూర్తి' సప్లిమెంట్‌కు చక్కని హైలెట్!

—డాక్టర్ వి. రామమోహనరావు, యానాం.

ఈ నెల రామగోపాల్‌గారి 'మృత్యువు నీడ' పత్రికలో చివరిదైనా, కథల్లో మొదటిదిగా ఉంది. ఇంద్రజాల కథ 'ముత్యపు చిప్పల దొంగలు' ఇంట్రెస్టింగ్‌గా వుంది. నవల్సులో 'నకిలీ జన్మ' అన్నింటిలో మిన్న. సప్లిమెంట్‌లో క్రొత్త సీరియల్ గురించి 'తొలిమాట'లో తెలుపగలరు.

—ఆర్. జీవన్, పెంటాకలాన్.

సెప్టెంబర్ నెల పత్రికలో గురువు చెప్పని శిష్యుడు, టెలిఫోను టెక్నిక్ కథలు చాలా బావున్నాయి. 'కొండమీది రాక్షసుడు' కథలో ఒకే పాయింటు మీద హంతకుడు పట్టుబడటం థియరీ బాగుంది. సప్లిమెంట్‌లో 'దేవతామూర్తి' నవల కథ కొంగ్రొత్త విధానంలో సాగింది.

—పి. పైడిశెట్టి, అనకాపల్లి.

"అపన" పత్రిక గెటప్ కథలు, నవలలు అన్నీ బాగున్నాయి. కాని విడిగా శీర్షికలు ఏమీ లేకపోవడం వలన మేము మిగతా పత్రికలను ఆశ్రయించవలసి వస్తుంది. ఈ నెల 'చిల్లరదొంగ చిదానందం' కథ హైలెట్.

—జె. కృష్ణారావు, గుంటూరు.

'గురువు చెప్పని శిష్యుడు' కథలో టెలిఫోన్ టెక్నిక్ బాగుంది. అలాగే రాంగోపాల్‌గారి 'మృత్యువునీడ' కథ కాస్త రిలీఫ్‌నిచ్చింది. సప్లిమెంట్‌లో శ్రీరాజ్‌గారి 'నకిలీ

జన్మ' బాగుంది. 'ఖైదీ' సీరియల్ ఖాళీని ఇంకా భర్తీ చేయ లేదు. ఆ వెలితిని త్వరలో తీరుస్తారని ఆశిస్తున్నాము.

—గోపి-చంద్, విజయవాడ.

సెప్టెంబర్ నెల సప్లిమెంట్‌లో వసుంధరగారి 'ప్రేమ పూజారులు' నవల అత్యుత్తమంగా, వజ్రాలలో కోహినూర్ వజ్రంలా వున్నది. రచయిత్రికి నా ధన్యవాదములు.

—వల్లూరు సాంబశివరావు, చిలుకలూరిపేట.

ఈ నెల కథలలో ప్రాణం తీపిన తేనెటీగలు, శ్యామల ఆత్మహత్య, బ్లాక్ మెయిలర్, కట్టుడుపళ్ళు ఉత్తమంగా వున్నాయి. సప్లిమెంట్‌లో అన్ని నవలలు బాగానేవున్నాయి. మీరే ఎన్నుకోండి, అని పాఠకులను అడుగుతున్నారే కానీ నిజానికి మీరే చక్కని నవలలను పడపోతలో ఎన్నుకుంటు న్నారు. సంపాదకవర్గం అభినందనీయులు.

—టి. ఎస్. శంకరరావ్, పామిడి.

ఈ నెల "అపన"లో కథలు అన్నీ ఆణిముత్యాలు. ముఖ్యముగా 'శ్యామల ఆత్మహత్య' కథలో రచయిత్రి ఊహించని మలుపులు తిప్పారు. రచయిత్రికి నా ధన్య వాదాలు. 'ఉరితాడు' కథ కొత్త పంథాలో సాగింది. సప్లిమెంట్‌లోని నవలలన్నీ మళ్ళీ మళ్ళీ చదవాలని పిస్తున్నవి.

—ఉప్పల గణేష్, రాజాం.

Editedand Published by S. DAMODAR REDDY (phone: 36959), 3-4-554 Narayanaguda Hyderabad-500029, and printed at Kranti press, Madras-1